మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 89 • పేజీలు:12+16 • వెల: రూ.5 | మంగళవారం • 27-2-2018 | www.manamnews.com | /manamnews

ఆయన ఎవరు?

- లైంగిక వేధింపులకు పాల్పడ్డారు
- ఓ దక్షిణాది గవర్నర్‌పై ఆరోపణలు
- హోం మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు
- రహస్య విచారణ ప్రారంభం
- గతంలో మేఘాలయ గవర్నర్‌పైనా..!
- అంతకుముందు ఏపీలో ఎన్డీ తివారీ

7లో..

అమరీందర్ సింగ్ అల్లుడిపై కేసు

- శింభోలి షుగర్స్ ఎండీగా గుర్పాల్‌సింగ్
- బ్యాంకుకు రూ.109 కోట్ల రుణం ఎగవేత
- అప్పు తీర్చేందుకు మరో 110 కోట్ల రుణం
- 2015లోనే సీబీఐకి ఫిర్యాదు.. 2017లో మరోసారి
- రెండు ఫిర్యాదుల మేరకు తాజాగా ఎఫ్ఐఆర్

7లో..



రైతన్నకు 5 లక్షల ప్రమాద బీమా

ప్రీమియం సర్కారే చెల్లిస్తది

- రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల మందికి లబ్ధి
- అన్ని పంటల తోటలకూ పెట్టుబడి సాయం
- ఏప్రిల్ నుంచి రైతులకు చెక్కుల జారీ
- కౌలు రైతులకు పెట్టుబడి సాయం లేదు
- ప్రతి గింజకూ మద్దతు ధర కల్పిస్తాం
- రైతుల కోసమే సమన్వయ సమితులు
- రాష్ట్ర సమితికి 10 వేల కోట్లు కేటాయిస్తాం
- 'ఉపాధి హామీ'ని అనుసంధానించాల్సిందే
- కరీంనగర్ 'రైతు సదస్సు'లో సీఎం కేసీఆర్



కరీంనగర్, ఫిబ్రవరి 26 (మనం న్యూస్ బ్యూరో):

తెలంగాణ రైతాంగానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభ వార్త ప్రకటించారు. రైతులకు రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించి, దాని ప్రీమియం ప్రభుత్వం తరపున చెల్లించనున్నట్లు తెలిపారు. అనారోగ్యం పాలైనా.. అకాల మరణం ప్రాప్తించినా ఈ ప్రమాద బీమా రైతన్న మిగతా 6లో..

బాత్ టబ్‌లో మునిగి..

శ్రీదేవి మృతికి కారణం అదే



ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడి

ప్రమాదవశాత్తూ పడిపోయింది

ఆమె శరీరంలో ఆల్కహాల్



- మరణం తీరుపై అనుమానాలు
- గుండెపోటు అని చెప్పడమెందుకు?
- బోనీ కపూర్‌పై ప్రశ్నల వర్షం
- భర్త పాస్‌పోర్ట్ స్వాధీనం

5లో..

ఇదీలోకం!



ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి నేటివరకు పోల్చుకుంటే.. ప్రభుత్వమే తారుమారైంది. ఇక ఈ సీసీ ఫుటేజీ ఎంత సార్..!



ఎంసెట్ తేదీలివే!



- మెడికల్ అభ్యర్థులకు మే 2-3 తేదీల్లో...
- 4-5-7 తేదీల్లో ఇంజనీరింగ్.. అగ్రికల్చర్
- ఆన్‌లైన్‌లో తొలిసారిగా 3 భాషల్లో పరీక్ష
- ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి):

తెలంగాణలో ఇంజనీరింగ్, వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'ఎంసెట్' షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి సోమవారం విడుదల చేశారు. ఈ మిగతా 6లో..



కాళేశ్వరం డిజైన్ మారుస్తం

పాత డిజైన్ ప్రకారం చేవెళ్లదాకా నీళ్లు.. ఎన్నికలెప్పుడొచ్చినా విజయం మాదే

- ఒక్క వాగ్దానాన్నీ నెరవేర్చని కేసీఆర్
- ఏకకాలంలో రుణమాఫీకి డబ్బులేవా?
- కాంగ్రెస్ నేతలంతా ఐక్యంగా ఉంటాం
- పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యం
- ప్రతి డ్వాక్రా సంఘానికీ లక్ష గ్రాంటు
- బస్సు యాత్ర ప్రారంభ సభలో ఉత్తమ్

హైదరాబాద్/వికారాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ మారుస్తమని పీసీసీ అధ్యక్షుడు మిగతా 3లో..

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రిపూట చలిగాలుల తీవ్రత కొనసాగుతుంది. గంటకు 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 36 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 34 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి మ.2.39 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పుష్యమి తె.3.49 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: మ.1.15-2.43; దుర్ముహూర్తం: ఉ.8.59-9.46, మ.2.25-3.12; రాహుకాలం: మ.3.24-4.51; అమృతఘడియలు: రా.10.02-11.29; శుభసమయం: సా.4.52-6.00.

సూర్యోదయం: 6.40

సూర్యాస్తమయం: 6.18



ఐటీ సేవల్లో తెలంగాణ భేష్

ఈ-గవర్నెన్స్‌లో ముందంజ

ఇతర రాష్ట్రాలు అనుసరించాలి

- కేంద్ర మంత్రి సీఆర్ చౌదరి ప్రశంసలు
- ఐటీతో మెరుగైన సేవలు అందిస్తున్నాం
- డిజిటల్ పాలనకు అత్యంత ప్రాధాన్యం
- ఈవోడీబీలో నంబర్ 1 స్థానం: కేటీఆర్
- ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సు ప్రారంభం


హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి):

ఐటీ రంగంలో, ఈ -గవర్నెన్స్‌లో తెలంగాణ పనితీరు అద్భుతంగా ఉందని మిగతా 6లో..

ఆరుగురిని మింగేసిన ఇయర్ ఫోన్స్

పాటలు వింటూ పట్టాలపై ఏడుగురి నడక

ఒకరు మినహా మిగిలిన అందరి దుర్మరణం





లఖ్‌నవ్, ఫిబ్రవరి 26:

పొట్టకూటి కోసం ప్రయాణమైన ఆ కుర్రాళ్ల బతుకులు రైలు పట్టాలపై చితికిపోయాయి. ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటూ పట్టాలపై నడిచి వెళ్తున్న వారిని రైలు ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా పిల్‌ఖువా పట్టణంలో ఈ ఘోరం జరిగింది. పిల్‌ఖువాకు చెందిన 14-15 ఏళ్ల వయసున్న ఏడుగురు కుర్రాళ్లు పెయింటింగ్ పనుల కోసం హైదరాబాద్‌కు వచ్చేందుకు సోమవారం తెల్లవారు జామున ఘజియాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. కానీ వారు ఎక్కాల్సిన రైలు మిగతా 6లో..

చీఫ్ విప్ కారుకు ప్రమాదం

- **ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు**



ప్రమాదానికి గురైన కొప్పుల ఈశ్వర్ వాహనం




కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 26(మనం న్యూస్): ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్‌కు చెందిన కారు సోమవారం ప్రమాదానికి గురయ్యింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కరీంనగర్‌లో సోమవారం జరిగిన రైతు సమన్వయ ప్రాంతీయ సదస్సుకు వస్తుండుగా ఈ ప్రమాదం జరిగింది. కొప్పుల ఈశ్వర్‌కు చెందిన కారులో డీజిల్ పోయించేందుకు డ్రైవర్ వాహనాన్ని తీసుకువస్తుండుగా ఎదురుగా వస్తున్న మరో కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో మంచిర్యాల జిల్లాకు చెందిన సుందారపు గోపాల్ అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తన కుమారుడి పెళ్లి పత్రికలను వేములవాడ రాజన్న ఆలయంలో ఇచ్చేందుకు వెళుతుండగా ప్రమాదానికి గురై గోపాల్ మరణించాడు. కాగా ప్రమాదం జరిగిన సమయంలో కొప్పుల ఈశ్వర్ వాహనంలో లేరు.

భాషా పండితుల కోర్సుల శిక్షణ కాలం పెంపు కుదరదు

- **రెండేళ్లకు పెంచాలన్న వ్యాజ్యాన్ని కోట్టేసిన హైకోర్టు**
- **పరీక్షల నిర్వహణకు మార్చి 15 వరకు గడువు**

హైదరాబాద్, ఫిబ్రవరి 26(మనం లీగల్ ప్రతినిధి): తెలంగాణలో భాషాపండితుల కోర్సుల్లో చేరే అభ్యర్థులకు శిక్షణ కాలాన్ని 9 నెలల నుంచి రెండేళ్లు చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ వాదన హైకోర్టులో వీగిపోయింది. తెలుగు, ఉర్దూ, హిందీ భాషలకు మాత్రమే తొమ్మిది నెలల శిక్షణ కోర్సులున్నాయని, మిగిలిన భాషలకు రెండేళ్ల శిక్షణ కోర్సులని ప్రభుత్వం హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. నేషనల్ కౌన్సెల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ రూల్స్ ప్రకారం తొమ్మిది నెలలే శిక్షణ కోర్సు వ్యవధి అని బెంచ్ స్పష్టం చేసింది. విద్యా ప్రమాణాలు పెంపు కోసం రెండేళ్లు చేయాలన్న ప్రయత్నం బాగానే ఉన్నా నేషనల్ కౌన్సిల్ రూల్స్‌కు అది విరుద్ధమని బెంచ్ పేర్కొంది. వీటీపీ



శిక్షణా తరగతుల కళాశాల కేసులో గతంలో సింగిల్ జడ్జి.. భాషా పండితుల శిక్షణా కోర్సులకు ఆరు వారాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై అప్పీల్ వ్యాజ్యాన్ని సోమవారం బెంచ్ కొట్టేయడంతో పరీక్షల గడువు పెంపునకు సమయం పెంచాలని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోరారు. దాంతో పరీక్షల నిర్వహణ గడువు మార్చి 15 వరకూ ఇస్తూ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

న్యాయవాదులకు ఆరోగ్య, ప్రమాద బీమా

- **వచ్చే నెలలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం**
- **న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ ప్రకటన**



హైదరాబాద్, ఫిబ్రవరి 26(మనం లీగల్ ప్రతినిధి):రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ కోసం చేపట్టబోయే పలు కార్యక్రమాలను ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభింప చేస్తామని తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ ప్రకటించింది. హైకోర్టులోని రాష్ట్ర అడ్వకేట్ జనరల్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశ వివరాలను ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో మార్చి నెలలో చేపట్టబోయే కార్యక్రమాలకు సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న 18 వేల మంది న్యాయవాదులకు రూ.2 లక్షల మేరకు ఆరోగ్య బీమా, చనిపోయిన న్యాయవాదుల కుటుంబాలకు ప్రమాద బీమా పథకం కింద రూ.10 లక్షలు, అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స అయ్యే వైద్య ఖర్చులు, జిల్లాల్లోని బార్ అసోసియేషన్లకు సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం, నల్సార్ విశ్వ విద్యాలయం సహకారంతో వచ్చే వేసవిలో న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సమావేశంలో తీర్మానం చేశారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులకు వచ్చిన రూ.15 కోట్ల వడ్డీని న్యాయవాదుల సంక్షేమ కోసం వెచ్చించాలని, మార్చి నెలాఖరులోగా లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని సమావేశం నిర్ణయించినట్లు ట్రస్ట్ నేతలు చెప్పారు. ఈ సమావేశంలో ట్రస్ట్ చైర్మన్, అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య


బీసీల బడ్జెట్ పదివేల కోట్లకు పెంచాలి

- **20 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ పెట్టాలి: ఆర్.కృష్ణయ్య**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(మనం ప్రతినిధి): వచ్చే ఆర్థిక సంవత్సరం బీసీల బడ్జెట్‌ను రూ. పదివేల కోట్లకు పెంచాలని, రూ.20వేల కోట్లతో బీసీలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ అధ్యక్షతన బీసీ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్య సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. అన్ని ప్రభుత్వ పథకాలలో బీసీలకు జనాభా ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసి ఇదే నిష్పత్తిలో బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఆధునీకరణ పేరుతో పరిశ్రమలు, యంత్రాలు రావడంతో కులవృత్తులు దెబ్బతిన్నాయని కులవృత్తులు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించవలసిన అవసరం ఉందని ఆయన తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ. 25 కోట్లనుంచి రూ.250కోట్లకు పెంచాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. మార్చి 7న రాష్ట్ర బీసీ కులాల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరపాలని నిర్ణయించామని, చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల అంశాన్ని చర్చిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు ఏడుకొండలు, బీరయ్యయాదవ్, అనిల్‌కుమార్, రామలింగం, సి.రాజేందర్, నర్సింహగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ కేబినెట్ కార్యదర్శి టీఎస్ఆర్ సుబ్రమణియన్ మృతి

- **ప్రధాని సహా పలువురు ప్రముఖుల నివాళి**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: కేంద్ర మాజీ కేబినెట్ కార్యదర్శి టీఎస్ఆర్ సుబ్రమణియన్(79) సోమవారం ఢిల్లీలో మరణించారు. 1961వ సంవత్సరం ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సుబ్రమణియన్ 1996 ఆగస్టు 1 నుంచి 1998 మార్చి 31 వరకు కేబినెట్ కార్యదర్శిగా పని చేశారు. ఓ ఐఏఎస్ అధికారిగా విధి నిర్వహణలో గుర్తింపు తెచ్చుకున్న సుబ్రమణియన్ ప్రజా సమస్యలపై పలు రచనలు కూడా చేశారు. సుబ్రమణియన్ మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రి జితేందర్ సింగ్, పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు సంతాపం ప్రకటించారు. సుబ్రమణియన్ మరణానికి గల కారణాలు తెలియలేదు.

యూకేలో భారీ పేలుడు

- **కూలిన భవనం.. నలుగురి మృతి**

లండన్, ఫిబ్రవరి 26: యూకేలోని లెస్టర్ నగరంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు మరణించగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ పేలుడుతో ఉగ్రవాదులకు సంబంధం లేదని అక్కడి పోలీసు అధికారులు చెబుతున్నారు. లెస్టర్‌లోని హింక్లే రోడ్డు ప్రాంతంలో ఉన్న రెండంతస్తుల భవనంలో ఆదివారం సాయంత్రం 7 గంటల (స్థానిక కాలమానం ప్రకారం) సమయంలో ఉన్నట్టుండి భారీ పేలుడు జరిగింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఓ షాపులో జరిగిన ఈ పేలుడు ధాటికి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కొద్ది క్షణాల్లోనే ఆ భవనం కుప్పకూలిపోయింది. ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా పొగ, దుమ్ముతో నిండిపోయింది. వెంటనే స్థానికులు అత్యవసర సేవల సిబ్బందికి సమాచారం అందించారు. ఆరు ఫైరింజన్ల అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అనంతరం సహాయ సిబ్బంది శిథిలాల తొలగింపు చేపట్టారు. నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురికి తీవ్రంగా గాయపడగా.. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. శిథిలాల తొలగింపు కొనసాగుతున్నందును మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ పేలుడును ఉగ్ర చర్యగా భావించడం లేదని, కారణాలపై లోతుగా దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

హై'సెక్యూరిటీ' లేనందునే.!

నాణ్యత లోపం.. కానరాని భద్రతా ప్రమాణాలు

- **హెచ్ఎస్ఆర్ ప్లేట్లపై వాహనదారుల నిరాసక్తత**
- **ఖైరతాబాద్ ఆర్టీఏలో పేరుకుపోయిన 21 వేల ప్లేట్లు**
- **రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య లక్షకు చేరువలో..**
- **సాధారణ ప్లేట్లవైపే వాహనదారుల మొగ్గు**



హైదరాబాద్, ఫిబ్రవరి 26(మనం ప్రతినిధి): వాహనాల భద్రత దష్ట్యా తీసుకొచ్చిన హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబరు ప్లేట్లు(హెచ్ఎస్ఆర్పీ) రవాణా శాఖ కార్యాలయాల్లో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. హెచ్ఎస్ఆర్ ప్లేట్ల విధానం ప్రారంభించి నాలుగేండ్లవుతున్నా ఇప్పటికీ బయట దొరికే సాధారణ నంబరు ప్లేట్లనే వాహనదారులు వినియోగిస్తున్నారు. ఒక్క ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలోనే 21 వేలకుపైగా హెచ్ఎస్ఆర్ ప్లేట్లు పేరుకుపోయాయి. దాదాపు లక్ష ప్లేట్లు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆయా రవాణాశాఖ కార్యాలయాల్లో కుప్పలుగా పడి ఉన్నాయి. హెచ్ఎస్ఆర్ ప్లేట్లలో ఉంటాయన్న ఫీచర్లు లేకపోవడం, ప్లేట్ల నాణ్యత లోపం, కొన్నాళ్లకే నంబర్లపై ఉన్న రంగు వెలిసిపోతుండడం, ప్లేటు బిగించుకోవడానికి ఆర్టీఏ కార్యాలయాల్లో ఎక్కువసేపు వేచి ఉండాల్సి రావడం, ప్లేట్లు బిగించే వద్ద అక్రమ వసూళ్ల దందా.. వెరసి వాహనదారులు బయట దొరికే నంబరు ప్లేట్లవైపే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు.. హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు బిగించుకోకపోతే తీసుకోవాల్సిన చర్యల గురించి సంబంధిత చట్టంలో ఎక్కడా కచ్చితంగా పేర్కొనలేదని ఆర్టీఏ అధికారులు అంటున్నారు. ఇందువల్లే తాము కఠిన చర్యలేవి తీసుకోలేకపోతున్నామని చెబుతున్నారు.

కోర్టు తీర్పుతో ప్రారంభం..

ఒక వాహనం నంబరు మరో వాహనానికి ఉపయోగించి చేసే అక్రమాలను కట్టడి చేసేందుకు, దేశవ్యాప్తంగా ఒకే రకమైన నంబరు ప్లేట్లు ఉండాలనే ఉద్దేశంతో హైసెక్యూరిటీ నంబరు ప్లేట్ల విధానాన్ని ప్రవేశపెట్టారు. 2013, డిసెంబర్ తర్వాత కొన్ని వాహనాలకు ఈ హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లనే వినియోగించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. 2014, జూన్ 8 నుంచి తెలంగాణలో హైసెక్యూరిటీ నంబరు ప్లేట్ల బిగింపు షురూ అయ్యింది. ఈ ప్లేట్ల బిగింపు పనిని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)కు అప్పగించారు. ఆర్టీసీ టెండర్లు పిలిచి ఢిల్లీ ఆధారిత లింక్ ఆటోటెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి పదేండ్లకు ఈ పనిని కట్టబెట్టింది. హెచ్ఎస్ఆర్ ప్లేట్లలో ఎన్నో సెక్యూరిటీ ఫీచర్లు దాగి ఉంటాయని, ఓ చిప్ కూడా ఉంటుందన్న ప్రచారం మొదట్లో జోరుగా సాగింది. కానీ, ఇలాంటి ఫీచర్లేవి హెచ్ఎస్ఆర్ ప్లేట్లలో కనబడట్లేదు.

బిగింపు రోజుకు 3 గంటలే...

కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక, ఒకటి రెండ్రోజుల్లో నంబరు కేటాయిస్తారు. కేటాయించిన నంబరు, బిగించుకోవాల్సిన తేదీని వాహనదారుని సెల్ నంబరుకు మెసేజ్ చేస్తారు. ఆర్టీసీతో ఒప్పందం ప్రకారం సదరు కంపెనీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో ఈ నంబరు ప్లేట్ల బిగింపు చేపట్టాలి. ఇందుకు విరుద్ధంగా ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకే ప్లేట్లు బిగిస్తున్నారు. ఇక్కడ నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రిజిస్టర్ అవుతుంటాయి. నంబరు ప్లేట్ల బిగింపు కోసం కూడా అదే సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. దీంతో క్యూలైన్‌లో వేచి ఉండలేక వాహనదారులు అసహనానికి గురవుతున్నారు. ప్రత్యేకంగా నంబరు ప్లేటు బిగింపుకోసం ఒక రోజును కేటాయించాల్సి వస్తోంది. లారీలు, ట్యాక్సీలు వంటి వాటి విషయంలో ఒక రోజు ఆదాయానికి గండి పడుతుండడంతో బయటే సాధారణ నంబరు ప్లేటు వేయించుకుంటున్నారు.

వంగిపోతున్న ప్లేట్లు..



హెచ్ఎస్ఆర్ ప్లేట్లు అల్యూమినియం లోహంతో 1ఎంఎం మందంతో తయారు చేస్తారు. లోహం నాణ్యతలో లోపం ఉండడంతో ద్విచక్ర వాహనం కాస్త వేగంగా వెళ్లినా ప్లేట్లు వంకర్లు తిరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ప్లేటుకు పైన రెండు వైపుల మాత్రమే రివిట్లు(స్క్రూలు) వేసి కిందవైపు వేయకపోవడం ఇందుకు మరో కారణం. వాహనాలు సర్వీసింగ్‌కు ఇచ్చినప్పుడు వాళ్లు రసాయనాల తో శుభ్రం చేస్తుంటారు. దీంతో ప్లేటు పైన ఉన్న నల్ల రంగు వెలిసిపో తోంది. ఇందుకు తోడు హెచ్ఎస్ఆర్పీ ధర కూడా ఎక్కువగానే ఉంది. కారు ముందు, వెనుక ప్లేటుకు కలిపి రూ.619 వసూలు చేస్తున్నారు. బయట రూ.4 వందలలోపే ప్లేట్లు లభిస్తున్నాయి. ఇంత ధర చెల్లించేందుకు ముందుకు రాకపోవడంతో, వాహన రిజిస్ట్రేషన్ సమయంలోనే నంబరు ప్లేటుకూ డబ్బులు కట్టించుకుంటున్నారు.

'ఫిట్టింగ్' చార్జీల దందా



రిజిస్ట్రేషన్ ఫీజుతోపాటే నంబరు ప్లేట్లకు డబ్బులు కడుతున్నప్పటికీ ఫిట్టింగ్ చార్జీల పేరుతో సంస్థ ఉద్యోగులు వాహనాన్ని బట్టి 50 నుంచి మూడొందల దాకా వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ వసూళ్ల దందా సంస్థ అధికారులకు తెలిసే జరుగుతోందన్న విమర్శలూ వస్తున్నాయి. కార్మిక చట్టం ప్రకారం ఇవ్వాల్సినంత వేతనం ఇవ్వకుండా, రూ.3, 4 వేలు మాత్రమే ఉద్యోగులకు సదరు కంపెనీ చెల్లిస్తోందట. ఈ కారణంతోనే వసూళ్లకు పాల్పడినా చూసి చూడనట్టు వదిలేస్తున్నారని విమర్శలొస్తున్నాయి. సదరు కంపెనీకి కాంట్రాక్ట్ అప్పజెప్పింది ఆర్టీసీ కాబట్టి మాకేమీ సంబంధం లేదన్నట్టు ఆర్టీఏ అధికారులు వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. 'వాహనదారుల కోరిక మేరకు ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఆదివారం కూడా ప్లేట్ల బిగింపు చేపట్టాం. ప్లేట్లు బిగించుకోని వాహనదారులకు ఫోన్ చేసి గుర్తుచేస్తున్నాం. ఆర్టీఏ కార్యాలయాల్లో స్థలాభావంతోనే ఉదయంపూట బిగింపు చేపట్టడంలేదు. ఫిట్టింగ్ చార్జీల పేరుతో డబ్బులు అడిగితే ఇవ్వొద్దు. అలా అడిగిన విషయాన్ని మా దృష్టికి తీసుకొస్తే సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకుంటా'మని కంపెనీ అధికారి ఒకరు చెప్పుకొచ్చారు.

ప్రేమికుడి అరాచకం

- ప్రేమించిన యువతి కిడ్నాప్
- ఆపై స్నేహితులతో కలిసి అత్యాచారం!
- యువతి తల్లికి వాట్సాప్ సందేశాలు
- లక్ష రూపాయల డబ్బు డిమాండ్
- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): ప్రియుడి మాటలు నమ్మి ఇంటి నుంచి బయటకు వచ్చిన ఓ యువతి దారుణంగా మోసపోయింది. గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లి ప్రేమించిన వ్యక్తితో పాటు అతని స్నేహితులు ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు. హైదరాబాద్ పాత బస్తీలోని చాంద్రాయణ గుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన సంచలనం రేపింది. చాంద్రాయణగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలోని బండ్లగూడ ప్రాంతానికి చెందిన ఓ యువతి అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడిని కొంతకాలంగా ప్రేమిస్తుంది. ఫిబ్రవరి 24వ తేదీన ఆ యువకుడు మాయమాటలు చెప్పి అమ్మాయిని తనతో తీసుకెళ్లాడు. రాత్రి అయినా అమ్మాయి ఇంటికి తిరిగిరాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ఆచూకీ కోసం ప్రయత్నించారు. యువతి సెల్‌ఫోన్‌కు కాల్ చేస్తే అందుబాటులో లేదని వస్తుంది. దీంతో ఏమి చేయాలో తెలియక వారు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే 26వ తేదీ సోమవారం సాయంత్రం అదృశ్యమైన అమ్మాయి ఫోన్ నుంచి ఆమె తల్లి వాట్సాప్‌కు ఓ వీడియో సందేశం వచ్చింది. వీడియోలో ఆ యువతి అర్ధనగ్నంగా ఉంది. అంతే కాకుండా అమ్మాయితో 1లక్ష రూపాయలు అడిగిస్తున్నట్లు ఉంది. దీంతో తల్లిదండ్రులు వెంటనే చాంద్రాయణగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం గాలిస్తున్నారు.

టాటా ఇన్‌స్టిట్యూట్‌పై చర్యలు తీసుకోండి

- **ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డికి జాజుల వినతి**




హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(మనం ప్రతినిధి): హైదరాబాద్‌లోని 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌సోషల్ సైన్స్' విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరయ్యేలా చర్యలు తీసుకొని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంఘాల నాయకులతో కలిసి ఉన్నత విద్యా మండలి చైర్మన్ పాపిరెడ్డికి ఈ మేకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని గత ఆరురోజులుగా బడుగు విద్యార్థులు టాటా ఇనిస్టిట్యూట్ ఎదుట ఆందోళన చేస్తున్న విషయాన్ని పాపిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ, ఎస్టీ బీసీ విద్యార్థులకు ఇంజినీరింగ్ చదువుతున్న అర్హులందరికీ తామే స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయిస్తామని యాజమాన్యం నోటిఫికేషన్ల చెప్పిందని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కానీ స్కాలర్‌షిప్‌లు మొత్తం ఇవ్వలేమని చెబుతోందని పేర్కొన్నారు.

రేషన్ సరుకులపై.. కమాండ్ కంట్రోల్ నిఘా!



- **జిల్లాల్లో సీసీసీ కేంద్రాల ఏర్పాటు**
- **రేపు సిద్దిపేటలో ప్రారంభం**
- **171 గోదాముల్లో 1700 సీసీ కెమెరాలు**



హైదరాబాద్, ఫిబ్రవరి 26(మనం ప్రతినిధి): రేషన్ సరుకుల తరలింపు, పంపిణీలలో అక్రమాలను నిరోధించడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నట్లు పౌరసరఫరాల కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. రేషన్ సరుకులను తీసుకెళ్లే లారీలకు ఇకపై జీపీఎస్ అనుసంధానించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో లారీల కదలికలను ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. గిడ్డంగుల నుంచి ప్రజలకు పంపిణీ చేసే దాకా ఎలాంటి అక్రమాలకు తావివ్వని రీతిలో పకడ్బందీగా నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా జిల్లాకో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీటన్నింటినీ హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి అనుసంధానించి అక్రమాలను అడ్డుకోనున్నట్లు వివరించారు. అలాగే ఈ-పాస్ విధానం ద్వారా సరుకులను పంపిణీ చేస్తామని తెలిపారు. పౌర సరఫరాల సంస్థకు కీలకమైన మండల స్థాయి నిల్వ కేంద్రాలపై నిఘా పెట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆనంద్ తెలిపారు. గత ఏడాది హైదరాబాద్ పౌరసరఫరాల భవన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ మంచి ఫలితాలనిస్తోందన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో, సరుకుల రవాణాపై మరింత గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసే ఉద్దేశంతో ప్రతి జిల్లాల్లోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. 31 జిల్లాల్లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో ఈ కేంద్రాల ఏర్పాటు దిశగా కసరత్తు ప్రారంభించామని కమిషనర్ ఆనంద్ వె ల్లడించారు. ఇందులో భాగంగా ఈ నెల 28న సిద్దిపేటలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు వచ్చేనెలలో నిజామాబాద్, వనపర్తి, గద్వాల్, కరీంనగర్, మరికొన్ని జిల్లాల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మండలస్థాయి 171 గోదాములలో 1700 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గోదాములో ప్రతి కదలికను గుర్తించేలా ఒక్కో గోదాం వద్ద 5 నుంచి 10 కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ ఈ ప్రక్రియ మరో వారం పది రోజుల్లో పూర్తికానుందన్నారు. గోదాముల పరిధిలో ఏం జరుగుతుందనే విషయంతో పాటు రేషన్ సరుకులు తరలించే వాహనాల కదలికలను గమనించేందుకు ఉన్నతాధికారుల కార్యాలయాలకు అనుసంధానిస్తున్నట్లు చెప్పారు. ఇవి రాత్రిపూట కూడా స్పష్టంగా రికార్డింగ్ చేసే సత్తా గల 2 మెగా పిక్సల్ కెమెరాలని, ఐపీ(ఇంటర్నెట్ ప్రొటోకాల్) అంటే ఎక్కడి నుంచైనా వీక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఆ కెమెరాలన్నీ కూడా 2 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్‌కు అనుసంధానం చేస్తామన్నారు. దీంతో పాటు నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారిపై పీడీ యాక్ట్ పెడతామని కమిషనర్ ఆనంద్ తెలిపారు.

నేడు కాళేశ్వరం ప్రాజెక్టుకు కర్ణాటక మీడియా అకాడమీ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): రాష్టంలో మీడియా అకాడమీ కార్యకలాపాలను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నీటి ప్రాజెక్టులను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవడానికి కర్ణాటక మీడియా అకాడమీ బృందం మంగళవారం రాష్ట్రంలో పర్యటించనున్నట్టు రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట కోమటిబండలో జరుగుతున్న మిషన్ భగీరథ పనులను పరిశీలిస్తారని, అనంతరం సుందిళ్లలో నిర్మిస్తున్న కాళేశ్వరం నీటి ప్రాజెక్టు పనులను, కన్నెపల్లిలో పంపు హౌజ్, రామడుగు సర్జికల్ పూల్‌ను సందర్శిస్తారని తెలిపారు. సందర్శన అనంతరం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. బుధవారం టీ-హబ్‌ను సందర్శించిన అనంతరం తెలంగాణ మీడియా అకాడమీ సమావేశ మందిరంలో పాలక మండలి సభ్యులతో సమావేశం అవుతారని తెలిపారు. తెలుగు వర్సిటిలో మీడియా అకాడమీ నిర్వహించే మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, అనా రోగ్యం(ప్రమాదం) బారిన పడిన 74 మంది లబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

కాళేశ్వరంపై మాట్లాడరా?


ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా కోరరా?.. కాంగ్రెస్‌కు మంత్రి హరీశ్‌రావు ప్రశ్న

- జైరాంరమేశ్ వ్యాఖ్యలపై ఆగ్రహం
- రాష్ట్రాన్ని ముంచింది కాంగ్రెస్సే
- కేంద్రం వివక్ష చూపుతోందని వ్యాఖ్య



సిద్దిపేట, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పట్ల జాతీయ పార్టీలు వివక్ష చూపిస్తున్నాయని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం ప్రత్యేక హోదా ఫైల్‌పై చేస్తామంటూ కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడాన్ని తాము తప్పుపట్టడం లేదని, కానీ పునర్విభజన చట్టంలో లేని ప్రత్యేక హోదాపై జైరాం రమేశ్ మాట్లాడడం సరైంది కాదని హరీశ్ అన్నారు. నాడు పోలవరానికి జాతీయ గుర్తింపునిచ్చిన కాంగ్రెస్, కాళేశ్వరం జాతీయ హోదాపై మాట్లాడకుండా అన్యాయం చేసిందన్నారు. సోమవారం సిద్దిపేటలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, బీబీ పాటిల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి పునర్విభజన చట్టంలో భాగంగా పేర్కొన్న అంశాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, ఎయిమ్స్, హైకోర్టు విభజన అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని హరీశ్ పేర్కొన్నారు. 1956లో తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన కాంగ్రెస్, తెలంగాణ బాగుపడేందుకు అవసరమైన ఏ ఒక్క అంశంపైన స్పందించలేదన్నారు. ముల్కీ రూల్స్ రద్దు విషయంలోకానీ, 6.0 ఫార్ములా విషయంలో గానీ అన్యాయమే జరిగిందన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ తన పంథాను మార్చుకోకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఓవైపు ఏపీకి ప్రత్యేక హోదాపై తొలి సంతకమంటూ జైరాం రమేశ్ మాట్లాడుతుంటే తెలంగాణలోని కాంగ్రెస్ నాయకులు నోటికి తాళం వేసుకొని మౌనంగా కూర్చోవడంలో అర్థం లేదన్నారు. బస్సు యాత్రలంటూ ఓట్ల రాజకీయానికి తెర తీసిన కాంగ్రెస్ నేతలు ముందుగా జైరాం వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటి పారుదలకు అనేక అవకాశాలు ఉన్నాయని, అయినప్పటికీ పోలవరానికి జాతీయ హోదా కల్పించి తెలంగాణ ప్రాంతానికి అన్యాయం చేశారన్నారు. తెలంగాణ ప్రాంతంలోని పది జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాలు మాత్రమే నీటి కొరతతో అల్లాడుతున్నాయని స్వయానా కేంద్రం స్పష్టం చేసినా కాంగ్రెస్ పట్టించుకున్నపాపాన పోలేదన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ కాళేశ్వరానికి జాతీయ హోదాపై మాట్లాడడం లేదని, కాళేశ్వరానికి జాతీయ హోదా కల్పిస్తే రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చిమరీ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేయాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. కాళేశ్వరానికి జాతీయ హోదా లేకున్నా తెలంగాణ ప్రాంతంలో జరుగుతున్న అన్నదాతల ఆత్మహత్యలు ఆపాలని, బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు తిరిగిరావాలన్న తాపత్రయంతో సీఎం కేసీఆర్ కోట్ల రూపాయలు వెచ్చించి యుద్ధప్రాతిపదికన కాళేశ్వరం పనులను చేపడుతున్నామన్నారు. అన్ని విధాలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఇటీవల కాలంలో ఆ రాష్ట్రానికి రూ.2.30లక్షల కోట్ల పారిశ్రామిక పెట్టుబడులు వచ్చాయన్నారు. పారిశ్రామిక అవకాశాల్లో రెండు రాష్ట్రాలకు సమాన వాటా ఉండాలని చట్టంలో స్పష్టంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ మాట్లాడడం లేదన్నారు. ఓ వైపు కాంగ్రెస్ తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటుంటే మరో వైపు ప్రధాని మోదీ తలుపులు మూసి తెలంగాణ బిల్లు పాస్ చేశారంటూ ఈ ప్రాంత ప్రజలను అవమానపరిచే విధంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటిని అవసరాలపై రాష్ట్ర ఎంపీలు పలుమార్లు కోరారని, తాను స్వయంగా ఉమాభారతి, గడ్కరీను కోరినా స్పందించిన పాపాన పోలేదన్నారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణ లో ఓట్ల కోసం, సీట్ల కోసం ఆరాటపడుతున్నాయి తప్పితే ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు కనీసం సీడబ్ల్యూసీ అనుమతి తీసుకురావడంలో కానీ, మహారాష్ట్రతో ఒప్పందం కుదుర్చుకోవడంలో కానీ పూర్తిగా విఫలమయ్యిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ, అటవీ అనుమతులు తీసుకోవడంతోపాటు మహారాష్ట్రతో ఒప్పందాన్ని కూడా కుదుర్చుకుందన్నారు. జాతీయ పార్టీలు అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనే ఆలోచన కలిగి ఉండాలని, ఒక ప్రాంతం పట్ల వివక్ష చూపడం సరైంది కాదని హరీశ్ అన్నారు.

కాళేశ్వరంలో హరీశ్ ఆకస్మిక పర్యటన



కాళేశ్వరం పనులు జరుగుతున్న ప్రాంతంలో మంత్రి హరీశ్‌రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రైతు సమన్వయ సమితి సదస్సులో పాల్గొన్న మంత్రి కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం పనులను పరిశీలించారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా మంత్రి హుటాహుటిన ప్యాకేజీ 8కి చేరుకోవడంతో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది ఖంగుతిన్నారు. వాస్తవానికి ఈ నెల 22, 23 తేదీలలో కాళేశ్వరం పనులను పరిశీలించాలని నిర్ణయించినా....ఢిల్లీ పర్యటన ఇతర కార్యక్రమాలతో ఆయన పర్యటన వాయిదా పడింది. రైతు సమన్వయ సమితు ల సదస్సు వల్ల కరీంనగర్ కు చేరుకున్నందున సమయాన్ని క్షణం కూడా వ ధా చేయకుండా ప్యాకేజి 8 పనులను తనిఖీలు నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పనులను సందర్శించారు.గ్రావిటీ కెనాల్‌పై నిర్మిస్తున్న 10 స్ట్రక్చర్స్ పనులను పరిశీలించారు.పనులు ఇంకా వేగవంతం చేయాలని ఆదేశించారు. కెనాల్ లైనింగ్ త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఏజన్సీలను ఆదేశించారు. వరద కాలువ జంక్షన్‌పాయింట్ డిజైన్లు త్వరగా సమర్పించాలని ఏజెన్సీని ఆదేశించారు. పనులలో ఇంకా వేగం పెంచాలని ఆయన కోరారు. పర్యటనలో ఎంపీ బీబీపాటిల్, ఈఎన్సీ అనిల్, కాళేశ్వరం సీఈ నల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మే 9న ఈ- సెట్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): తెలంగాణ ఈ-సెట్ నోటిఫికేషన్‌ను టీఎస్ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి సోమవారం విడుదల చేశారు. మే 9న ఈ-సెట్ పరీక్ష జరుగుతుందని తెలిపారు. మార్చి 5 నుంచి దరఖాస్తుల స్వీకరించనున్నట్లు చెప్పారు. అపరాద రుసుముతో మే 3వరకు అప్లమ్ చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 9 నుంచి 16 వరకు తప్పుల సవరణకు అవకాశం ఉందని, మే 2 నుంచి 7 వరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా నిర్మాణాలు

- కోర్టు ధిక్కరణ కేసు పెట్టిన జీహెచ్‌ఎంసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 9లో నిర్మాణాలు చేయరాదన్న హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొంటూ జీహెచ్‌ఎంసీ హైకోర్టును ఆశ్రయించింది. కొంచెం తక్కువగా 900 గజాల స్థలంలో లక్ష్మీబాయి మరో ముగ్గురు నిర్మాణాలు చేస్తుంటే జీహెచ్‌ఎంసీ గత ఏడాది నోటీసులు జారీ చేసింది. ఈ చర్యను తప్పుపడుతూ వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన హైకోర్టు.. సదరు స్థలంలో ఏవిధమైన నిర్మాణాలు చేయరాదని మధ్యంతర ఆదేశాలిచ్చారు. అయినా లక్ష్మీబాయి జీపీఏ హోల్డర్ రవీంద్రనాథ్ నిర్మాణాలు చేయడంపై జీహెచ్‌ఎంసీ అధికారులు ఆస్థలం వద్దకు వెళ్లి అభ్యంతరం చెప్పినా పట్టించుకోలేదు. దాంతో వారిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ రిట్ దాఖలు చేశారు.

ఆర్‌ఆర్‌బీ పరీక్షలకు టీ.శాట్ శిక్షణ ప్రసారాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 26(మనం ప్రతినిధి): రైల్వే ఉద్యోగాలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకోసం ఈ నెల 27 నుంచి టి.శాట్ శిక్షణ కార్యక్రమాలు ప్రసారం చేయనుంది. ఈ ప్రత్యక్ష ప్రసారాల్లో అభ్యర్థులు అడిగే ప్రశ్నలకు నిపుణులు సమాధానాలు ఇవ్వనున్నారు. ఆర్‌ఆర్‌బీ విడుదల చేసిన భారీ ఉద్యోగ ప్రకటనలో అధిక శాతం తెలంగాణ అభ్యర్థులు దక్కించుకునేలా శిక్షణ ఇవ్వాలంటూ మంత్రి కేటీఆర్ ఆదేశాల నేపథ్యంలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని టి.శాట్ టీవీ సీఈవో ఆర్.శైలేష్ రెడ్డి తెలిపారు.

కాళేశ్వరం డిజైన్ మారుస్తం

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అలాగే ప్రాణహిత- చేవెళ్ల పాత డిజైన్ ప్రకారం చేవెళ్ల వరకు నీళ్లు తెస్తమని తెలిపారు. తొలిదశలో మార్చి ఏడో తేదీ వరకు తలపెట్టిన బస్సు యాత్రను ఆయన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి ఆయన సోమవారం ప్రారంభించారు. కేసీఆర్ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజల్లో ఎండగడతామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని ఆయన నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులంతా ఐక్యంగా ఉండి పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. దళితులను, గిరిజనులను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేస్తుందని, బీసీలను చిన్నచూపు చూస్తుందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలయ్యేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏక కాలంలో రైతులకు రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని ఉత్తమ్ ప్రకటించారు. వరికి 2 వేలు, పత్తికి ఆరు వేలు, పసుపుకు 10 వేలు ధర కల్పించి కొనుగోలు చేస్తామన్నారు. ఇంటికో ఉద్యోగమన్న కేసీఆర్ తన కుటుంబంలో నలుగురికి ఉద్యోగం ఇచ్చుకున్నారని, ఇప్పుడు ఐదో ఉద్యోగం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు.

తెలంగాణ ఇచ్చింది మీ కోసమా

తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకే సోనియా తెలంగాణ ఇచ్చారని, కేసీఆర్ కుటుంబం కోసం కాదన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కూడా కేసీఆర్ ఎందుకు అడగడం లేదని ఉత్తమ్ ప్రశ్నించారు. ప్రజలు కాంగ్రెస్‌కు అండగా ఉండాలని, ప్రజాస్వామ్య తెలంగాణను సాధించుకుందామన్నారు. తెలంగాణలో ప్రాజెక్టుల పేరుతో భారీ అవినీతి జరుగుతోందన్నారు. ప్రతి ప్రాజెక్ట్ నుంచి ఆరు శాతం కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ చేసేందుకు డబ్బులు లేవా అని సాయంత్రం వికారాబాద్‌లో జరిగిన సభలో ఉత్తమ్ ప్రశ్నించారు. నాలుగు విడతలుగా చేశామని చెబుతున్నా, ఇంతవరకు రుణ మాఫీ కాలేదన్నారు. ప్రాణహిత డిజైన్ మార్చి వికారాబాద్‌కు నీళ్లు రాకుండా చేశారని విమర్శించారు. వికారాబాద్ ఆయకట్టును కావాలనే తొలగించారని ఆరోపించారు. స్థానిక రైతులను కేసీఆర్ మోసం చేసినా, జిల్లా మంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. టీఆర్‌ఎస్ కార్యకర్తలతోనే రైతు సమితులను ఏర్పాటు చేశారని, నిజమైన రైతులను మోసం చేశారని విమర్శించారు. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి చేవెళ్ల నుంచే పాదయాత్ర ప్రారంభించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని, అదే సెంటిమెంట్‌తో తాను ఇక్కడి నుంచే బస్సు యాత్ర ప్రారంభించినట్లు ఉత్తమ్ చెప్పారు.

ప్రజల కోరికమేరకే తెలంగాణ: షబ్బీర్ అలీ

ప్రజల కోరిక మేరకే సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని, కేసీఆర్ ఖాందాన్ చూసి కాదని శాసనమండలిలో కాంగ్రెస్ పక్ష నాయకుడు షబ్బీర్ అలీ చెప్పారు. 12% రిజర్వేషన్ పేరుతో కేసీఆర్ ముస్లింలను మోసం చేస్తున్నారని షబ్బీర్ అలీ విమర్శించారు.

కడుపు నిండిన చంద్రశేఖర్ రావు: కోమటిరెడ్డి

కేసీఆర్ అంటే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కాదు.. కడుపు నిండిన చంద్రశేఖర్ రావు అని సీఎల్పీ ఉప నాయకుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

టీఆర్‌ఎస్ సర్కార్‌పై యుద్ధం: రేవంత్ రెడ్డి

ప్రజలను కేసీఆర్ సర్కార్ కాల్చుకు తింటోందని కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా మారి ఈ ప్రభుత్వంపై యుద్ధం చేయాలని పిలుపు ఇచ్చారు. ''కేసీఆర్ నోటికి వచ్చింది మాట్లాడతారు.. మన నాయకులు ఉత్తమ్, జానారెడ్డి మర్యాదగా మాట్లాడాతారు. ఎదుటోడు కుస్తీ పట్టి మనం భరతనాట్యం చేస్తే కుదరదు. కాంగ్రెస్‌పై తొడకొడితే.. మనం దవడ పగులకొట్టాలి'' అంటూ రేవంత్ ఘాటుగా వ్యాఖ్యానించారు.



రూ. 3వేల నిరుద్యోగ భృతి

ప్రతి డ్వాక్రా గ్రూపునకు లక్ష రూపాయలు గ్రాంట్ ఇస్తామని, ప్రతి మహిళా సంఘానికి పది లక్షలు ప్రోత్సహం ఇస్తామని ఆయన చెప్పారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3వేల భృతి చెల్లిస్తామని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రంగారెడ్డి జిల్లా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. దళితులకు మూడు ఎకరాలు ఇస్తామని మోసం చేసిన కేసీఆర్... వారి ఖాతాలో 15 లక్షల చొప్పున వేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎక్కడ ఉన్నాయో చెప్పాలన్నారు.



మోసగాడని సోనియాకు తెలియదు: వీహెచ్

తెలంగాణ ఇస్తే చాలని సోనియాను బతిమాలుకున్న కేసీఆర్.. ఇప్పుడు కాంగ్రెస్‌పైనే విమర్శలు చేస్తున్నారని సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు విమర్శించారు. కేసీఆర్ మోసగాడన్న విషయం సోనియాకు తెలియదన్నారు. రైతులను మోసం చేసిన మోసకారి కేసీఆర్ అని పీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. ప్రాణహిత చేవెళ్ల డిజైన్ మార్చి రంగారెడ్డి జిల్లాకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు. ఉదయం హైదరాబాద్ నుంచి భారీ కాన్వాయ్‌తో ఉత్తమ్ చేవెళ్ల చేరుకున్నారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ఉత్తమ్‌తో పాటు కాంగ్రెస్ అగ్రనాయకులు పాల్గొన్నారు.



బస్సు యాత్ర కాదు.. అంతిమ యాత్ర

కోదండరాం పార్టీ కాగితపు పడవ.. తర్వాతి అసెంబ్లీలో రెండే పార్టీలు: జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 26(మనం ప్రతినిధి): కుటుంబ రాజకీయాలతో ఏళ్ల తరబడి పాలించిన కాంగ్రెస్ పార్టీ టీఆర్‌ఎస్ సర్కాను ఆ నలుగురి పాలనంటూ విమర్శించడం హాస్యాస్పదమని మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది బస్సు యాత్ర కాదు, అంతిమ యాత్రని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ లాంటిదని ఎద్దేవా చేశారు. ఆ పడవలో ప్రయాణం చేయలేక అందులో ఉన్న నేతలే వేరే పార్టీల్లోకి జంప్ చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి, ఇప్పటికీ తెలంగాణకి శత్రువేనన్నారు. ఉత్తమ్, జానారెడ్డి, జైరాం వ్యాఖ్యలపై స్పందించాలని జగదీశ్‌రెడ్డి నిలదీశారు. ఆంధ్రకి ఏం ఇచ్చినా మాకు ఏంబాధలేదని.. కానీ తెలంగాణాకి ఇవ్వాల్సినవి ఇస్తేచాలని అడుగుతున్నామన్నారు. తెలంగాణ లో కాంగ్రెస్ అధికారంలోకి రాదనే భావనలో హైకమాండ్ ఉందన్నారు. బస్సుయాత్రలో జైరాం వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని మంత్రి నిలదీశారు. ఇక అధికారంలోకి వచ్చే పరిస్థితిలేదని స్పష్టంగా తెలిసే బీజేపీ నేతలు 2లక్షల రుణ మాఫీ అంటూ హామీలి స్తున్నారన్నారు. కోదండరాం పార్టీ కాగితపు పడవలాంటిదని కొట్టిపారేశారు. వచ్చే అసెంబ్లీలో టీఆర్‌ఎస్, మజ్లిస్ పార్టీలే ఉంటాయని చెప్పారు.

అప్పుడు వైఎస్‌ఆర్.. నేడు కేసీఆర్

- రీడిజైన్ పేరుతో రాష్ట్రంలో దోపిడీ: ఎల్.రమణ



హైదరాబాద్, ఫిబ్రవరి 26(మనం ప్రతినిధి): జల యజ్ఞం పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచుకున్న విధంగా రీడిజెన్ పేరుతో కేసీఆర్ దోపిడి చేస్తున్నారని టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ ఆరోపణ చేశారు. పార్టీ మండలస్థాయి కార్యకర్తల ఆరో బ్యాచ్ శిక్షణ తరగతులను సోమవారం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా అనేక ఆటుపోట్లను ఎదుర్కొని టీడీపీ నిలబడిందన్నారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను టీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల తెలంగాణగా మారుస్తోందని రమణ ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.68 వేల కోట్లుగా ఉన్న అప్పును, టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక రూ.2 లక్షల 25వేల కోట్లకు చేర్చిందన్నారు. రూ.5 లక్షల కోట్లు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి రూ.4 లక్షల 80 వేల కోట్లను ఖర్చు చేశామని ప్రభుత్వం గొప్పలకు పోతోందన్నారు. ఆ లెక్కన ఒక్కో నియోజకవర్గానికి రూ.4 వేల కోట్లు ఖర్చు చేసుండాలని, నియోజకవర్గాల్లో 4 వేల కోట్ల అభివృద్ధి కనిపిస్తోందా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి అరవింద్ కుమార్‌గౌడ్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు బీఎన్ రెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ ప్రసంగించారు.

టీ టీడీపీ నేతలతో బాబు భేటీ రేపు

- పార్టీ పటిష్టత కోసం అధ్యక్షుడిపై ఒత్తిడి పెంచే యోచనలో తెలుగు తమ్ముళ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 26(మనం ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం ఆ పార్టీ రాష్ట్ర నేతలతో సమావేశం కానున్నారు. తెలంగాణలో పార్టీ పరిస్థితిపై చర్చించనున్నారు. ఈ నెల 28వ తేదీన ఎన్టీఆర్ భవన్‌లో జరిగే ఈ సమావేశానికి సంబంధించి పార్టీ నేతలకు ఇప్పటికే సమాచారం అందింది. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, పల్లెపల్లెకు తెలుగుదేశంపై స్పందన, నాయకత్వ శిక్షణ శిబిరాలు తదితర అంశాలపై చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తారు. ఇటీవల టీ టీడీపీ నేతలు పక్క పార్టీల వైపు చూస్తున్నారన్నా ప్రచారం ఎక్కువయ్యింది. ఈ నేపథ్యంలో పార్టీని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని నామా నాగేశ్వరరావు వంటి సీనియర్ నేతలు బాబుపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిసింది. సరైన నిర్ణయం తీసుకోకపోతే తమ భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుందని తమ్ముళ్లు ఆందోళనలో ఉన్నారని విశ్లేషకులు అంటున్నారు. కాగా, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య తన అనుచరులతో కలిసి ఈ 28న బాబు సమక్షంలో పార్టీలో చేరనున్నారు.

విధి నిర్వహణలో అంకితభావం ఉండాలి

- పీసీబీ మెంబర్ సెక్రటరి సత్యనారాయణరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): కాలుష్యమండలి సిబ్బంది తమ నైపుణ్యాన్ని పెంచుకుంటూ అంకిత భావంతో పని చేయాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరి పి.సత్యనారాయణరెడ్డి సూచించారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి ఫీల్డ్ అసిస్టెంట్‌ల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది బోర్డు నియమాలకు అనుకూలంగా, పూర్తి పారదర్శకతతో పనిచేసి పీసీబీకి మంచి పేరు తేవాలన్నారు. ఉన్నతస్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ చిత్తశుద్ధితో పనిచేయడం వల్లే బోర్డుకు రాష్ట్రస్థాయిలో టీఎస్-ఐపాస్ వచ్చిందని, ఈ అవార్డు సంస్థకు అరుదైన గుర్తింపు అని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది ఈ స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన కోరారు. సిబ్బంది నైపుణ్యాభివృద్ధికి ఇలాంటి శిక్షణ తరగతులు ఉపకరిస్తాయన్నారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని బోర్డు అధికారులను ఆయన ఆదేశించారు. విధి నిర్వహణలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోర్డు సీఈఈ విశ్వనాథం, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్టు వీరన్న, సైంటిఫిక్ ఆఫీసర్లు ప్రసాద్, మురళీమోహన్, ఇతర ల్యాబ్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి వెబ్‌సైట్ హ్యాక్

- పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి వెబ్‌సైట్ హ్యాకింగ్ గురయ్యింది. ఆదివారం రాత్రి హ్యాకింగ్ విషయాన్ని గుర్తించామని, ఆధారాల ప్రకారం పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తులు లేదా దేశ వ్యతిరేఖ శక్తులు ఈ పని చేసి ఉంటాయని భావిస్తున్నామని బీజేపీ పార్టీ కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. హ్యాకింగ్ విషయంపై తెలంగాణ రాష్ట్ర డీజీపీ, ఐజీ ఇంటెలిజెన్స్, డీసీపీ సైబర్ క్రైమ్ కార్యాలయాల్లో కిషన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కిషన్‌రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ల జీతాలు పెంపు

- 16 ఏండ్ల తర్వాత వేతనాలు మార్పు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ల జీతాలు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 16 ఏండ్ల తర్వాత మార్కెట్ కమిటీ చైర్మన్ల నెల జీతాలను ప్రభుత్వం పెంచింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సెలక్షన్ గ్రేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ జీతం రూ.2 వేల నుంచి రూ.25 వేలకు పెరిగింది. స్పెషల్ మార్కెట్ కమిటీ చైర్మన్ జీతం రూ.1500 నుంచి రూ.20 వేలకు చేరింది. గ్రేడ్ 1 మార్కెట్ కమిటీ చైర్మన్ జీతం వెయ్యి నుంచి రూ. 15 వేలకు, గ్రేడ్ 2, 3 మార్కెట్ల కమిటీ చైర్మన్‌లకు రూ. 500 నుంచి రూ.15 వేలకు పెరిగింది.


మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
మంగళవారం, ఫిబ్రవరి 27

పాక్‌పై సరికొత్త నిఘా


భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఆంక్షల కత్తివేటుపడింది. ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక అండదండలందిస్తున్న ఆరోపణలెదుర్కొంటున్న పాక్‌ను 'గ్రే లిస్ట్'లో చేర్చి నిఘావేయాలని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) నిర్ణయించింది. ఉగ్రవాద సంస్థలకు మద్దతు అందిస్తున్న కారణంగా పాక్ ఆర్థిక యంత్రాంగంపై అంతర్జాతీయంగా కట్టడి అమలు చేయబోతున్నట్లు గతవారం ఆ దేశానికి నోటీసు జారీ అయింది. 1989లో ఏర్పడిన వివిధ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు సభ్యులుగా ఉన్న అంతర్ ప్రభుత్వ వ్యవస్థ- ఎఫ్ఏటీఎఫ్ ఉగ్రవాదులకు ఆర్థికసాయం, మనీలాండరింగ్ వంటి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు చేటు కలిగించే నేరాలపై పోరులో అవసరమైన ప్రమాణాలను నెలకొల్పింది. ఆ ప్రమాణాలను అమలు చేసేందుకు అవసరమైన చట్టపరమైన నియంత్రణా, నిర్వహణా చర్యలు తీసుకునే క్రమంలో పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో పెట్టాలని ఆ సంస్థ వార్షిక ప్లీనరీ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఎఫ్ఏటీఎఫ్ సంస్థ జూన్‌లో రూపొందే గ్రే లిస్ట్‌లో పాక్‌ని చేర్చాలన్న ప్రతిపాదనను తొలుత చైనా అభ్యంతరం వ్యక్తంచేసినప్పటికీ తర్వాత ఉపసంహరించుకుంది. ఉగ్ర ఆర్థిక విషయంలో పాక్‌పై నిఘావుంచాలన్న ప్రతిపాదనపై తొలివిడత జరిగిన చర్చలో ఏకాభిప్రాయం కుదరకపోయినా, గతంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై 2012-15 మధ్యకాలంలో ఎఫ్ఏటీఎఫ్ నిఘాలో ఉన్న విషయం తెలిసిందే. భారత్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలు ఎఫ్ఏటీఎఫ్ ప్రమాణాలను పాటిస్తున్నాయి.

గతంలో అమెరికా మద్దతుతో ఐఎంఎఫ్ బెయిల్ ఔట్ ఇచ్చినందువల్ల పాక్ గ్రే లిస్ట్ నుంచి బయటపడగలిగింది. అయితే అమెరికాకు రష్యా, ఈయూ దేశాల మద్దతుతో చైనా సామ్రాజ్యవాద దేశానికి మధ్య భౌగోళికార్థిక రాజకీయాధిపత్య పోటీలో పాక్ వైఖరి కారణంగా అమెరికా కక్ష సాధింపులు చేపట్టింది. అందులో భాగంగా పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ నిఘాలో ఉంచేందుకు జరిగిన తాజా నిర్ణయం వెనుక అమెరికా హస్తం ఉందనడంలో సందేహం లేదు. అయితే గతంలో అమెరికా బెయిల్ ఔట్‌కు సహకరించినట్లుగా ఈసారి చైనా ఎలా సహకరిస్తుందో చూడాలి. అయితే పాక్‌పై నిఘా పెట్టాలన్న ప్రతిపాదనపై జరిగిన చర్చలో చైనా చివరకు తటస్థ వైఖరి చేపట్టడంతో పాక్‌కు చుక్కెదురైంది. 'గ్రే లిస్ట్' లో చేరిన పాక్ అంతర్జాతీయ ఆర్థికలావాదేవీలపై నిఘా పెరుగుతున్నందు వల్ల ఆ దేశ ప్రైవేటు రంగానికి ప్రపంచ కార్పొరేట్ సంస్థల మధ్య సాగే వాణిజ్య లావాదేవీలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో బహుళ జాతి సంస్థలకు బెయిల్ ఔట్ రాకుండా వాణిజ్య లావాదేవీలు నడవడం సాధ్యం కాదు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బహుపాక్షిక రుణదాతలు, వ్యాపార సౌలభ్యతలను అంచనాలు కట్టే మూడీ, ఎస్ అండ్ పీ, ఫిచ్ సంస్థలు పాకిస్థాన్‌తో వ్యాపార దక్షత క్షీణించినట్లు అంచనా వేశాయి. దాంతో పాక్ స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. అది పాక్ ఆర్థిక వ్యవస్థలో చైనా చొరబాటుకు మరింత వీలు కలిగిస్తుంది.

పాకిస్థాన్ శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ సరిహద్దుల్లో నుంచి ఉగ్రవాదులను భారత భూభాగంలోకి పంపి ఉగ్రవాద చర్యలను రెచ్చగొట్టడమే కాకుండా, సైనిక ఉద్రిక్తలను తరచూ సృష్టిస్తోంది. భారత సైన్యం అనేకసార్లు సర్జికల్ దాడులు జరిపినప్పటికీ పాక్ వెనక్కి తగ్గలేదు సరికదా, ఉగ్రవాదులు మరింతగా సరిహద్దుల నుంచి చొరబడేందుకు పెద్ద ఎత్తున సహకరిస్తోంది. అదేవిధంగా తన మాట వినకుండా భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తున్న ఆఫ్ఘనిస్థాన్‌ను లొంగదీసుకునేందుకు తాలిబాన్లకు పాక్ మద్దతుగా నిలిచింది. అమెరికా సైనిక బలగాల దన్నుతో కొనసాగుతున్న ఆఫ్ఘాన్ ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు సకల విధాలుగా పాక్ ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ఉగ్రవాదులకు సహాయం చేస్తున్న ధూర్తరాజ్యంగా గుర్తిస్తోంది. పాక్ మిలటరీ, ఇంటెలిజెన్స్ వర్గాలు పాక్ ప్రభుత్వాన్ని శాసిస్తూ ఉగ్రవాదులను పావులుగా ఉపయోగించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ నిర్వహిస్తున్న ఉగ్రవాద దౌత్య యంత్రాంగాన్ని ధ్వంసం చేసేందుకు అంతర్జాతీయ సమాజం ప్రయత్నాల్లో భాగంగా ఈ గ్రే లిస్ట్ నియంత్రణ ముందుకొచ్చింది. పాకిస్థాన్‌ను గుప్పిట్లో పెట్టుకునేందుకు ఈ చర్యలను సమర్థిస్తున్నట్లుగానే చైనా తటస్థ వైఖరి చేపట్టింది. గ్రే లిస్ట్‌లో చేరగానే పాక్‌కు చైనా ఆర్థిక సహకారం తప్ప వేరే గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడడం డ్రాగన్‌కు లాభిస్తుంది. రెండు పాక్‌లోని తన పెట్టుబడులకు భద్రత ఉండాలంటే ఉగ్రవాద శిబిరాలు బలహీనపడటం తప్పనిసరి షరతు కాబట్టి గ్రే లిస్ట్ నిర్ణయం చైనాకు మరింత ఉపయోగకరం. అయితే ఆర్థిక ఆంక్షల ద్వారా ప్రపంచంలో ఉగ్రవాదం ఎక్కడా బలహీనపడలేదు సరికదా, మరింత ఉధృతంగా పైకెగసిన అనుభవాలున్న నేపథ్యంలో పాక్‌పై గ్రే లిస్ట్ నిఘా ఏ మేరకు ఫలిస్తుందనేది సందేహమే?



మంచిమాట



'నదులు, చెరువులకు రకరకాల పేర్లుంటాయి. అన్నిటిలోనూ నీళ్లే ఉంటాయి. మతాల విషయంలో పేర్లు వేరైనా సత్యం ఒక్కటే.'

- ముహమ్మద్ ఆలీ



సమీర్ శర్మ, ఐ.ఎ.ఎస్

సమాలోచన

సమావేశాలు ఫలవంతమయ్యేదెలా?

సమావేశాల సందర్భంగా ప్రతి అంశాన్నీ అంగీకరిస్తూ పోవడం మంచిది కాదు. బహిరంగ, ఆరోగ్యకర చర్చలకు అవకాశమివ్వాలి. దీనివల్ల కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. భిన్న దృక్పథాల నుంచి కొత్త సిద్ధాంతాలు పుట్టుకువస్తాయి. రిస్కును తగ్గిస్తాయి. సరైన పరిష్కార మార్గాలు వెలుగు చూస్తాయి. ఏదైనా ఆశ్చర్యకర, సరికొత్త అంశం లేదా ఆలోచన ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కోవడానికి, తమ వాదనే సరైనదని నిరూపించుకోవడానికి ప్రయత్నం చేయవద్దు.

ఏ సమావేశమైనా ఎక్కువ సేపు జరిగితే బ్యూరోక్రాట్లు ఇబ్బంది పడిపోతుంటారు. సమయమంతా వృథా అయిపోయిందని, ఇటువంటి సమావేశాల వల్ల ఉపయోగమేమీ లేదని విసుక్కుంటుంటారు. అయితే, ఇటువంటి సమావేశాలను ఉపయోగకరంగా, ఫలవంతంగా, అర్థవంతంగా మార్చడమెలా అన్నది తెలుసుకోవాల్సి ఉంది.

1. సమావేశాలనేవి ఓ సంస్థ భావోద్వేగ, సాంస్కృతిక వాస్తవాల కోసం రూపొందిన సామాజిక వ్యవస్థలు అనే విషయాన్ని అర్థం చేసుకుంటే వాటి విలువ మరింత పెరుగుతుంది. అధికార యంత్రాంగం తీరుతెన్నులు, వైఖరులు ఎలా ఉంటాయంటే,


-దీని ద్వారా సమావేశంలో పాల్గొనేవారి విభిన్న దృక్పథాలు తెలుసుకోవడానికి వీలవుతుంది. సమావేశాలకు కొందరు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. కొందరు పూర్తిస్థాయిలో తయారై వస్తారు. కొందరు సమావేశంలో ప్రస్తావించబోయే అంశాల పట్ల దృఢమైన వైఖరి కలిగి ఉంటారు.

-వివిధ రకాల భావోద్వేగాలతో మిళితమైపోతారు. కొందరు తమకు తెలియకుండానే తమ సొంత ఎజెండాలతో సమావేశానికి హాజరవుతారు. కొందరు ఈ సమావేశాలను సామాజిక హోదాలో భాగంగా పరిగణిస్తారు. కొందరికి ఇది కేవలం జనం చేరే స్థలంగా మాత్రమే కనిపిస్తుంది. కొందరు ఈ సమావేశాలను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటారు.

- సమావేశానికి హాజరయ్యేవారు అవతలి వ్యక్తులు చెప్పింది విందామనో, తాము చెప్పింది అవతలి వ్యక్తులు వినాలనో భావిస్తారు.

2. ఇటువంటి సమావేశాలు, గోష్ఠుల తీరుతెన్నులను అధ్యయనం చేస్తే, సమావేశాల సామాజిక కోణాలను ఎలా అర్థం చేసుకోవచ్చనేది అవగతమవుతుంది. సాధారణంగా, ఓ పద్ధతి లేకుండా, నిలకడ లేకుండా, ముందుగా ఊహించకుండా సమావేశాలు వేడిగా, వాడిగా జరిగితే అవి ఆశించిన స్థాయిలో జరిగాయని, వ్యూహం, ఉద్దేశం ఫలించించాయని భావించాలి. కేవలం ఆగ్రహంగా మాత్రమే సమావేశాలు జరగడం వేరు. ఒకసారి ఆగ్రహావేశాలతో, మరోసారి భావోద్వేగాలతో జరగడం వేరు. వీటి మధ్య మన వైఖరులు మారే పక్షంలో సమావేశానికి హాజరైన వారి నుంచి అంగీకారం వ్యక్తమయిందనే భావించవచ్చు. అలాకాక, సమావేశాలు గనుక సానుకూల వాతావరణంలో ప్రారంభమైతే అవి సమర్థంగా, పటిష్ఠంగా ప్రారంభమైనట్టేనని అర్థంచేసుకోవచ్చు. ఆగ్రహావేశాలు వ్యక్తుల మీద కాక, సమస్య మీద కేంద్రీకృతం కావాలి. భావాలను ఆచితూచి వ్యక్తం చేయాలి. అసంతృప్తి కూడా సానుకూల వైఖరితోనే వ్యక్తమయితే, ఆ సమావేశ ఉద్దేశం నెరవేరినట్టే అనుకోవచ్చు.

3. గంటల కొద్దీ సమయం వెచ్చించడం మీద కాకుండా కేవలం ఫలితాలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా సమావేశాన్ని ఫలవంతం చేయవచ్చు. సమయాన్ని ఎక్కువగా ఉపయోగించకుండా సమయాన్ని ఎప్పటికప్పుడు సానుకూలంగా మదింపు చేస్తూ అధికారులు ఫలితాలపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. ఎక్కువ సమయాన్ని తీసుకోవద్దని సంస్థ కోరి ఉండకపోవచ్చు. కానీ సమావేశానికి హాజరయ్యేవారే సమయం విలువను తెలుసుకుని వ్యవహరించాల్సి ఉంటుంది. అంటే, తమ సంస్థకు ఏది అవసరం, తమ అధినేతకు ఏది అవసరం, ఏది అవసరం కాదు అన్నది అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల మీ ప్రాధాన్యాలు ఏమిటో గట్టిగా,



లోతుగా తెలుసుకుని ఉండాలి. సాధారణంగా అడ్మినిస్ట్రేటర్లు లేదా బ్యూరోక్రాట్లు తమకు సమావేశాల నిర్వహణకు ఉన్న అధికారాన్ని ఫలవంతమైన చర్చల కోసం ఉపయోగించరు. సంస్థలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులను, అధిపతులను ఒకచోట చేర్చి, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, సన్నిహితం కావడం, ఒకరి గురించి మరొకరు తెలుసుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి వాటి కోసం ఈ అధికారాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది.

ఉద్దేశాలకు ప్రాధాన్యం

కేవలం కమ్యూనికేషన్ కోసం కాకుండా సంస్థాగత విషయాలు తెలుసుకోవడానికి, తెలియజెప్పడానికి సమావేశాలను నిర్వహించాల్సి ఉంటుంది. సంస్థాగత కమ్యూనికేషన్ అనేది పైనుంచి కింది వరకూ అందరికీ వర్తిస్తుంది. సంస్థలో ఉద్యోగుల అంచెల స్థాయిని దృష్టిలో పెట్టుకుని సమావేశాలు జరుగుతాయి. మరోవిధంగా చెప్పాలంటే, సంస్థాగత సంభాషణలు నాలుగింటి మీద ఆధారపడి ఉంటుంది. అవి:

సాన్నిహిత్యం - సమావేశంలో పాల్గొంటున్నవారు సంఖ్యాపరంగా, ఇతరత్రా అన్నివిధాలా సన్నిహితమవుతారు.

పరస్పర సమన్వయం - చర్చలనేవి రెండు వైపుల నుంచీ రావాలి.

సమానత్వం - అందరికీ సమాన ప్రాతినిధ్యం ఉండాలి.

ఉద్దేశం - చర్చల్లో పాల్గొంటున్నవారికి చర్చల లక్ష్యం తెలిసి ఉండాలి.

4. సమావేశాల మీద ఇంతవరకూ ఉన్న అభిప్రాయాలలో మార్పు రావాలి. వీటిని పునఃపరిశీలించాలి. ఉదాహరణకు, వేర్వేరుగా భిన్న స్థాయిల్లో పనిచేస్తున్న వర్గాలు కొన్ని విషయాల్లో బాగా పనిచేస్తాయి. ముఖ్యంగా భవిష్యత్తు గురించి అంచనా వేయడంలో ఏకాభిప్రాయం సాధ్యం కాకపోవచ్చు. ఇటువంటి సందర్భాలలో వేర్వేరుగా పనిచేయడమే ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, భవిష్యత్తు గురించి అంచనా వేయడం, ఊహించడం వంటి విషయాల్లో ఏకాభిప్రాయమే ఉత్తమంగా అనిపిస్తుంది. ఎందుకంటే,

- సమావేశాలు నిర్వహించే పక్షంలో కొందరు పలుకుబడి కలిగిన లేక జనాకర్షణ కలిగిన నాయకులే సమావేశాలను ప్రభావితం చేయవచ్చు.

- మరీ ఒంటరి వారమైపోతామనే ఉద్దేశంతో సమావేశంలోని వారు తమ భావాలను అణచిపెట్టుకుని, గుంపులో గోవిందా అన్నట్టుగా అందరితో కలిసిపోయి వ్యవహరించవచ్చు. అటువంటి మంద మనస్తత్వం వల్ల అందరూ ఒకేవిధంగా ఆలోచించే అవకాశం ఉంది. ఇటువంటి మంద మనస్తత్వం రాకుండా చేయాలంటే, విభిన్న వర్గాలను సమావేశపరచాలి. రకరకాల నిబంధనలు, సూత్రాలను కోరుకునే వ్యక్తులను ప్రోత్సహించాలి.

5. సమావేశాల సందర్భంగా ప్రతి అంశాన్నీ అంగీకరిస్తూ పోవడం మంచిది కాదు. బహిరంగ, ఆరోగ్యకర చర్చలకు అవకాశమివ్వాలి. దీనివల్ల కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. భిన్న దృక్పథాల నుంచి కొత్త సిద్ధాంతాలు పుట్టుకువస్తాయి. రిస్కును తగ్గిస్తాయి. సరైన పరిష్కార మార్గాలు వెలుగు చూస్తాయి. సమావేశాన్ని అర్థవంతంగా, విలువైనదిగా మార్చడానికి కొన్ని మార్గాలున్నాయి. ఏదైనా ఆశ్చర్యకర, సరికొత్త అంశం లేదా ఆలోచన ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కోవడానికి, తమ వాదనే సరైనదని నిరూపించుకోవడానికి ప్రయత్నం చేయవద్దు. ఇతరులు వాస్తవాలను అర్థం చేసుకునే తీరును అవగతం చేసుకోవాలి. అంగీకారం కుదరనప్పుడు అటువంటి నిర్ణయాల వల్ల ఒనగూడే కష్టనష్టాలను వారు అర్థం చేసుకునేటట్టు చేయాలి. ఆ సూచనల వెనుక ఉన్న అసలైన ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలి. లక్ష్యాన్ని నెరవేర్చడంలో అందరి సహాయ సహకారాలు కోరాలి.

(రచయిత కేంద్ర పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖలో అదనపు కార్యదర్శి)

కవిత

దేవీ! శ్రీదేవీ!!


చక్కని చుక్క ఒక్కసారిగ చుక్కల జేరితె
హృదయం కరిగి కంటిలోతడిగా ఉబికినట్లు
అనిపించడమేగా... 'శోకం' అంటే!
చక్కెరబొమ్మే తక్కువ వయసులో ముక్కలు కాగా
మక్కువ తీరక దిక్కులు చూచుచు మిగిలినట్లు
అనిపించడమేగా... 'శూన్యం' అంటే!
తెరపై వెలిగే తెల్లని దేవత తెరమరుగైతే
తెల్లవారుతూ తెలియగానే తల్లడిల్లినిట్లు
అనిపించడమేగా... 'దిగ్భ్రాంతి' అంటే!
అతిలోక సుందరిని అచేతనంగా అలా చూచితే
జలపాతాలే గడ్డకట్టి అలా నిలిచినట్లు
అనిపించడమేగా... 'ఆరాధన' అంటే
'మానాన్న నిర్దోషి' అంటూ 'ముందడుగు' వేసిన
'కార్తీక దీపం'
'ఆకలి రాజపు' 'ఆఖరిపోరాటమా'పిన 'వసంతకోకిల'
'క్షణక్షణం' 'పదహారేళ్ళ వయసా' వదనం
గుప్పెడు గుండెలో దేవి రూపమే...
శ్రీదేవి రూపమే వెలిగినట్లు
అనిపించడమేగా... ''నివాళి'' అంటే!!

- గుడిపూడి రాధికారాణి
మచిలీపట్నం

నదీ జలాలకు ఒకే ట్రైబ్యునల్

దక్షిణాది రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఫిబ్రవరి 20, 2018న జరిగిన సదస్సులో కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అంటారు. 'దేశవ్యాప్తంగా రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి జాతీయ స్థాయిలో ఒకే ఒక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసే దిశలో, దీనికి సంబంధిత చట్టాన్ని వచ్చే పార్లమెంటు సమావేశాలలో సమర్పిస్తాం'. దీనిపై విశ్లేషణాత్మక కథనాన్ని చూద్దాం.

నేను 2016లో జలవివాదాల విషయంగా రాసిన పుస్తకంలో 'ఇప్పుడున్న జలవివాదాల ట్రైబ్యునల్స్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసి, ఒక శాస్త్రీ సంస్థను ఏర్పాటుచేయాలని, దీనికి అధిపతిగా సుప్రీంకోర్టు మాజీగాని, పదవిలో ఉన్న న్యాయమూర్తిని నియమించి, వీరికి సహాయ సహకారాలు అందించడానికి వివిధ సాంకేతిక సంస్థల నుంచి సలహాదారులను నియమించాలని సూచించాను.' ఈ పుస్తకం విడుదలైన కొద్దిరోజులకు ఆర్థికమంత్రి, జలవనరులమంత్రి వివిధ సభలలో 'ఒకే ట్రైబ్యునల్ విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తెస్తుందని' చెప్పారు. తరువాత దీనికి సంబంధించిన చట్టానికి రూపకల్పన చేసి పార్లమెంటుకు సమర్పించడం జరిగింది. దీనిపై నా విశ్లేషణ అభ్యంతరాలతో కూడిన లేఖను జలవనరుల మంత్రికి పంపాను. లోగుట్టు పెరుమాళ్ళ కెరుక అనే రీతిలో చెప్పాను. అంటే ఈ ట్రైబ్యునల్ కేంద్రం గుప్పిట్లో ఉంటుదన్నమాట. ఈ లేఖ ఏప్రిల్ 1, 2017న రాశాను. ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించిన 'అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాద (అమెండ్‌మెంటు) బిల్లు, 2017', ప్రస్తుతం అమలులో ఉన్న దీనికంటే కూడా నష్టదాయకమైనది. భాగస్వామ్య రాష్ట్రాలకు సమన్యాయం జరగాలంటే ఈ బిల్లుకు సమూలంగా మార్పులు చేర్పులు చేయాల్సిన అవసరమెంతైనా ఉన్నది. ఈ బిల్లులో ఒక ట్రైబ్యు నల్ అని చెప్పినప్పటికి, ఇంతవరకు ఉన్న ట్రైబ్యునల్స్ జడ్జీల కంటే ఎక్కువగా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాదు, ఇంతకుముందు ట్రైబ్యునల్స్‌లో పనిచేసిన జడ్జీలతో దీనిని నింపడానికి నాంది పలికింది. ఈ ట్రైబ్యునల్స్ బాగా లేవనేగదా కొత్త చట్టం, అలాంటప్పుడు పాత జడ్జీలతో ఈ కొత్త ట్రైబ్యునల్‌ను నింపడంలో ఔచిత్యమేమిటి? అంతే కాదు, ఇప్పటివరకు ట్రైబ్యునల్స్ ఇచ్చిన తీర్పులపై ఎలాంటి మార్పులకు ఆస్కారం ఉండదని చెప్పుతుంది. అంటే కృష్ణానది నీరు మొత్తాన్ని కర్నాటక-మహారాష్ట్రలు వాడుకున్నా అభ్యంతరాలు ఉండవన్న మాట.



తెలుగు ప్రజల దురదృష్టమేమో గాని, తెలుగు రాష్ట్రాల నుంచి మేధావులుగాని, రాజకీయ అధికార వ్యవస్థగాని, శాస్త్ర-సాంకేతిక సంస్థ లుగాని దీనిపై ఎలాంటి పోరాటం జరపలేదు. ఇదిలావుండగా, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం మహానది నీటి పంపకాలను ఒడిస్సా-చత్తీస్‌గఢ్ మధ్యచేసే దిశలో కొత్తగా ఒక ట్రైబ్యునల్‌ను నియమించడానికి సిద్ధమయింది. కేంద్ర జలవనరుల సంస్థ (ఇడబ్ల్యుఇ) కొత్తగా ముందుకు తెచ్చిన నీటి లభ్యత అంచనాల విధానం. ఇది లోపభూయిష్టమైన విధానం, దీని ద్వారా ఎక్కువ నీటి లభ్యత ఉందనే భ్రమ ను కల్పిస్తుంది. ఇది ఎలాగంటే:

భూమిలోకి ఇంకే నీరు+భూమిపై పారి చెరువులు, నదులు వగైరాలలోకి చేరే నీరు=వర్షపాతం-నీటి ఆవిరి.

ఇక్కడ ఇడబ్ల్యుఇ నీటి ఆవిరి అంచనా తక్కువగా చూపే విధానాన్ని ఎంచుకుంది. దీనితో ఇంకే నీరు+పారే నీరు పెరుగుతుంది. ఈ నీటి ఆవిరి ఉష్ణోగ్రతలపైనే ఆధారపడి ఉంటుందనేది ఈ విధానంలో చేసిన తప్పు. కానీ నీటి ఆవిరి ఎన్నో వాతావరణ విషయాలపై ఆధారపడి ఉంటుంది. భూమిలోకి ఇంకే నీరులో నేలలో తేమ+ భూగర్భ జలాలు (భూగర్భ జలసంస్థ నుంచి తీసుకున్న గణాం కాలు). నెలలో తేమ నీటి ఆవిరిపై ఆధారపడి ఉంటుంది. భూమిపై పారే నీటిని (నీటిలభ్యత) బచావత్, బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్స్ విధానాన్ని ఎంచుకున్నారు. 30 సంవత్సరాల నీటి లభ్యత గణాంకాలు సరిపోతాయని, అలాగే బ్రిజేష్‌కుమార్ కూడా 47 సంవత్సరాలు ఎంచుకున్నారు. తనకు 114 సంవత్సరాల గణాంకాలు అందుబాటులో ఉన్నా 47ను ఎంచుకు న్నారు. చిత్రావత్ తనకు అందుబాటులో ఉన్న 78 సంవత్సరాల నీటి ల భ్యత గణాంకాలను తీసుకున్నారు. ఇక్కడ మనం ముఖ్యంగా గమనిం చాల్సిన విషయం, ఇడబ్ల్యుఇ వాతావరణం, వాతావరణంలో మార్పులకు అనుగుణంగా ఈ ఎంపిక ఉండాలని, కానీ వారు దీనిని పరిగణనలోకి తీసుకోలేదు. అలాంటి పరిస్థితులలో 30, 47 సంవత్సరాల నీటి లభ్యత గణాంకాలు సరైన ప్రామాణికాలు కావు. ప్రపంచ వాతావరణ సంస్థ దీనిపై నియమ నిబంధనలు పేర్కొంది. వీటిని వీరిదరూ పరిగణనలోకి తీసుకోలేదు. ఇలాంటి పరిస్థితుల వల్ల జరిగే దుష్పరిణామాన్ని చూద్దాం.

కృష్ణానదిలో సగటు నీటి లభ్యత, టీఎంసీ ఫీట్

1. బచావత్ ట్రైబ్యునల్ (1894-95 నుంచి 1971-72) 2393 (78), 2. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ (1961-62 నుంచి 2007-08) 2578 (47), 3. 114 సంవత్సరాలు (1894-95 నుంచి 2007-08) 2443 (114). 4. కేంద్ర జల వనరుల సంస్థ (1984-85 నుంచి 2014-15) 3144 (30); 5. బ్రిజేష్‌కుమార్ (1984-85 నుంచి 2007-08) 2416 (24)

సంవత్సరాలు; (4) - (5) = 3144 - 2416 = 728 టీఎంసీ ఫీట్

2002 - 03 సంవత్సరానికి (కరువు సంవత్సరం); (4) -(5) = 1934.89 - 1239 = 695.89 టీఎంసీ ఫీట్

పై గణాంకాలను బట్టీ మనకర్థమయ్యేదేమిటంటే, ఇడబ్ల్యుఇ ప్రకారం నీటి లభ్యత అంచనాలు బ్రిజేష్‌కుమార్ అంచనాల కంటే సగటున 700 టీఎంసీ ఫీట్ దాకా ఎక్కువగా ఉన్నవి. అందుకే ఇడబ్ల్యుఇ అంటారు. ''కృష్ణాలో నీటిని మొక్కలు'' దీనివల్ల సుప్రీంకోర్టులో ఉన్న 'స్టే ఆర్డర్', బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ దగ్గర విచారణ పక్కదారి పట్టే ఆస్కారముంది. లేకపోతే దక్షిణాఫ్రికాలోని కేప్ టౌను తీవ్ర నీటి ఎద్దడి గుర్తుకు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ దర్బన్ వర్షపాతంలో ఉంటే 66 సంవత్సరాల వలయంతో, సగటు కంటే తక్కువ వర్షాల 33 సంవత్సరాల వలయం 2008 నుంచి 2040 వరకు ఉంది. అంటే దీనికి అనుగుణంగా దీర్ఘకాలిక నీటి ఉపయోగ ప్రణాళికలు చేసు కోవాలి. అలాకాకుండా ఇడబ్ల్యుఇలాంటి గణాంకాలతో డ్యాంల నిర్మాణాలు, నదుల అను సంధానాలు రాష్ట్రాల మధ్య యుద్ధాలకు నాంది పలుకు తుందనేది నగ్న సత్యం. మంచికి బదులు చెడు జరుగుతుంది. మనదేశ నైరుతి రుతు పవన కాల వర్షపాతంలో 60 సంవత్సరాల (తెలుగు సంవత్సరాల వలె) వలయం ఉంది. దీనికి అనుగుణంగా ఉత్తర వాయువ్య నదులలో వరదల సంఖ్య చూడవచ్చు. తెలుగు రాష్ట్రాల నాటి వర్షపాతంలో 132 సంవత్సరాల వలయం (దర్బన్‌కు రెండింతలు) ఉంది. దీనికి అనుగుణంగా 114 సంవత్సరాల నీటి లభ్యత గణాంకాలను చూడవచ్చు. దీని ప్రకారం సగటు నీటి లభ్యత 2443 టీఎంసీ ఫీట్ కాగా, అతి తక్కువ నీటిలభ్యత (1007, 1125, 1239, 1253 టీఎంసీ ఫీట్), అతి ఎక్కువ నీటిలభ్యత (4194, 4166, 3760, 3721 టీఎంసీ ఫీట్). బచావత్/బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్స్ భూగర్భజలాలు- వాడకాన్ని నీటి లభ్యత కిందికి తీసుకోలేదు. వీటిని దృష్టిలో పెట్టుకొని తెలుగు రాష్ట్రాలు కృష్ణానీటిని వాడుకోవాల్సిన అవసరమెంతైనా ఉన్నది. లేకుంటే కేప్‌టౌన్‌లో నెలకొన్న పరిస్థితులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వచ్చే అవకాశం ఉంది.

డాక్టర్ సజ్జల జీవానందరెడ్డి


ఆదివాసీల ఆత్మబంధువు

ఆదివాసీ ఉద్యమస్ఫూర్తి ఒకవైపు, బోధన- పరిశోధన మరోవైపు. ఈ రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్ళిన ఆదివాసీ ఆత్మబంధువు జనార్దన్‌రావు. జీవితానికీ సమాజానికీ ఉన్న సంబంధాన్ని ఎప్పుడూ వేరుచేయలేదు. ప్రకృతికీ, ఆదివాసుల జీవన విధానానికీ ఎప్పుడూ బాసటగానే నిలబడ్డారు. జనార్దన్ అంటే జననాడి, ప్రజల మనిషి, ఆదివాసుల గుండెచప్పుడు. అరవై ఏళ్ళ తెలంగాణ స్వప్నం సాకారమైనవేళ ఎందరో తెలంగాణ వీరయోధుల, అమరవీరుల ఆకాంక్షలకూ దర్పణం బియ్యాల జనార్దన్‌రావు. ఆదివాసీల ఆత్మబంధువుగా మలిదశ తెలంగాణ పోరాటానికి మార్గదర్శిగా నిలిచిన ప్రొఫెసర్ జనార్దన్‌రావు ఆదివాసీ అణగారిన వర్గాల హక్కుల కోసం కృషి చేశారు. వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగల వీడు గ్రామంలో కిషన్‌రావు, అంజమ్మలకు 1955 అక్టోబర్ 12న జనార్దన్ రావు జన్మించారు. చిన్ననాటి నుంచి తనకు ఏజెన్సీ గూడేల ఆదివాసులతో ఏర్పడిన అనుబంధంతో వారి సంప్రదాయ వారసత్వం, జీవన విధానంపై ఆకళింపు, ఆసక్తి కలిగింది. వరంగల్ జిల్లాలో ఒక సామాన్య రైతు కుటుం బంలో జన్మించి విద్యావేత్తగా, పరిశోధకుడిగా విలక్షణమైన సామాజిక శాస్త్రవేత్తగా, సాహితీవేత్తగా, ఒక సామాజిక కార్యకర్తగా అన్నిటి కన్నా ముఖ్యంగా ఆదివాసీ ఉద్యమ మేధావిగా, ఆదివాసీల ఆత్మబంధువుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయారు. మరోపక్క ఏజెన్సీ భూములు, అటవీ వనరులు, ఆదివాసీల రాజ్యాంగ రక్షణలు, ఆదివాసీల హక్కుల విధ్వంసం జరుగుతుంటే ఆవేదనతో ఆదివాసీల భూ సమస్యలు, స్వయం పాలన ఉద్యమాలపై పరిశోధనలు చేసి వారి సంక్షేమం కోసం, హక్కుల కోసం విశేషంగా కృషి చేశారు. తెలంగాణ సాహిత్యం విషయంలో తనదైన శైలిలో ఉద్యమ నిర్మాణాన్ని సామాజిక అంతరంగాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తూ ఆదివాసుల అస్తిత్వాన్ని కూలంకషంగా వివరించే ప్రయత్నం చేశారు. 1983లో కాకతీయ యూనివర్సిటీలో చదువు పూర్తిచేసి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పార్ట్ టైం అధ్యాపకుడిగా చేరారు. ఆకాలంలోనే ఆదివాసులకు జరుగుతున్న అన్యాయాన్ని తన కలం ద్వారా ఎత్తిపట్టారు. ఆదివాసుల భూములు పరాయీకరణ అనే అంశంపై 1985 లో పీహెచ్‌డీ పట్టాపొందిన తొలి ఆదివాసేతర వ్యక్తి (గిరిజనేతరుడు) డాక్టర్ బియ్యాల జనార్దన్‌రావు. 1970-80 కాలంలో ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్ చుట్టు పక్కల ఉన్న ఇతర మండలాల్లో కొనసాగించిన పరిశోధన విధానానికి అదనంగా చారిత్రక కోణంలో అధ్యయనం ద్వారా ఆదివాసీల జీవన విధానం ధ్వంసమవుతున్న తీరును ముందే వివరణాత్మకంగా ఆదివాసీ సమాజానికి అందించారు. ఆ కాలంలోనే కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగపు ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆదివాసీ సమాజంపై, బూర్జువా సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై స్పష్టమైన అవగాహన ఉంది. అంతేకాక భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక కూడా ఉండేది. 1993-2000 కాలంలో ఆదివాసీ ఉద్యమాలు, 1/70 చట్టం, పెసా చట్టం, గ్రామీణ సమస్యలపై దృష్టి సారించారు. అమెరికా, జర్మనీ, స్వీడన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో జరిగిన 11 అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని 62 పరిశోధనా పత్రాలు సమర్పించారు.

వూకె రామకృష్ణ దొర
ఆదివాసీ రచయితల సంఘం అధ్యక్షులు
(నేడు ప్రొఫెసర్ జనార్ధనరావు వర్ధంతి)

మనం
కుటుంబం
మంగళవారం, 27 ఫిబ్రవరి 2018
www.manamnews.com

రక్తహీనతతో బాధపడే మహిళల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా ఉంది. హిమోగ్లోబిన్ లోపంతో బాధపడే వారు కేవలం ఔషధాలతో కాకుండా సహజసిద్ధంగా హిమోగ్లోబిన్ లోపాన్ని అధిగమించే ప్రయత్నం చేయడం అత్యుత్తం అని వైద్యులు చెబుతారు.



మన శరీరంలో హిమోగ్లోబిన్ నిల్వలు చక్కగా ఉండడం అత్యవసరం ఎందుకంటే శరీరమంతా ఆక్సిజన్‌ను మోసుకెళ్లే అతిముఖ్యమైన పని చేసే హిమోగ్లోబిన్ తక్కువగా ఉంటే పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

మీది ఐరన్ బాడీనా?

వీక్‌నెస్‌తో పాటు అనీమియాకు కూడా దారితీసే హిమోగ్లోబిన్ తగ్గుదలతో తలెత్తే అనారోగ్యాన్ని నివారించాలంటే మనం తినే ఆహారంలో ఈ కింద ఉన్నవన్నీ ఉండడం చాలా అవసరం.



ఇది కూడా ప్రొటీనే

ఐరన్ రిచ్ ప్రొటీన్‌ను హిమోగ్లోబిన్‌గా వ్యవహరిస్తారు. ఇది ఎప్పుడూ సాధారణ స్థాయిలో ఉండితీరాల్సిందే లేదంటే అలర్ట్ అవ్వక తప్పదు. శ్వాసకోస సమస్యలు, ఆకలి తక్కువగా ఉండడం, నిద్రలేమి, బద్ధకం, తలనొప్పి, వేగంగా గుండె కొట్టుకోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా హిమోగ్లోబిన్ టెస్ట్ చేయించుకోవాలి.

2011లో యూనిసెఫ్ విడుదల చేసిన విషయాలు చూస్తే మన భారతీయ మహిళలు ఎంత శాతం మంది రక్త హీనతతో బాధపడుతున్నారో అర్థమవుతుంది. 56 శాతం ఇండియన్ టీనేజ్ అమ్మాయిలు అనీమిక్ బాధితులని యూనిసెఫ్ తేల్చింది. అంటే మనదేశంలో ఉన్న టీనేజ్ అమ్మాయిల జనాభాలో సగానికిపైగా అమ్మాయిలు సరైన పోషకాహారం లేక అల్లాడుతున్నారన్నమాట.


పెరుగుతున్న పిల్లలు, గర్భిణీ స్త్రీల్లో ఐరన్ లోపం రాకుండా జాగ్రత్త వహించాలి.

రోజుకో దానిమ్మతో డాక్టర్‌కు దూరంగా..

రోజుకో యాపిల్ లేదా దానిమ్మ క్రమం తప్పకుండా తీసుకుంటే చాలు మీరు డాక్టర్లను సంప్రదించాల్సిన అవసరం ఉండదని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. హిమోగ్లోబిన్, ఐరన్, క్యాల్షియం, ఫైబర్, ప్రొటీన్ రిచ్‌గా ఉండే యాపిల్, దానిమ్మను రోజూ ఏదో ఒక సమయంలో తినడం రొటీన్‌గా పెట్టుకోండి. ఇంకా మీరు తినే ఆహారంలో కరివేపాకు ఉంటే దాన్ని ఏరి పారేయకుండా తప్పకుండా తినండి, దీంతో ఐరన్ లోపాన్ని అధిగమించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

ఐరన్ రిచ్ ఫుడ్

ఐరన్ లోపానికి పరిష్కారం ఐరన్ రిచ్ ఫుడ్ తినడమే. పాలకూర వంటి ఆకుకూరలు, బీట్‌రూట్, టోఫూ, ఆస్పరాగస్, చికెన్ లివర్, గుడ్లు, ఆయిస్టర్స్, యాపిల్, దానిమ్మ, ఆప్రికాట్, పుచ్చకాయ, గుమ్మడి గింజలు, ఖర్జూరం, బాదం, ఎండు ద్రాక్ష, ఉసిరి, బెల్లం వంటివి క్రమం తప్పకుండా పలు రూపాల్లో తీసుకుంటే రక్తహీనత మీ జోలికి రాదు.



ఫోలిక్ యాసిడ్ తీసుకోండి

బీ కాంప్లెక్స్ విటమిన్ అయిన ఫోలిక్ యాసిడ్ సమపాళ్లలో కలిగి ఉంటే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి చురుగ్గా సాగుతుంది, ఎప్పుడైతే ఫోలిక్ యాసిడ్ ఒంట్లో తగ్గుతుందో అప్పుడు హిమోగ్లోబిన్ నిల్వ కూడా పడిపోతుంది. ఇందుకు ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు, బీన్స్, బఠానీలు, అరటిపళ్లు, బ్రాకోలి, చికెన్ లివర్ వంటి వాటిలో పుష్కలంగా లభించే ఫోలిక్ యాసిడ్‌తో శ్రీరామ రక్ష అని గుర్తించండి. రెడ్ బ్లడ్ సెల్స్ కౌంట్ పెంచడంలో బీట్‌రూట్ కీలక పాత్ర పోషిస్తుంది. బీట్‌రూట్‌లో ఐరన్, ఫోలిక్ యాసిడ్, పొటాషియం, ఫైబర్ ఉండడంతో దీన్ని మీ మెనూలో చేర్చుకోవడం అత్యవసరం.



విటమిన్ సీ కూడా..

విటమిన్ సీ, ఐరన్ కాంబినేషన్ సమపాళ్లలో ఉంటేనే మీరు ఆరోగ్యంగా ఉండగలరు. కనుక నిమ్మజాతి పళ్లను ఇష్టంగా తినడం అలవాటు చేసుకోండి. విటమిన్ సీ మీ ఒంట్లో బాగా ఉంటేనే ఐరన్ ఒంటికి పడుతుంది, లేదా మీరు తినే ఆహారంలో ఐరన్ ఉన్నప్పటికీ అది మీ శరీరం గ్రహించలేదు. అందుకే నారింజ, బత్తాయి, నిమ్మకాయ, స్ట్రాబెర్రీ, బొప్పాయ, బెల్ పెప్పర్, బ్రాకోలి, ద్రాక్ష, టమోటాలు చాలా ముఖ్యమైనవి.



ఐరన్‌కు శత్రువులు ఎవరు?

మనం తినే ఆహారంలో ఐరన్ పుష్కలంగా ఉన్నప్పటికీ కొంతమంది ఐరన్ లోపంతో బాధపడు తుంటారు. దీనికి ప్రధాన కారణం కూడా మనం సేవించే పానీయాలు, తినే ఆహారమే. కాఫీ, టీ, కోలా డ్రింక్స్, వైన్, బీర్ తదితర పానీయాల తో మనశరీరంలోకి ఐరన్ అబ్జార్బ్ కాదు, కనుక వీటి కి దూరంగా ఉంటే అనీమిక్ బారిన పడకుండా మిమ్మల్ని మీరు కాపాడుకున్నవారు అవుతారన్నమాట.

ఎక్సర్‌సైజ్



ఇదేంటి వ్యాయామానికి హిమోగ్లోబిన్‌కు మధ్య లింక్ ఉందా? అక్షరాలా ఇదే విషయాన్ని వైద్యులు, న్యూట్రిషనిస్టులు పరిశోధించి మరీ నిగ్గుతేల్చారు. ఓమోస్తరు ఎక్సర్‌సైజ్‌లు చేయడంతో మీ శరీరంలో ఎక్కువ హిమోగ్లోబిన్ ప్రొడ్యూస్ అవుతుంది. ఎందుకంటే వ్యాయామం చేసే సమయంలో మన శరీరానికి ఆక్సిజన్ చాలా ఎక్కువ అవసరమవుతుంది కనుక, హిమోగ్లోబిన్ కూడా ఎక్కువ ప్రొడ్యూస్ అవుతుంది. సో ఆరోగ్యం, అందం రెంటికీ సరైన ప్రాధాన్యత ఇచ్చేవారైతే మీరు రక్తహీనత బారిన పడకుండా మిమ్మల్ని మీరు కాపాడుకోండి. సహజసిద్ధంగా ఇమ్యూనిటీని పెంచుకోవాలన్నా కూడా హిమోగ్లోబిన్ లోపం లేకుండా చూసుకోవడం ప్రప్రథమ కర్తవ్యం. మహిళలే కాదు పెరిగే పిల్లలు, పురుషుల్లో కూడా ఐరన్ లోపం లేకుండా చూసుకోవడం చాలా ముఖ్యం.

• తొలి స్నానం



చైల్డ్ బర్త్ ఫొటోగ్రఫీ

ఓ అందమైన హాబీ

మహిళల ఆసక్తులు, సరదాలు మారుతున్నాయి అనడానికి నిలువెత్తు నిదర్శనమే ''చైల్డ్ బర్త్ ఫొటోగ్రఫీ''. బిడ్డ పుట్టిన తొలి క్షణాలు, లోకంలోకి అడుగుపెట్టిన నవజాత శిశువు తొలి ఘడియలను పదికాలాలపాటు పదిలంగా దాచుకునేందుకు నేటి తల్లులు ప్రదర్శిస్తున్న ఆసక్తి సరికొత్త ప్యాషన్‌కు ప్రాణం పోస్తోంది. తమ ప్రేమకు సాక్ష్యంగా ప్రాణం పోసుకున్న చిన్నారిని పుట్టిన మొదటి క్షణం నుంచి వీడియోలు, ఫొటోలు తీసుకునే తల్లిదండ్రులు ఇప్పుడు చైల్డ్ బర్త్ ఫొటోగ్రాఫర్స్‌ను ఆశ్రయిస్తున్నారు.



లేబర్ రూమ్‌లోకి కెమరాతో



విదేశాల్లో ఉన్న నియమాలకు అనుగుణంగా అక్కడ భర్తను కూడా లేబర్ రూమ్‌లోకి అనుమతించి, భర్త సమక్షంలోనే తల్లి బిడ్డను ప్రసవించడం మెడికల్ ఫార్మాలిటీ. ఇటీవలి కాలంలో మనదేశంలో కూడా పలు కార్పొరేట్ ఆసుపత్రులు ఈ సౌలభ్యాన్ని కల్పిస్తున్నాయి. అయితే ఇదంతా పాతదైపోయింది. ఇప్పుడు తాజాగా చైల్డ్ బర్త్ ఫొటోగ్రాఫర్‌ను కూడా తండ్రితో పాటు లేబర్ రూమ్‌లోకి అనుమతిస్తారు. అంటే ప్రవమైన తొట్టతొలి క్షణాల్లో తల్లి, తండ్రిల ఎమోషన్స్, పురిటి బిడ్డ ఫొటోలను వీరు కెమెరాలో బంధిస్తారన్నమాట.

వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్‌లతో పోటీ

నిజానికి మనదేశంలో చైల్డ్ బర్త్ ఫొటోగ్రాఫర్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది, అందునా ఈ రంగంలో సామాన్యంగా మహిళలే ఎక్కువగా ప్రవేశిస్తారు. ప్రస్తుత ట్రెండ్ చూస్తే వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్లకు చైల్డ్ బర్త్ ఫొటోగ్రఫర్లకు మధ్య విపరీతమైన పోటీ నడుస్తోందని ఫొటోగ్రాఫర్లు వివరిస్తున్నారు. ప్రసవానికి కొన్ని వారాలముందే ఈ ఫొటోగ్రాఫర్లను బుక్ చేసుకోవాలి. నెలలు నిండాక ప్రసవం ఏ క్షణమైనా జరగచ్చు కనుక వీరు కాల్ చేసిన వెంటనే ఆసుపత్రికి చేరుకోవాల్సి ఉంటుంది.

టెక్సాస్ ఫొటోగ్రాఫర్ ఐడియా

అసలు లేబర్ రూమ్‌లో ఎందుకు ఫొటోలు తీయకూడదన్న టెక్సాస్‌కు చెందిన ఓ ఫొటోగ్రాఫర్‌కు వచ్చిన ఐడియాతో.. 'ద ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ప్రొఫెషనల్ బర్త్ ఫొటోగ్రాఫర్స్' అనే ఆన్‌లైన్ ఆర్గనైజేషన్ ప్రారంభమైంది. ఇప్పటికే ఇందులో 400 మంది సభ్యులున్నారు, 2010 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఇలా చైల్డ్ బర్త్ ఫొటోగ్రాఫర్లు బిజీ అయిపోతూ, తమ కళకు జీవం పోస్తున్నారు. మొదటి సారి తల్లులవుతున్నవారి నుంచి 700 డాలర్లకు పైగా చార్జ్‌గా వసూలు చేసే సెలబ్రిటీ చైల్డ్ బర్త్ ఫొటోగ్రాఫర్‌గా టెక్సాస్‌కు చెందిన లింసీ స్టోన్ పాప్యులర్ అయ్యారు. లింసీ అపాయింట్‌మెంట్ కోసం ఎంతైన ఖర్చుచేసే తల్లిదండ్రులున్నారంటే అతిశయోక్తి కాదు. పిల్లలు పుట్టగానే వారిని డిఫరెంట్ యాంగిల్‌లో ఫొటోలు తీయడంతోపాటు, వారికి పోసే తొలిస్నానం ఫొటోలు కూడా ఆసక్తిగొలుపుతాయి..







వెల్ కం బేబీ

తమ ప్రేమకు ప్రతిరూపాలైన చిన్నారులను ఈ లోకంలోకి వెల్ కం చెబుతూ ఆహ్వానించేలా ఉండే ఈ ఫొటోలు తీయడం నిజానికి చాలా పెద్ద సాహసం. ఇలాంటి సందర్భాల్లో తల్లి ఓవైపు ప్రసవ వేదన పడుతుంటే, వైద్యులు చికిత్స చేస్తుంటే మరోవైపు నరాలు తెగే ఉత్కంఠతో తండ్రి ఎదురుచూస్తుంటే కెమరాలో లెన్స్‌ను అడ్జస్ట్ చేసుకుంటూ లేబర్ రూమ్‌లో ఫొటోలు తీయడం అతిపెద్ద చాలెంజ్. ఫొటోలు తీసే సమయంలో ఎటువంటి ఉద్వేగానికి గురైనా కెమరా షేక్ అయి ఫొటోలు బ్లర్ అవుతాయి కనుక ప్రతి క్షణం, ప్రతి ఫ్రేమ్ అతి జాగ్రత్తగా లెన్స్‌తో షూట్ చేయాల్సి ఉంటుంది. ఢిల్లీలో నివాసముంటూ, లాయర్‌గా పనిచేస్తూ, ఆతర్వాత ఫొటోగ్రాఫర్‌గా మారిన ఉర్షిత సైని అనే ప్రొఫెషనల్ ప్రస్తుతం బర్త్ ఫొటోగ్రఫీపై విస్త ృతంగా పనిచేస్తున్నారు. నిత్యం తనకు పదుల సంఖ్యలో ఫోన్లు వస్తున్నాయని, ఆర్డర్లు బాగా వస్తుండడంతో, చేతినిండా పని ఉంటోందని ఉర్షిత చెబుతున్నారు. 'ఇన్ఫ్లెన్స్' అనే బ్రాండ్‌తో తన వృత్తిని కొనసాగిస్తూ, అరుదైన, అపురూప క్షణాలను తల్లిదండ్రులకు అందిస్తున్న ఉర్షిత లాంటి వారి సంఖ్య మనదేశంలో బాగా పెరుగుతోంది.



ఐటీ సేవల్లో తెలంగాణ భేష్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రమంత్రి సీఆర్ చౌదరి ప్రశంసించారు. ఇలాంటి గొప్ప సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ఆయన అభినందనలు చెప్పారు. ఈ-గవర్నెన్స్‌లో ముందుకు సాగుతున్న రాష్ట్రాలను చూసి, ఇతర రాష్ట్రా లు ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. నిజాయతీ, పారదర్శక కలిగిన పాలన అందిస్తే రాష్ట్రాలు అభివృద్ధి పథంలో నిలుస్తాయన్నారు. రాష్ట్రాలు 'ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కొనసాగిస్తూనే, ప్రజలకు 'ఈజీ ఆఫ్ లైవింగ్' కూడా అందించాలన్నారు. హైదరా బాద్‌లో హెచ్ఐసీసీలో సోమవారం ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి సీఆర్ చౌదరి మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన, పారదర్శక పాలన అందాలన్నారు. ప్రజలకు చేరువయ్యే పథకాలు రావాలని పేర్కొన్నారు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదంతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. రేషన్ కార్డులను ఆధార్ అనుసం ధానించడం వల్ల దాదాపు 2.95 కోట్ల డుప్లికేట్ రేషన్‌కార్డుదారులను ఏరివేశామన్నారు. తద్వారా ప్రభుత్వానికి 17,000 కోట్ల రూపాయలు లాభం జరిగిందన్నారు. నేషనల్ కన్స్యూమర్ కమిషన్‌ను డిజిటలైజేషన్ చేయడం వల్ల ప్రతి సంవత్సరం 4 లక్షల కంప్లయింట్స్ వస్తున్నాయన్నారు. లక్షకు పైగా గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించామని స్పష్టం చేశారు. మొబైల్ వాడకంలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నామని తెలిపారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ-గవర్నెన్స్ అంటే ఈజీ, ఎఫిషియెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ అని, తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ బాటలో విజయం సాధించిందని అన్నారు. ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన, పారదర్శక పాలన అందించవచ్చని, తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ పాలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రజలకు అత్యంత ఉపయోగపడే విభాగాల్లో సాంకేతికతను ఉపయోగించే ఉద్దేశంతో మొదటగా ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో డిజిటల్ సేవలను వినియోగించామని ఆయన గుర్తు చేశారు. ఆర్‌టీఏ-ఎం వాలెట్(రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మొబైల్ వాలెట్) ప్రారంభించిన మూడు నెలల్లోనే ఒక్క హైదరాబాద్‌లోనే 1.3 మిలియన్ ప్రజలు డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. టెక్నాలజీ ప్రజలకు నచ్చితే.. రోజువారీ పనులను ఈజీగా చేసుకునేలా ఆ సాంకేతికత ఉపయోగపడితే.. ప్రజల మన్నన పొందుతుందనడానికి ఈ యాప్ ఉదాహరణ అన్నారు. పౌరసేవల కోసం రాష్ట్రవ్యాప్తంగా 4,500 మీ-సేవ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నాలుగేళ్లలోనే మీ-సేవ ద్వారా రూ.10 కోట్ల లావాదేవీలు జరగాయని, ప్రతిరోజు రూ.1.50 లక్షల లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. మీ సేవ యాప్‌లో 2.0 కొత్త వెర్షన్‌ను కొద్ది రోజుల్లో తీసుకువస్తున్నామని తెలిపారు. టీ-వాలెట్ ద్వారా సులభమైన పద్ధతిలో లావాదేవీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల ప్రజలే కాదు గ్రామాల్లోనూ టీ వాలెట్ వాడుతున్నారని తెలిపారు.


పరిశ్రమల రాకలో ముందున్నాం..

సులభ వాణిజ్య విధానం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. వ్యాపార అనుకూల రాష్ట్రాల్లో దేశంలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. టీఎస్ ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే నూతన పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నామని, ఇచ్చిన గడువులో అనుమతులు రాకుంటే ఉన్నతాధికారి అయినా సరే జరిమానా విధిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. సింగిల్ విండో ద్వారా అనుమతులు జారీ చేస్తున్నామన్నారు. దీని ద్వారా పరిశ్రమలకు అనుమతులను వేగవంతం చేశామన్నారు. ఇంత వేగవంతమైన ప్రక్రియ దేశంలో ఎక్కడా లేదని ఆయన వ్యాఖ్యానించారు. పరిశ్రమల అనుమతుల విషయంలో తెలంగాణ ముందంజలో ఉందని, ఇప్పటివరకు దాదాపు 6,000 పరిశ్రమలకు అనుమతులిచ్చామన్నారు. 3 వేల పైచిలుకు ఉద్యోగాలను కల్పించామన్నారు. ఇదే తరహా విధానాన్ని జీహెచ్ఎంసీలోని డీపీఎంఎస్(డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విభాగంలోనూ అనుసరిస్తున్నామన్నారు. భవనాల పర్మిషన్ కోసం ఆఫ్‌లైన్ పద్ధతికి స్వస్తి పలికామని, కేవలం ఆన్‌లైన్ ద్వారానే అనుమతులు పొందాలన్నారు. సరైన పత్రాలు లేకుంటే వారం రోజుల్లోనే రిజెక్ట్ అవుతుందని, అన్ని సరిగ్గా ఉంటే 21 రోజుల్లో అనుమ తులు వస్తాయన్నారు. టెక్నాలజీ వాడకం ద్వారా పౌరసరఫరాల శాఖలో వృథాకు అడ్డుకట్ట వేశామని, ఆ విధంగా పీడీఎస్ విభాగానికి రూ. 100 కోట్లు ఆదా అయ్యాయని మంత్రి కేటీఆర్ చెప్పారు.

ఇంటింటికీ నీరు, ఇంటర్నెట్..

మరికొన్ని నెలల్లోనే మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరుని, టీ-ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి ఇంటర్నెట్ ను అందించబోతున్నామని మంత్రి పేర్కొన్నారు. అందరికీ 15 ఎమ్‌బీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ అందిస్తామన్నారు. ఇప్పటికే 3000 పాఠశాలల్లో డిజిటల్ తరగతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. టీ-సాట్ ద్వారా దాదాపు కోటి మందికి పైగా విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారన్నారు. 86 సంవత్సరాల తర్వాత భూరికార్డుల ప్రక్షాళన చేపట్టామని కేటీఆర్ వెల్లడించారు. భూములన్నింటినీ ఆధార్ సంఖ్యతో అనుసంధానించబోతున్నామని పేర్కొన్నారు. దీని ద్వారా బినామీలను ఏరివేస్తామన్నారు. డిజిటల్ తెలంగాణను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పరిపాలన మారాలని, దేశంలోని పరిస్థితులు, సమాజం మారాలని కోరుకుంటామని, కానీ అద్భుతాలు ఒక్కరోజులో ఆవిష్కృతం కావని, ఒక్కసారిగా మార్పులు సంభవించవని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో మొదటిసారి ఈ-గవర్నెన్స్ సదస్సు జరగడం సంతోషంగా ఉందని సీఎస్ జోషి తెలిపారు. మెరుగైన పౌరసేవల కోసం ఈ సదస్సు ఉపయోగపడ ుతుందన్నారు.

ఆరుగురిని మింగేసిన ఇయర్ ఫోన్స్



(మొదటిపేజీ తరువాయి)

అప్పటికే వెళ్లిపోయింది. దీంతో వారంతా తిరిగి పిల్‌ఖువా చేరుకున్నారు. ఇయర్ ఫోన్స్‌లో పాటల వింటూ పట్టాలపై నడుకుంటూ వెళ్లారు. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన రైలు వారిని ఢీకొట్టడంతో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరో బాలుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇయర్ ఫోన్స్ పెట్టుకుని దిగాలు నడుచుకుంటూ వెళ్తున్న వారు రైలు శబ్దం వినపడక ప్రమాదం బారినపడ్డారని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు.

రైతన్నకు 5 లక్షల ప్రమాద బీమా





(మొదటిపేజీ తరువాయి)

కుటుంబాన్ని ఆదుకుంటుందని చెప్పారు. ఈ పథకంతో రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందని సీఎం పేర్కొన్నారు. రైతులకు బీమా చేయించడంలో రైతు సమన్వయ సమితులదే కీలకపాత్ర అని తెలిపారు. సోమవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన 'రైతు సమన్వయ సమితి' ప్రాంతీయ సదస్సులో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ఈ సదస్సుకు 17 జిల్లాలకు చెందిన రైతు సమన్వయ సమితుల నాయకులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ.. ఈ గడ్డ మీద గర్జించి రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని అన్నారు. కరీంనగర్ నుంచి మొదలుపెట్టిన కార్యక్రమం ఏదైనా విజయవంతమవుతుంది కాబట్టే రైతులకు బీమా సదుపాయం ఇక్కడి నుంచి ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో సంఘాలు, యూనియన్లు లేనివారు ఎవరైనా ఉన్నారంటే అది రైతులేనని చెబుతూ ఐకమత్యంగా ఉండాలంటూ వారికి సీఎం పిలుపునిచ్చారు. మామిడి సహా అన్నిరకాల పండ్ల తోటల రైతులకు కూడా పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పారు. పంటకు కనీస మద్దతు ధర ఈ యాసంగి నుంచే మొదలు కావాలన్నారు. ఏప్రిల్ నుంచి చెక్కులు అందిస్తామని చెప్పారు. పామాయిల్ పంటలకు, గిరిజన రైతులకు కూడా పంట పెట్టుబడి సాయం అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా పెట్టుబడి సాయం వదులు కుంటే ఆ మొత్తాన్ని రైతు సమితి నిధికే కేటాయిస్తామని, కౌలు రైతులకు ఇవ్వలేమని చెప్పారు. రైతుల హక్కులకు భంగం కలిగించవద్దన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైతే రైతు సమన్వయ రాష్ట్ర సమితికి రూ.10 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పారు. రైతు పండించే ప్రతి గింజకూ మద్దతు ధర లభించాలని ఆయన తెలిపారు. రెండో యాసంగి పంటలో 19 లక్షల ఎకరాలలో వరి సాగవుతుం దన్నారు. ఈ నేపథ్యంలో గోదాముల సామర్థ్యాన్ని నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 22 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచినట్లు తెలిపారు. ఎక్కడికక్కడే ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు.

గత పాలకుల వల్లే..

గతంలో కాంగ్రెస్, బీజేపీ పాలనల వల్లే రైతులు అభివృద్ధి సాధించలేకపోయారని, అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారని సీఎం కేసీఆర్ ఆరోపించారు. ఆ పార్టీలు ఏనాడూ రైతులను, రైతుల సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదని మండిపడ్డారు. టీఆర్ఎస్ పాలనలో ఆ దుస్థితి తలెత్తదని చెబుతూ.. రాబోయే రోజుల్లో రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర అందుకోబోతున్నారని తెలిపారు. నిజాం కాలంలో ప్రధాన ప్రాజెక్టులను అప్పటి రాజులు నిర్మిస్తే.. సమైక్య పాలనలో మొత్తం 75 వేల చెరువులను నాశనం చేశారని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓవైపు 70 టీఎంసీల నీరు లభిస్తున్నా, 325 కిలోమీటర్ల గోదావరి 65 టీఎంసీల నీటితో 365 రోజులు పారుతున్నా.. తెలివి తక్కువ కాంగ్రెస్, బీజేపీ పార్టీల వైఖరి వల్లే రైతుల పరిస్థితి మెరుగుపడలేదని విమర్శించారు. రైతులను ఆదుకోవడంలో ఆ రెండు పార్టీలు దారుణంగా విఫలమయ్యాయని కేసీఆర్ మండిపడ్డారు. పైపెచ్చు దేశంలో, రాష్టంలో గతంలో పాలించిన పార్టీలు ఇప్పుడు రోడ్లెక్కి ధర్నాలు చేయడం విడ్డూరమని అన్నారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలకు స్వస్థి చెప్పాలంటూ ఆయన కాంగ్రెస్, బీజేపీలకు హితవు పలికారు. రైతులకు ఎలాంటి సంఘటిత శక్తి లేదనే ప్రభుత్వాలు ఇలా వ్యవహరిస్తున్నాయని కేసీఆర్ పేర్కొన్నారు.

కాలువల్లోకి నీళ్లు పారిస్తాం..

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తైతే ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం కానుందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టు పూర్తై కాలువల్లోకి నీరువస్తే రైతుల సాగు నీటి కష్టాలు తీరుతాయని, నీటి కోసం ఎదురుచూడా ల్సిన పరిస్థితి రైతన్నకు తప్పుతుందని చెప్పారు. 2018-19 బడ్జెట్‌లో సాగునీటి రంగానికి అత్యధిక నిధులు కేటాయిస్తామన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కేంద్రాన్ని కోరామని సీఎం వివరించారు. ఇదే విషయంపై కేంద్ర మంత్రులు రాధా మోహన్ సింగ్, అరుణ్ జైట్లీలకు ఎన్నిసార్లు విన్నవించినా, ప్రధానిని కోరినా ఫలితం లేకుండా పోతోందని సీఎం పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు తెలంగాణ పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. రైతులకోసం కనీసం రూ.లక్ష కోట్లు కూడా కేటాయించ లేకపోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తి, కేంద్రాన్ని గట్టిగా నిలదీయాలంటూ టీఆర్ఎస్ ఎంపీలకు సూచించామని చెప్పారు. రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తీరాలని పేర్కొన్నారు.

సమన్వయ సమితి ఆషామాషీ కాదు..

రైతులంతా ఇకముందు ఐకమత్యంతో వ్యవహరిస్తూ కల్తీ విత్తనాలు రాకుండా అడ్డుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. విత్తనాల కల్తీకి పాల్పడే వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని చెబుతూ.. కల్తీ విత్తనాల సరఫరాదారులపై పీడీ యాక్టు కేసు సమోదు చేస్తామని హెచ్చరించారు. రైతు సమన్వయ సమితి ఆషామాషీ వ్యవహారం కాదని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రైతుల సర్వతోముఖా భివృద్ధికి తోడ్పడే క్రమంలో సమితులు ఓ భాగమని చెప్పారు. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కూడా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒక పెద్ద సమస్యపై యుద్ధం చేయబోతున్నామని పేర్కొంటూ కలిసి నడిస్తే లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఈటల రాజేందర్, ఎంపీలు కవిత, గుత్తా సుఖేందర్‌రెడ్డి, లక్ష్మీకాంతరావు, వినోద్‌కుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ బాపురెడ్డి, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ట్రైస్కాబ్ చైర్మన్ కొండూరి రవిందర్‌రావు, పలు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 17 జిల్లాల నుంచి పెద్ద ఎంతున రైతులు పాల్గొన్నారు.

గోదాముల సామర్థ్యం 22 లక్షల టన్నులు: హరీశ్ రావు




రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రతీ మండలంలో మార్కెటింగ్ గోదాములు, సబ్‌యార్డుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి హరీశ్ రావు తెలిపారు. రైతు సమన్వయ సదస్సులో మినీ మార్కెట్ల ఏర్పాట్ల అంశంపై వచ్చిన అభిప్రాయాలపై మంత్రి స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగు లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు ఉండేవన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా రూ.వెయ్యి కోట్లు వెచ్చించి 18 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల నిర్మాణం పూర్తిచేశామని చెప్పారు. మరో 3 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన గోదాములు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం 22 లక్షల టన్నుల సామర్థ్యం కల్గిన గోదాములు రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. వీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని మంత్రి చెప్పారు. రైతు సమన్వ య సమితి సూచన మేరకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో కొత్తగా 35 మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 3500 మినీ మార్కెట్ల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించిందని, దీనికి సంబంధించిన మార్గదర్శకాల రూపకల్పన జరుగుతోందని మంత్రి హరీశ్ వివరించారు.

బోనీకపూర్ నిలిపివేత

పాస్‌పోర్టు స్వాధీనం.. దుబాయ్ వీడి వెళ్లొద్దు

కేసు ఏంటో తేలాల్సిందే.. దుబాయ్ పోలీసుల ఆదేశం



దుబాయ్, ఫిబ్రవరి 26: బంధువుల పెళ్లికి వెళ్లి శనివారం రాత్రి దుబాయ్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించిన హీరోయిన్ శ్రీదేవి మృతదేహం ఇంకా భారతదేశానికి చేరుకోలేదు. ఇంకా కొన్ని అనుమతులు రావాల్సి ఉందని దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులు తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడానికి ఎంత సమయం పట్టేదీ స్పష్టంగా చెప్పలేమంటున్నారు. మరోవైపు..

కేసు తేలే వరకు దుబాయ్ విడిచి వెళ్లొద్దని శ్రీదేవి భర్త బోనీ కపూర్‌ను దుబాయ్ పోలీసులు ఆదేశించారు. ఆయన పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నారు. శ్రీదేవి మృతి విషయంలో అనుమానాలు ఉన్నాయని, కేసు ప్రస్తుతం విచారణలో ఉందని.. అందువల్ల అదేంటో తేలేవరకు బోనీ కపూర్ దుబాయ్ విడిచి వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

ఎంసెట్ తేదీలివే!

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ఈ ఏడాది తొలిసారిగా ఆన్‌లైన్‌లో మూడు భాషల్లో ఎంసెట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం మార్చి 4 నుంచి ఏప్రిల్ 4 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేయవచ్చునని చెప్పారు. ఎస్సీ, ఎస్సీ అభ్యర్థులకు దరఖాస్తు రుసుం రూ.400, ఇతరులకు రూ.800గా నిర్ణయించామని తెలిపారు. ఈ గడువు తేదీ దాటిన తర్వాత ఏప్రిల్ 11 వరకూ రూ.500, 18వ తేదీవరకూ రూ.1000, 24వ తేదీదాకా రూ.5 వేలు, ఆ తర్వాత 28వరకూ రూ.10వేల వంతున అపరాధ రుసుముతో దరఖాస్తులు సమర్పించే వీలుందని తెలిపారు. దరఖాస్తులలో తప్పుల దిద్దుబాటుకు ఏప్రిల్ 6 నుంచి 9వ తేదీవరకు గడువు ఉంటుందన్నారు. అటుపైన ఏప్రిల్ 20 నుంచి మే 1 వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు ఒక్క నిమిసం ఆలస్యంగా వచ్చినా పరీక్ష గదిలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ నిబంధన క్రమశిక్షణ కోసమే తప్ప అభ్యర్థులను ఇబ్బంది పెట్టేందుకు కాదని వివరించారు. పరీక్ష పూర్తయిన పది రోజుల్లో ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఇక మే 6న 'నీట్' నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ రోజున సెలవు ప్రకటిస్తున్నట్లు చెప్పారు.

బాత్ టబ్‌లో మునిగి..

శ్రీదేవి మృతికి కారణం అదే

దుబాయ్, ఫిబ్రవరి 26:



కోట్లాది మంది భారతీయుల ఆరాధ్య దేవత.. బహుభాషా నటి శ్రీదేవి మరణానికి కారణం అందరూ అనుకుంటున్నట్లుగా గుండెపోటు గానీ, కార్డియాక్ అరెస్టు గానీ కాదా? ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగిపోయి మరణించారా? దుబాయ్ వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ప్రివెంటివ్ మెడిసిన్ విభాగం అందించిన ఫోరెన్సిక్ నివేదిక ఇదే అంశాన్ని స్పష్టం చేస్తోంది. 'శ్రీదేవి బోనీ కపూర్ అయ్యప్పన్' అనే పేరుమీద జారీచేసిన క్లుప్తమైన ఫోరెన్సిక్ నివేదికలో ఆమె మరణానికి కారణం 'ప్రమాదవశాత్తు మునిగిపోవడం' అని పేర్కొన్నారు. డాక్టర్ సమీ వాడీ ఈ నివేదికను జారీచేశారు. అంతేకాదు.. ఆమె మృతదేహంలో ఆల్కహాల్ నమూనాలు కూడా కనిపించాయని గల్ఫ్ న్యూస్ పత్రిక అనధికారికంగా తెలిపిన సమాచారం. దుబాయ్‌లోని జుమైరా ఎమిరేట్స్ టవర్స్ హోటల్లోని తన గదిలో మద్యం మత్తులో గాఢనిద్రలో ఉన్న శ్రీదేవిని.. ఆమె భర్త బోనీకపూర్ డిన్నర్‌కు వెళ్దామని లేపడం.. పావుగంట సేపు వాళ్లిద్దరూ కబుర్లు చెప్పుకొన్న తర్వాత ఆమె రెడీ అవ్వడానికి బాత్రూంలోకి వెళ్లడం వరకు అందరికీ తెలుసు. అయితే ఆ తర్వాత బాత్రూంలో ఏం జరిగిందన్న విషయం మీదే ఎవరికీ స్పష్టత లేదు. గుండెపోటు రావడం వల్ల శరీరం అదుపుతప్పి ఆమె బాత్‌టబ్‌లో పడిపోయిందా.. లేదా మద్యం మత్తు వీడకపోవడంతో బాత్‌టబ్‌లో పడిపోయిందా అనేది మాత్రం స్పష్టంగా తేలలేదు. టబ్ నిండా నీళ్లు కూడా ఉండటంతో.. ఆ నీళ్లలో పడి మునిగిపోవడం వల్లే శ్రీదేవి మరణించినట్లు ఫోరెన్సిక్ నివేదికలో పేర్కొన్నారు.

జవాబు లేని ప్రశ్నలు

శ్రీదేవి మరణం విషయంలో రెండో రోజుకు చాలా అనుమానాలు తలెత్తాయి. బోనీకపూర్ తన చిన్నకుమార్తె ఖుషీతో కలిసి వెళ్లిపోయారని చెబుతున్నారు. అంటే ఆయన దుబాయ్ నుంచి ముంబై వచ్చేశారా.. లేక దుబాయ్‌లోనే వేరే ఎక్కడికైనా వెళ్లారా అన్న విషయం తెలియడం లేదు. భర్త, కూతురు వెళ్లిపోయినా శ్రీదేవి ఒక్కరే దుబాయ్ హోటల్లో ఎందుకు ఉండిపోయారో అర్థం కావడం లేదు. సెలబ్రిటీలు మద్యం తీసుకోవడం సర్వసాధారణం. కానీ, తూలి.. బాత్‌టబ్‌లో పడిపోయి మునిగిపోయి ప్రాణాలు పోతున్నా తెలియని స్థితిలో శ్రీదేవి ఉన్నారా అంటే.. ఆ ప్రశ్నకూ సమాధానం లేదు. పోనీ గుండెపోటు రావడం.. లేదా కార్డియాక్ అరెస్టు కావడం జరిగి, అప్పటికే మరణించి బాత్‌టబ్‌లో నిర్జీవంగా పడిపోతే ఫోరెన్సిక్ నివేదికలో 'ప్రమాదవశాత్తు మునిగిపోవడం' అని మరణ కారణం ఎందుకు పేర్కొన్నారు? ఇదంతా పక్కన పెడితే.. తొలి రోజు అసలు బాత్‌టబ్ అంశాన్ని ఎక్కడా ప్రస్తావించకుండా కేవలం బాత్రూంలో గుండెపోటు వచ్చి అక్కడే కుప్పకూలారని మాత్రమే ఎందుకు ప్రచారం చేశారు? మృతికి కారణాలపై అబద్ధాలు చెప్పాల్సిన అవసరం ఏమొచ్చిందని అభిమానులు ప్రశ్నిస్తున్నారు. అసలు గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్టు అన్న మాటనే ఫోరెన్సిక్ నివేదికలో ప్రస్తావించలేదు.

బోనీ వాంగ్మూలం నమోదు

శ్రీదేవి భర్త బోనీకపూర్‌పై దుబాయ్ పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఆయనను నిశితంగా ప్రశ్నించారు. మృతి గురించి ఆయన చెప్పిన వివరాలను నమోదుచేసుకున్నారు. ఆయన వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారు. ఆ తర్వాత శ్రీదేవి, బోనీకపూర్ ఇద్దరి ఫోన్ల కాల్‌డేటాను సేకరించారు. అయితే బోనీకపూర్ మాత్రం సోమవారం సాయంత్రం వరకు శ్రీదేవి మరణం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు.



విచారణ పూర్తికాలేదు

అనుమానాలకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వకుండా అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని.. ఆమె మరణంపై విచారణ ఇంకా పూర్తికాలేదని దుబాయ్ పోలీసులు తెలిపారు. ఆ తర్వాత దుబాయ్ పోలీసులు ఈ కేసును దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేశారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో న్యాయపరమైన అంశాలన్నింటినీ వాళ్లే చూసుకుంటారని దుబాయ్ మీడియా ఆఫీసు ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా తెలిపారు. స్పృహ తప్పి హోటల్‌లోని బాత్ టబ్‌లో పడిపోవడం వల్లే మునిగిపోయి ఆమె మరణించినట్లు దుబాయ్ పోలీసు ప్రధాన కార్యాలయ వర్గాలు చెప్పాయని కూడా అన్నారు.

రాముడు ఉన్నచోటే మందిర నిర్మాణం

- **బీజేపీ ఎంపీ వినయ్ కతియార్**



బారాబంకి(యూపీ), ఫిబ్రవరి 26: అయోధ్యలో ఇప్పుడు రాము డు ఉన్నచోటే మందిరాన్ని నిర్మిస్తామంటూ బీజేపీ రాజ్యసభ ఎంపీ వినయ్ కతియార్ స్పష్టం చేశారు. మందిరం నిర్మాణానికి ఎంత సమ యం పడుతుందో చెప్పలేను కానీ నిర్మాణం మాత్రం ముమ్మాటికీ అక్క డే జరుగుతుందని పేర్కొన్నారు. ఈమేరకు బారాబంకిలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఎంపీ స్థానిక విలేకరులతో మాట్లాడారు. 'సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నం దున ఈ విషయంపై ఎక్కువగా మాట్లాడలేకపోతున్నా.. కానీ ఇప్పుడు రాముడి విగ్రహం ఎక్కడుందో అక్కడే రామ మందిరాన్ని నిర్మిస్తాం. ఎంతకాలమైనా సరే అది రాముడి భూమి.. మందిరం అక్కడే కడతాం' అని పేర్కొన్నారు. సుప్రీం తీర్పు కోసం వేచి చూస్తున్నట్లు ఆయన వివరించారు. మరో ప్రశ్నకు జవాబుగా.. కేంద్రంలో ప్రధాని మోదీ, యూపీలో సీఎం యోగి ఆదిత్యనాథ్ అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. యోగి పాలనలో నేరస్థులు తమకు తాముగా పోలీస్ స్టేషన్లకు వచ్చి లొంగిపోతున్నారని ఎంపీ వినయ్ కతియార్ పేర్కొన్నారు.

భరతమాతకు జై కొట్టకుంటే పాకిస్థానీయులే

- **బీజేపీ ఎమ్మెల్యే సురేంద్ర సింగ్**



బాలియా(యూపీ), ఫిబ్రవరి 26: భరత మాతకు జై కొట్టని వాళ్లు పాకిస్థానీయులే అంటూ బీజేపీ యూపీ ఎమ్మెల్యే సురేంద్ర సింగ్ మరో సారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాను పుట్టిన గడ్డకు తల్లి స్థానం కల్పించలేని వారి దేశభక్తిని శంకించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 2024 లోగా భారత్ పూర్తి హిందూ దేశంగా మారిపోతుందని వ్యాఖ్యా నించి ఇటీవలే సింగ్ వార్తల్లో నిలిచారు. తాజాగా బాలియాలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన సింగ్ వందే మాతరం పలికేందుకు ఇష్టపడని వారికి ఈ దేశంలో ఉండే హక్కులేదని మండి పడ్డారు. వారికి రాజకీయాల్లోకి వచ్చే అర్హత అసలే లేదని తేల్చిచెప్పారు. జన్మనిచ్చిన గడ్డకు తల్లి స్థానం కల్పించలేని వారికి దేశభక్తి ఎక్కడున్నట్లని ఆయన ప్రశ్నించారు. కాగా, ఇసుక అక్రమ రవాణా విషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. మీ ఇంటి వ్యక్తిగత అవసరాలకోసం ఇసుక తీసుకెళుతుంటే అడ్డగించిన పోలీసుల చెంపపై కొట్టాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా దొంగను పట్టుకుని హింసిస్తున్నా ఇదే ట్రీట్‌మెంట్ ఇవ్వాలని చెప్పారు.

మళ్లీ ఆస్పత్రిలో చేరిన పర్రీకర్

- **సీఎం ఆరోగ్యంగానే ఉన్నారు.. గోవా ఆరోగ్య మంత్రి వెల్లడి**



పణజి, ఫిబ్రవరి 26: గోవా సీఎం మనోహర్ పర్రీకర్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆ రాష్ట్ర మంత్రి ఒకరు వెల్లడించారు. కాలేయ సం బంధిత వ్యాధితో బాధపడుతున్న పర్రీకర్ ఇటీవలే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన విషయం తెలిసిందే! ఆపై అసెంబ్లీకి హాజరై బడ్జెట్‌ను కూడా ప్రవేశ పెట్టారు. తాజాగా సీఎం పర్రీకర్ గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్(జీఎంసీహెచ్)లో చేరారు. డీహైడ్రేషన్‌తో బాధపడుతు న్న ముఖ్యమంత్రిని ఆస్పత్రిలో చేర్చామని, ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని గోవా ఆరోగ్య శాఖ మంత్రి విశ్వజిత్ రానె మీడియాకు తెలిపా రు. సీఎం స్వల్ప డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నట్లు ఆయన పేర్కొన్నా రు. జీఎంసీహెచ్‌లోని 121 వార్డ్‌లో సీఎం పర్రీకర్‌ను వైద్య నిపుణులు పరీక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. కాగా, కాలేయ సంబంధి త వ్యాధితో బాధపడుతున్న సీఎం మనోహర్ పర్రీకర్ ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో వారం పాటు చికిత్స తీసుకున్నారు. ఈ నెల 22న ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికొచ్చిన సీఎం ఆ వెంటనే అసెంబ్లీకి హాజరయ్యారు. శాసన సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆయన ఆరోగ్యం కుదుట పడిందని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో సీఎం పర్రీకర్ మరోసారి ఆస్పత్రిలో చేరారన్న వార్త కలవరం రేపింది. ఈ నేపథ్యంలో దీనిపై ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్ రానె వివరణ ఇచ్చారు.

'భూ సేకరణ'పై రాజ్యాంగ ధర్మాసనం

- **భిన్న ఆదేశాల నేపథ్యంలో సుప్రీం కోర్టు నిర్ణయం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: భూ సేకరణకు సంబంధించిన వివాదంపై త్రిసభ్య ధర్మాసనాలు భిన్న ఆదేశాలిచ్చిన నేపథ్యంలో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు నిర్ణయించింది. భూ సేకరణపై పరిహారాన్ని ఐదేళ్ల నిర్దిష్టవ్యవధిలోగా స్వీకరించకపోవడమన్నది సదరు భూ సేకరణ రద్దుకు ప్రాతిపదిక కాబోదని ఒక త్రిసభ్య ధర్మాసనం ఈ నెల 8న ఉత్తర్వులిచ్చింది. అయితే, ఈ ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మరొక త్రిసభ్య ధర్మాసనం 21న ఆదేశాలు జారీచేసింది. ఈ పరిస్థితుల నడుమ న్యాయ క్రమశిక్షణ అవసరమని, తదనుగుణంగా చర్య తీసుకోవాలని కోరుతూ మరో ధర్మాసనం చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాకు నివేదించింది. దీంతో ఆయన తన నేతృత్వంలో ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తూ మార్చి 6న విచారణ చేపడతామని ప్రకటించారు.

'న్యాయ విచక్షణ'లో జాగ్రత్త అవసరం

వివిధ కేసులపై నిర్ణయాల్లో దేశవ్యాప్తంగాగల మేజిస్ట్రేట్ స్థాయి న్యాయాధికారులు 'న్యాయ విచక్షణ'ను వర్తింపజేయకపోవడంపై సుప్రీం కోర్టు విచారం వ్యక్తం చేసింది. అనేక సందర్భాల్లో సర్వోన్నత న్యాయస్థానం నిర్దేశించిన ప్రమాణాలను వారు మార్గదర్శకంగా స్వీకరించడం లేదని జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ల ధర్మాసనం పేర్కొంది. ఇకనైనా ఈ మార్గదర్శకాల బాటలో తమ విచక్షణను జాగ్రత్తగా వినియోగించాలని సూచించింది.

ఆ గవర్నర్ ఎవరు?

- **లైంగిక వేధింపుల ఆరోపణలు**
- **ఓ దక్షిణాది గవర్నర్‌పై ఫిర్యాదు**
- **హోం మంత్రిత్వశాఖ రహస్య విచారణ**
- **గతంలో మేఘాలయ గవర్నర్‌పైనా..**
- **అంతకుముందు ఏపీలో ఎన్డీ తివారీ**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: దక్షిణాది రాష్ట్రాలలో ఒక రాష్ట్ర గవర్నర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. వాటిని కేంద్ర హోం మంత్రిత్వశాఖ అత్యంత రహస్యంగా విచారిస్తోంది. ఫిర్యాదులో వాస్తవమెంత అనే విషయంపై ముందుగా విచారణ జరుగుతున్నట్లు సమాచారం. రాజ్‌భవన్‌లోని మహిళా ఉద్యోగులను గవర్నర్ లైంగికంగా వేధించారన్నది ఆ ఫిర్యాదు సారాంశం. ఆ గవర్నర్ ఎవరన్న విషయాన్ని కేంద్ర హోంశాఖ ఇంతవరకు బయటపెట్టలేదు. కానీ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉన్నట్లు మాత్రం తెలుస్తోంది. రాజ్యాంగ పదవిలో ఉండి, రాష్ట్ర పరిపాలన మొత్తానికి బాధ్యత వహించాల్సిన పెద్దమనిషి ఇలాంటి నీచమైన పనులకు పాల్పడటాన్ని సహించే ప్రసక్తి లేదని అంటున్నారు. ఒకవేళ ఫిర్యాదులో ఏమాత్రం నిజం ఉందని తెలిసినా.. వెంటనే గవర్నర్ చేత రాజీనామా చేయిస్తారని చెబుతున్నారు. ఇంతకముందు గత సంవత్సరం జనవరి నెలలో మేఘాలయ గవర్నర్ వి. షణ్ముగనాథన్ మీద కూడా ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. వెంటనే ఆయనచేత రాజీనామా చేయించారు. అంతకంటే చాలా సంవత్సరాల ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎన్డీ తివారీ రాసలీలలు ఏకం గా సీడీ రూపంలో బయటకు వచ్చి టీవీ చానళ్లలో కూడా ప్రసారం అయ్యాయి. ఆయన సైతం తన పదవిని పోగొట్టుకున్నారు. ఇప్పు డు తాజాగా ఆరోపణలొచ్చిన గవర్నర్‌ను మాత్రం కేంద్రం ఇంకా పిలిపించలేదు. ఆ రాష్ట్రం లో రాజకీయ వాతావరణం సున్నితంగా ఉండటంతో.. ఇలాంటి పరిస్థితుల్లో గవర్నర్‌ను మార్చడం ఇబ్బంది అవుతుందనో.. ఏమోగానీ ప్రస్తుతానికి ఆపుతున్నారు. షణ్ముగనాథన్ విషయంలో అయితే రాజ్‌భవన్‌కు చెందిన దాదాపు 100 మంది ఉద్యోగులు అప్పట్లో ఫిర్యాదు చేయడంతో నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆయనను రీకాల్ చేశారు. ఇప్పుడు ఈ గవర్నర్ పరిస్థితి ఏమవుతుందో చూడాలి.

డిన్నర్‌కు వెళ్లబోతూ..!

దుబాయ్‌లో డిన్నర్ ప్లాన్ చేసిన బోనీ..

- **రెడీ అవ్వడానికి బాత్రూంకు వెళ్లిన శ్రీదేవి**
- **అక్కడే బాత్‌టబ్‌లో పడిపోయి.. మరణం**
- **దుబాయ్ పత్రికల కథనంలో వెల్లడి**



దుబాయ్, ఫిబ్రవరి 26: డిన్నర్ కోసం రెడీ అవ్వడానికని బాత్రూంకు వెళ్లిన శ్రీదేవి.. అక్కడే బాత్‌టబ్‌లో నిర్జీవంగా పడిపోయారు! ఈ విషయాన్ని దుబాయ్ పత్రిక ఖలీజ్ టైమ్స్ తెలిపింది. తమ సమీప బంధువు మోహిత్ మార్వా పెళ్లికి హాజరయ్యేందుకు బోనీకపూర్, శ్రీదేవి, వారి చిన్న కుమార్తె ఖుషీ కలిసి దుబాయ్ వెళ్లారు. అక్కడ పెళ్లి నుంచి చాలామంది వెనక్కి వచ్చేసిన తర్వాత కూడా శ్రీదేవి అక్కడే ఉండిపోయారు. రాత్రి 7 గంటల సమయంలో (భారత కాలమానం ప్రకారం) హోటల్లో నిద్రపోతున్న భార్య వద్దకు వచ్చి బోనీకపూర్ ఆమెను నిద్రలేపారు. పావుగంటసేపు కబుర్లు చెప్పుకొన్న తర్వాత.. డిన్నర్‌కు వెళ్దామని బోనీ చెప్పడంతో శ్రీదేవి సరేనని రెడీ అవ్వడానికి బాత్రూంకు వెళ్లారు. పావు గంట దాటినా ఆమె బయటకు రాకపోవడంతో బోనీకపూర్ వెళ్లి తలుపు కొట్టారు. అటు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో బలవంతంగా తలుపు తీసి చూస్తే.. నిండా నీళ్లున్న బాత్‌టబ్‌లో శ్రీదేవి చలనం లేకుండా పడిపోయి ఉన్నారు. గట్టిగా కదిపి, లేపడానికి ప్రయత్నించినా లేవకపోవడంతో తన స్నేహితులను పిలిచారు. చివరకు రాత్రి 10.30 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందించా రు. పోలీసులతో పాటు వైద్యులు కూడా హుటాహుటిన హోటల్ గదికి చేరుకుని చూశారు గానీ, అప్పటికే ఆమె మరణించారు. దాంతో ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఫోరెన్సిక్ మెడిసిన్ డిపార్టుమెంటుకు తరలించారు.

బాబాయ్ ఇంట్లో పిల్లలు

శ్రీదేవి కుమార్తెలు జాన్వీ, ఖుషీ ఇద్దరూ తమ బాబాయ్ అనిల్‌కపూర్ ఇంట్లోనే ఉన్నారు. మృతదేహం ఎప్పటికొస్తుందో స్పష్టంగా తెలియకపోవడంతో వాళ్లు అక్కడే ఉండిపోయారు. శ్రీదేవి సవతి కొడుకు అర్జున్‌కపూర్‌తో పాటు రేఖ, రాణీముఖర్జీ, కరణ్ జోహార్, మనీష్ మల్హోత్రా, శిల్పాశెట్టి, నిఖిల్ ద్వివేది, అనుపమ్ ఖేర్, ఇషాన్ ఖట్టర్, ఫరాఖాన్, ఫర్హాన్ అఖ్తర్, టబు, సరోజ్ ఖాన్, రితేష్ సిద్వానీ, హనీ ఇరానీ లాంటి బాలీవుడ్ జనాలంతా అనిల్‌కపూర్ ఇంటికి వెళ్లి పిల్లలను పలకరించారు.

నేడు అంత్యక్రియలు

శ్రీదేవి మృతదేహం అనుకున్న దానికంటే ఆలస్యంగా రావడంతో.. అంత్యక్రియలు మంగళవారం జరగనున్నాయి. ఫోరెన్సిక్ నివేదిక అందడం ఆలస్యం అవ్వడం వల్లే మృతదేహాన్ని అప్పగించలేదని తెలిసింది. ఎట్టకేలకు అది అందిన తర్వాత మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత రసాయనాలతో ఎంబామింగ్ చేయడానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పట్టింది. ఆ తర్వాతే అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో మృతదేహాన్ని తీసుకొస్తామన్నారు.

సెలవు ఇవ్వలేదని 13 రౌండ్ల కాల్పులు

- **ఉన్నతాధికారిని కాల్చిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్**

షిల్లాంగ్, ఫిబ్రవరి 26: సెలవు ఇవ్వలేదనే కోపంతో ఉన్నతాధికారిపై ఓ ఉద్యోగి కాల్పులు జరిపాడు. ఈ ఘటన మేఘాలయలోని కాశీ హిల్స్‌లో ఆదివారం ఉదయం జరిగింది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) కానిస్టేబుల్ అర్జున్ దేశ్వాల్ తనకు సెలవు కావాలని అసిస్టెంట్ కమాండెంట్ ముఖేశ్ త్యాగిని కోరాడు. దేశ్వాల్‌కు సెలవు ఇచ్చేందుకు త్యాగి నిరాకరించారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సహనం కోల్పోయిన దేశ్వాల్ తన సర్వీస్ రైఫిల్‌తో త్యాగిపై 13 రౌండ్ల కాల్పులు జరపాడు. దీంతో అసిస్టెంట్ కమాండెంట్ అక్కడికక్కడే మరణించాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కానిస్టేబుల్ జోగిందర్ కుమార్, ఎస్సై ఓం ప్రకాశ్ యాదవ్, ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ మీనా ఉన్నారు. కానిస్టేబుల్ అర్జున్ దేశ్వాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని.. అతడి సర్వీస్ రైఫిల్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



లోక్‌పాల్ ఏదీ?

- **ధనవంతులకే మోదీ అనుకూలం**
- **పీఎన్‌బీపై 'కాపలాదారు' మౌనం**
- **మాటలతో దేశం అభివృద్ధి చెందదు**
- **కర్ణాటక బహిరంగ సభల్లో రాహుల్**



రామదుర్గ, ఫిబ్రవరి 26: ప్రధాని నరేంద్ర మోదీ ధనవంతులకే అనుకూలంగా ఉన్నారని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. అవినీతిని నిర్మూలించడానికి లోక్‌పాల్‌ను ఇంకా ఎందుకు నియమించలేదని మోదీని ప్రశ్నించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో రాహుల్ పలు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. మోదీని లక్ష్యంగా చేసుకుని ప్రసంగించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం వంటి అంశాలపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ''గుజరాత్‌లో మోదీ లోకయుక్తాను అమలు చేయలేదు. ఆయన ప్రధాని అయి నాలుగేళ్లు అవుతున్నా ఢిల్లీలో కూడా లోక్‌పాల్‌ను నియమించలేదు. దేశానికి కాపలాదారుగా చెప్పుకునే మోదీ కుంభకోణాలపై మౌనంగా ఉంటున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా కొడుకు జే షా కంపెనీ టర్నోవర్ కొద్ది కాలంలోనే ఎన్నో రెట్లు పెరిగింది. దేశ కాపాలదారు (మోదీ) కర్ణాటకకు వచ్చి.. జైలుకు వెళ్లి వచ్చిన ఆ పార్టీ మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్పను పక్కన పెట్టుకుని అవినీతి గురించి మాట్లాడుతారు. బీజేపీ పాలనలో మరో నలుగురు మంత్రులు జైలుకు వెళ్లారు'' అని రాహుల్ విమర్శించారు. కర్ణాటకకు చెందిన సాంఘిక సంస్కర్త బసవేశ్వర ఉపదేశించినట్టుగా 'నీవు ఏది బోధిస్తావో దాన్ని ఆచరించు' అన్నది మోదీ పాటించాలని హితవు పలికారు. మోదీ ఉపన్యాసాలు ఇచ్చినంత మాత్రాన దేశం అభివృద్ధి చెందదని అన్నారు. దేశ పేద ప్రజలకు చెందిన కోట్లాది రూపాయలు తీసుకుని నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారని పేర్కొన్నారు. పేదలు, రైతులు, కార్మికులు బ్యాంకుల్లో దాచిన 22 వేల కోట్ల రూపాయలను తీసుకుని నీరవ్ పారిపోయారని, దేశ కాపాలదారు ఈ విషయం గురించి ఒక్క మాట కూడా మాట్లాడరని రాహుల్ ఎద్దేవా చేశారు. జీఎస్టీని రాహుల్ 'గబ్బర్ సింగ్ ట్యాక్స్'గా అభివర్ణిస్తూ.. సామాన్యుడి జేబులోని డబ్బును లాక్కొంటున్నారని, లక్షలాది వ్యాపారాలు మూతపడ్డాయని, లక్షలాదిమంది నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఓ వ్యక్తి మాత్రం అద్భుతమైన కొత్త వ్యాపారం చేస్తున్నారని, అమిత్ షా కొడుకు జే షా మూడు నెలల్లోనే 50 వేలను 80 కోట్ల రూపాయలుగా మార్చారని వ్యాఖ్యానించారు. మోదీ దీని గురించి ఒక్క మాట కూడా మాట్లాడరని విమర్శించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను చూసి మోదీ నేర్చుకోవాలని సూచించారు. బీజేపీకి మనీ పవర్, మార్కెటింగ్, టీవీ, మీడియా దన్నుగా నిలుస్తాయని, అయినా పేదలు, బలహీన వర్గాల మద్దతుతో కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని రాహుల్ ధీమా వ్యక్తం చేశారు. పేదలు, బలహీన వర్గాల కోసం సిద్ధరామయ్య ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

అమరీందర్ సింగ్ అల్లుడిపై కేసు

- **శింభౌలి షుగర్స్ ఎండీగా గుర్పాల్‌సింగ్**
- **బ్యాంకుకు రూ.109 కోట్ల రుణం ఎగవేత**
- **ఆ అప్పు తీర్చేందుకు మరో 110 కోట్ల రుణం**
- **2015లోనే సీబీఐకి ఫిర్యాదు.. 2017లో మరోసారి**
- **రెండు ఫిర్యాదుల మేరకు తాజాగా ఎఫ్ఐఆర్**






న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ)ను మోసం చేసిన కేసులో సంచలన వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఓబీసీకి రూ.109 కోట్ల మేర రుణం ఎగవేతకు సంబంధించి పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్‌సింగ్ అల్లుడు గుర్పాల్‌సింగ్(అమరీందర్ కుమార్తె జై ఇందర్‌సింగ్ భర్త)పై సీబీఐ కేసు నమోదు చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని శింభౌలీ సుగర్స్ లిమిటెడ్‌కు గుర్పాల్‌సింగ్ డిప్యూటీ జనరల్ మేనేజర్, డిప్యూటీ డైరెక్టర్‌గా చేస్తున్నారు. అయితే 2015, సెప్టెంబరు 3న గుర్పాల్‌సింగ్‌తోపాటు శింభౌలీ సీఎండీ, సీఈవో, సీఎఫ్‌వో సహా 13 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. అయితే.. ఈ ఎగవేతకు సంబంధించి పలు మార్పులు చేస్తూ 2017, నవంబరు 17న ఓబీసీ బ్యాంకు మరో కేసు పెట్టిందని సీబీఐ అధికారులు వెల్లడించారు. సీబీఐ ఎఫ్ఐఆర్ ప్రకారం.. 2011లో ఈ కంపెనీకి ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ 97.85 కోట్ల రూపాయల నగదును బ్యాంకు ప్రకటించగా, అసలు రుణం రూ.109.08 కోట్లకు చేరింది. మరోవైపు ఈ రుణాన్ని తీర్చేందుకు 2015, జనవరి 28న రూ.110కోట్ల మరో కార్పొరేట్ రుణాన్ని మంజూరు చేసిన బ్యాంకు మొత్తం రుణాన్ని రూ.113 కోట్లుగా తేల్చింది. అయితే 2016 నవంబరులో ఎన్‌పీఏగా ప్రకటించింది. కాగా 2017 నవంబరు 17న బ్యాంకు సీబీఐకి ఫిర్యాదు చేయగా.. ఈ ఏడాది 2018, ఫిబ్రవరి 22న నమోదు చేసింది. కాగా, ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఢిల్లీ, హపూర్, నోయిడాలలో కంపెనీల డైరెక్టర్ల నివాసాలు, ఫ్యాక్టరీ, కార్పొరేట్ ఆఫీస్, రిజిస్ట్రేషన్ ఆఫీసు సహా ఎనిమిది ప్రాంగణాలలో సోదాలు నిర్వహించామని సీబీఐ అధికార ప్రతినిధి అభిషేక్ దయాల్ వెల్లడించారు. నిందితులపై నేరపూరిత కుట్ర, మోసం అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు.

ద్వారకా దాస్ ఉద్దేశపూర్వక ఎగవేతదారు: ఓబీసీ

తమకు రూ.389.85 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన వజ్రాల వ్యాపార సంస్థ ద్వరకాదాస్ ఇంటర్నేషనల్ సంస్థ ఉద్దేశపూర్వకంగా దివాళా సంస్థగా ప్రకటించుకుందని ఓబీసీ ఆరోపించింది. ఈ మేరకు 2014, జూన్‌లోనే సీబీఐకి, ఆర్‌బీఐకి సదరు సంస్థ వెల్లడించిందని తెలినపింది. ఓబీసీకి రూ.389.85 కోట్ల మేరకు ఆ వ్యాపారి చెల్లించలేదని తెలుస్తోంది. ఈ కేసులో ద్వారకా దాస్ సేత్ ఇంటర్నేషనల్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థపై సీబీఐ కేసు నమోదు చేసింది. దాదాపు ఆరు నెలల క్రితం కేసును నమోదు చేశారు. ఈ కేసులో ఆ వజ్రాల వ్యాపార సంస్థకు చెందిన డైరక్టర్లను సీబీఐ విచారిస్తున్నది. ద్వారకా దాస్ సంస్థ 2007 నుంచి 2012 వరకు ఓబీసీ బ్యాంక్ నుంచి 389 కోట్లు రుణం తీసుకున్నది.

జాబిల్లిపై ఇగ్లూలు



- **వ్యోమగాములకోసం నిర్మాణం**
- **ఏర్పాటు ప్రయత్నాల్లో ఇస్రో**
- **ప్రణాళిక సిద్ధంగా లేకున్నా..**
  ఐదు నమూనా ఇగ్లూలు రెడీ
- **ముమ్మందు ఐఎస్ఎస్ నిరుపయోగం**
- **ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ప్రపంచం**
- **ఇస్రో ముంగిట ఇగ్లూ ప్రతిపాదన**
- **శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ అన్నాదురై వెల్లడి**



బెంగళూరు, ఫిబ్రవరి 26: విశ్వాంతరాల్లోకి ప్రయాణించే క్రమంలో జాబిల్లిని మజిలీగా ఉపయోగించుకునేందుకు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో) సమాలోచనలు ప్రారంభించింది. ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లా కృత్రిమ మజిలీ కాకుండా ఏకంగా చంద్రుడిపైనే ఆవాసాలు నిర్మించాలని భావిస్తోంది. మంచు ఖండంలో నిర్మించే ఇగ్లూల వంటి నిర్మాణాలను చంద్రుడిపై నిర్మించాలని శాస్త్రవేత్తలు యోచిస్తున్నారు. ఇప్పటికి ఇంకా ప్రణాళికలు సిద్ధం కాలేదు. అంతా అనుకున్నట్లుగా జరిగితే రాబోయే కాలంలో భారతదేశం చేపట్టబోయే అతిపెద్ద సైన్స్ ప్రోగ్రామ్ ఇదే అవుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడు తున్నారు. రోబోలతో త్రీడీ పద్ధతిలో 'ప్రింట్' చేసే ఈ నిర్మాణాలను లూనార్ హ్యాబిటేట్స్‌గా వ్యవహరించనున్నారు. చంద్రుడి ఉపరితలంపై ఉన్న మట్టిని, ఇతర పదార్థాలను కలిపి రోబోలు ఈ ఇగ్లూలను నిర్మిస్తాయని ఇస్రో వర్గాలు చెబుతున్నాయి. ఈ ఇగ్లూల నిర్మించేందుకు ఐదు రకాల మోడళ్లను సిద్ధం చేశామని, పూర్తి స్థాయిలో సహకరించే సాంకేతికత కోసం ఎదురుచూస్తున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

అంటార్కిటికా తరహాలో..

మంచు ఖండం అంటార్కిటికాలో పరిశోధనలకోసం ఇగ్లూలు నిర్మించి నివాసాలుగా ఉపయోగించుకుంటున్న విషయం తెలిసిందే! ఇదే తరహాలో పరిశోధనలకు, ఇతర అవసరాలకు చంద్రుడిపై నిర్మాణాలు చేపట్టాలని భావిస్తున్నామని ఇస్రో శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ ఎం.అన్నాదురై పేర్కొన్నారు. అంతరిక్షంలో పరిశోధనల కోసం ప్రస్తుతం ఐఎస్ఎస్ ఉంది.. అయితే, భవిష్యత్తులో అది నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా సహా పలు దేశాలు చంద్రుడిపై శాశ్వత నివాసాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుపుతున్నాయి. ఐఎస్ఎస్‌కు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణలో జాబిల్లిపై ఇగ్లూలు నిర్మించాలనే తాము యోచన చేస్తున్నట్లు అన్నాదురై పేర్కొన్నారు.

వ్యోమగాములకు తాత్కాలిక ఆశ్రయం

భవిష్యత్తులో చంద్రుడిపైకి వెళ్లే వ్యోమగాములు కొన్ని గంటల పాటు గడిపి తిరిగి రావాల్సిన అవసరం తప్పుతుంది.. అక్కడ ఉండే సమయాన్ని ఈ ఇగ్లూల సాయంతో మరింత పెంచనున్నట్లు అన్నాదురై వివరించారు. చంద్రుడిపై వ్యోమగాముల భద్రతతో పాటు అక్కడ వారి పరిశోధనలోనూ సాయం చేసేందుకు ఇస్రో బాధ్యత వహిస్తుందని తెలిపారు. అయితే, ఈ ఇగ్లూల నిర్మాణంలో స్మార్ట్ మెటీరియల్స్ వాడాల్సి ఉంటుందని చెప్పారు. ఈ విషయంలో ఇస్రోకు ఎలాంటి చింతలేదని వివరిస్తూ.. చంద్రుడి ఉపరితలంపై మట్టిని పోలిన పదార్థాన్ని తయారుచేయడంలో ఇస్రో నైపుణ్యం సాధించిందని అన్నాదురై పేర్కొన్నారు. పరిశోధన శాలలో తయారుచేసిన మట్టిని, చంద్రుడి ఉపరితలంపై సేకరించిన మట్టితో పోలిస్తే దాదాపుగా 99.6 శాతం కలిసి పోయిందని చెప్పారు. గతంలో నిర్వహించిన అపోలో మిషన్ ప్రాజెక్టులలో చంద్రుడి ఉపరితలం నుంచి మట్టిని సేకరించిన విషయం తెలిసిందే!

శ్రీదేవి... కొన్ని ముఖ్యమైన ఘట్టాలు



50 సంవత్సరాలు భారతీయ సినిమాకు సేవలందించి 54 సంవత్సరాల వయసులో అందర్నీ విషాదంలోకి నెట్టి మృత్యువుకి చేరువైన అతిలోక సుందరి శ్రీదేవి. 300 సినిమాల్లో తన నటనతో అందర్నీ ఆకట్టుకున్న శ్రీదేవి జీవితంలో మనకు తెలియని ఎన్నో ఘట్టాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి కొన్ని:


నటిగానే కాదు.. పెయింటర్‌గా కూడా



శ్రీదేవి ఓ గొప్పనటిగానే మనందరికీ తెలుసు. కానీ, మరో టాలెంట్ కూడా ఉందని కొందరికే తెలుసు. ఆమెకు పెయింటింగ్ అంటే చాలా ఇష్టం. అప్పుడప్పుడు పెయింటింగ్ వేస్తూ ఆనందాన్ని పొందేది. ఎప్పుడూ సినిమాలతో బిజీగా ఉండే ఆమె తన పెయింటింగ్ హాబీని ఎప్పుడూ బయట పెట్టలేదు. తనకు ఖాళీ దొరికినప్పుడల్లా పెయింటింగ్స్ వేస్తూ తన సన్నిహితులకు కానుకగా ఇచ్చేది. ఆమధ్య తన మరిది కూతురు సోనమ్ కపూర్‌కి ఒక మంచి పెయింటింగ్ వేసి ఇచ్చింది. ఆ పెయింటింగ్‌ని ఎంతో అపురూపంగా తన రూమ్‌లో భద్రపరుచుకుంది సోనమ్. అలాగే సల్మాన్‌ఖాన్, డిజైనర్ మనీష్ మల్హోత్రా వంటి సినీ ప్రముఖులకు కూడా తను స్వయంగా వేసిన పెయింటింగ్‌లను బహుమతిగా ఇచ్చింది. తను ప్రాణంగా చూసుకునే కూతుళ్ళు జాన్వీ, ఖుషిల పెయింటింగ్స్‌ను కూడా వేసింది శ్రీదేవి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మైఖేల్ జాక్సన్ అంటే శ్రీదేవికి వల్లమాలిన అభిమానం. తన అభిమాన సింగర్ బొమ్మను కూడా శ్రీదేవి వేసిందట. శ్రీదేవి ఇప్పటివరకు వేసిన పెయింటింగ్స్‌తో ఛారిటీ నిమిత్తం ఓ ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేయాలని శ్రీదేవి భావించిందని వార్తలు వెలువడ్డాయి.

తండ్రి మరణవార్త శ్రీదేవికి చెప్పలేకపోయిన యశ్ చోప్రా

శ్రీదేవి తండ్రి మరణానికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాన్ని 2009లో ఓ ఇంటర్వ్యూలో యశ్‌చోప్రా తెలియజేశారు. 'లమ్హే' చిత్రం షూటింగ్ లండన్‌లో జరుగుతోంది. సినిమాకి సంబంధించి 80 శాతం షూటింగ్ పూర్తయిపోయింది. కేవలం శ్రీదేవికి సంబంధించిన రెండు సీన్స్ మాత్రం చెయ్యాల్సి ఉంది. ఆ సమయంలోనే శ్రీదేవి తండ్రి అయ్యప్పన్ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం యశ్‌చోప్రాకే ముందుగా తెలిసింది. తండ్రి మరణవార్త విని శ్రీదేవి ఎలా రియాక్ట్ అవుతుందోనని భయపడిన చోప్రా ఆమెకు ఈ విషయం తెలియనివ్వలేదు. 'ఇప్పటివరకు షూటింగ్‌తో అలసిపోయావు. కాస్త విరామం తీసుకో. నాన్నగారి ఆరోగ్యం బాగాలేదు. ఓసారి వెళ్ళి చూసిరా' అని శ్రీదేవిని మద్రాస్



పంపించారు చోప్రా. వీలైనంత త్వరగా ఇండియా చేరుకోవాలన్న ఉద్దేశంతో ఎయిర్ ఇండియా ఫ్లైట్‌ను ఆమె కోసం పావుగంట సేపు వెయిట్ చెయ్యమని రిక్వెస్ట్ చేశారు. ఇంటికి వెళ్ళిన తర్వాత తండ్రి చనిపోయారని తెలిసి కుప్పకూలిపోయారు శ్రీదేవి. 16 రోజుల పాటు షూటింగ్‌కి హాజరు కాలేనని యశ్‌చోప్రాతో చెప్పారు శ్రీదేవి. 'ఫర్వాలేదు. ఎన్నిరోజులైనా నీ కోసం ఎదురుచూస్తాం' అని ధైర్యం చెప్పారు చోప్రా. ఆ 16 రోజులు తనతోపాటు చిత్ర యూనిట్ కూడా లండన్‌లోనే ఉండిపోయారు. 16 రోజుల తర్వాత షూటింగ్ వచ్చిన శ్రీదేవి కామెడీ సీన్స్ చెయ్యాల్సి వచ్చింది. 'తండ్రి పోయిన బాధను దిగమింగుకొని ఎంతో సహజంగా ఆ కామెడీ సీన్స్‌ని పండించింది. వృత్తి పట్ల ఆమెకు ఉన్న గౌరవం చూసి నేను ఆశ్చర్యపోయాను' అన్నారు యశ్‌చోప్రా.

మూడు నెలల తర్వాత ఓకే చెప్పింది



శ్రీదేవి అంటే ఆమె భర్త బోనీకపూర్‌కి ఎంతో ప్రేమ. ఒకరకంగా చెప్పాలంటే పిచ్చి ప్రేమ. తన భార్య గురించి బోనీకపూర్ చెబుతూ ''శ్రీదేవి అంటే నాకు పిచ్చి ప్రేమ. స్క్రీన్ మీద ఆమెను మొదటి సారి చూసినపుడే ప్రేమలో పడిపోయాను. వెంటనే ఆమెను కలవాలని పించింది. ముంబై నుంచి మద్రాస్ వెళ్ళాను. కానీ, కలవలేకపోయాను. ఆ తర్వాత 'సోల్వా సావన్' సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు అక్కడికి వెళ్ళాను. కానీ, నాతో సరిగ్గా మాట్లాడలేదు. కొత్తవారితో పెద్దగా మాట్లాడదని అప్పుడే తెలుసుకున్నాను. ఆ తర్వాత కొన్ని రోజుల వరకు ముక్తసరిగానే మాట్లాడింది. ఓసారి ఎయిర్‌పోర్ట్‌లో మేకప్ లేకుండా చూశాను. నిజానికి ఆమె మేకప్ లేకుండానే అందంగా ఉంటుంది. శ్రీదేవితో సినిమా చెయ్యాలని ఉండేది. అనిల్‌కపూర్‌తో 'మిస్టర్ ఇండియా' సినిమా ప్లానింగ్ జరుగుతోంది. ఆ సినిమాలో ఆమె అడిగిన దానికంటే ఎక్కువ పారితోషికం ఇచ్చి శ్రీదేవిని ఓకే చేశాం. ఆ సినిమా టైమ్‌లోనే మేం ఎక్కువగా మాట్లాడుకునేవాళ్ళం. అప్పుడే ఆమెపై నాకు ఉన్న ప్రేమను తెలిపాను. మూడు నెలల పాటు ఏమీ చెప్పలేదు తను. తర్వాత ఓకే చెప్పింది. ఆమె మీద నాకు ఉన్న ప్రేమను శ్రీ తల్లి అర్థం చేసుకున్నారు. అందుకే కూతుర్ని నాకిచ్చి పెళ్లి చేయడానికి ఒప్పుకున్నారు. 1996లో మేం పెళ్లి చేసుకున్నాం'' అంటూ శ్రీదేవితో తన ప్రేమ ప్రయాణాన్ని ఆమధ్య ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

శ్రీదేవితో కలిసి నటించడం నా అదృష్టం - హృతిక్ రోషన్




శ్రీదేవి హఠాన్మరణాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. శ్రీదేవి ఇంకా మనమధ్యే ఉందన్న భావన అందరిలోనూ, ముఖ్యంగా ఆమె సన్నిహితులలోనూ ఉంది. ఆమెతో తమకు ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో బాలీవుడ్ హీరో హృతిక్‌రోషన్ శ్రీదేవితో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ తాను బాలనటుడిగా తొలి చిత్రంలో శ్రీదేవితో కలిసి నటించినప్పటి ఓ ఫోటోను సోషల్ మీడియాలో అందరితోనూ పంచుకున్నారు. ''నా తొలి సినిమాలో శ్రీదేవితో కలిసి నటించడం నా అదృష్టం. ఆమె ముందు నటించడానికి నేను చాలా టెన్షన్ పడ్డాను. నాలో కాన్ఫిడెన్స్ పెంచడానికి ఆమె తన చేతులను వణికినట్టు చేయడం నాకింకా గుర్తుంది. నేను మామూలుగా అయ్యే వరకు నన్ను నవ్వించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ఇద్దరం నవ్వుతూ చాలా సరదాగా గడిపాం. శ్రీదేవి చాలా గొప్ప నటి. అలాంటి గొప్ప వ్యక్తి దూరం కావడం చాలా బాధగా ఉంది. దాన్ని మాటల్లో వ్యక్తపరచలేను'' అంటూ తన సంతాపాన్ని తెలిపారు హృతిక్ రోషన్.

శ్రీదేవి తల్లి రాజేశ్వరి కూడా వెండితెరపై మెరిశారు



శ్రీదేవి తల్లి రాజేశ్వరి, తండ్రి అయ్యప్పన్, సోదరి శ్రీలత.. ఇప్పటివరకు మనందరికీ ఈ విషయాలే తెలుసు. కానీ, మనకు తెలియని మరో విషయం ఏమిటంటే శ్రీదేవి తల్లి రాజేశ్వరి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని చిత్ర పరిశ్రమకు వచ్చారు. 1960లో విడుదలైన 'చివరకు మిగిలేది' సినిమాలో 'అందానికి అందం నేనే' అనే పాటలో నర్తకి జ్యోతితోపాటు రాజేశ్వరి నృత్యం చేస్తూ తొలిసారి నటించారు. ఆ తర్వాత అక్కినేని నాగేశ్వరరావు, రాజసులోచన నటించిన 'శాంతినివాసం' చిత్రంలో కృష్ణకుమారి సోదరి పాత్రకు ఎంపికయ్యారు రాజేశ్వరి. ఆ సినిమాలో 'కలనైనా నీ వలపే' అనే పాటలో కృష్ణకుమారితోపాటు రాజేశ్వరి కనిపించారు. ఆ తర్వాత 'భార్యభర్తలు' చిత్రంలో ఓ చిన్న పాత్రలో నటించారు. ఆ సినిమాలో 'జోరుగా హుషారుగా షికారు పోదమా' పాటలో అక్కినేని వెంటపడే అమ్మాయిగా రాజేశ్వరి కనిపించారు. అక్కినేని నాగేశ్వరరావుతో కలిసి నటించిన శ్రీదేవి, ఆ తర్వాత అక్కినేని నాగార్జునతో కూడా కొన్ని సినిమాలు చేశారు. అక్కినేని నాగేశ్వరరావు శ్రీదేవితోపాటు ఆమె తల్లితో కూడా నటించడం విశేషంగా చెప్పుకోవచ్చు.



రవితేజ సీటీమార్?

కమర్షియల్ సినిమాల దర్శకుడు హరీశ్ శంకర్ దర్శకత్వంలో 'సీటీమార్' అనే సినిమా రూపొందనుందనే సంగతి అధికారికంగా వెలువడిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాలో హీరో ఎవరనే సంగతి మాత్రం తెలియలేదు. అయితే ఇప్పుడు ఇండస్ట్రీలో వినపడుతున్న సమాచారం ప్రకారం రవితేజ 'సీటీమార్'లో హీరోగా నటిస్తారట. ప్రస్తుతం కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా రూపొందుతోన్న సినిమా చిత్రీకరణ దశలో ఉంది. ఈ సినిమా ముగియగానే రవితేజ శ్రీనువైట్ల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తారు. ఈ రెండు సినిమాల తర్వాతే రవితేజ, హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో సినిమా ఉంటుంది. ఇంతకు ముందు వీరిద్దరి కాంబినేషన్‌లో 'షాక్', 'మిరపకాయ్' సినిమాలు తెరకెక్కిన సంగతి తెలిసిందే.

వెంకీతో అఖిల్!



ఇటీవల విడుదలైన వరుణ్‌తేజ్ 'తొలిప్రేమ'తో దర్శకుడిగా సక్సెస్ అందుకున్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. మరి వెంకీ తదుపరి సినిమాను ఎవరితో చేస్తాడనే దానిపై పలు వార్తలు వినపడుతున్నాయి. అయితే వెంకీ అట్లూరి తన నెక్స్ట్ చిత్రాన్ని బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాణంలో చేస్తానని ఇది వరకే తెలియజేశారు కానీ హీరో ఎవరనే దానిపై వివరణ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో..అక్కినేని అఖిల్‌తో వెంకీ అట్లూరి తదుపరి సినిమా చేయబోతున్నారని వార్తలు వినపడుతున్నాయి. త్వరలోనే అఖిల్ తాను చేయబోయే సినిమా గురించి అధికారికంగా ప్రకటన చేయనున్నారు. దీంతో సస్పెన్స్‌కు తెరపడనుంది.

మనం మూవీ
manammovie
మంగళవారం, 27 ఫిబ్రవరి 2018 | హైదరాబాద్ 8

స్నేహితుడి దర్శకత్వంలో...



● నాని

నటుడు, దర్శకుడు అవసరాల శ్రీనివాస్‌కి హీరో నానితో మధ్య మంచి స్నేహబంధం ఉన్న సంగతి తెలిసిందే. మరి మీ స్నేహితుడు అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో మీరు హీరోగా ఎప్పుడు నటిస్తారు? అని అడిగిన ప్రతిసారి మంచి కథ కుదిరితే తప్పకుండా చేస్తానని నాని సమాధానం ఇస్తూ వచ్చారు. ఇప్పుడు పరిస్థితులు చూస్తుంటే వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా మొదలుకానుంది. నాని హీరోగా అవసరాల ఓ కథను సిద్ధం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు స్టార్ట్ కానున్నాయట. నాని ఇప్పుడు నాగార్జునతో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమా చేయబోతున్నారు. ఇందులో తన పార్ట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో సినిమా చేయడానికి రెడీ అవుతారట. జూన్‌లో సినిమా మొదలవుతుందని వార్తలు వినిపిస్తున్నాయి.



'దండుపాళ్యం 3' ఆడియో

బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన తారాగణంగా శ్రీనివాసరాజు దర్శకత్వంలో రూపొందిన 'దండుపాళ్యం' తెలుగు, కన్నడ భాషల్లో మంచి విజయాన్ని సాధించింది. 'దండుపాళ్యం' సీక్వెల్స్‌లో భాగంగా 'దండుపాళ్యం 3' చిత్రం త్వరలోనే రాబోతున్న విషయం తెలిసిందే. సాయికృష్ణ ఫిలింస్, శ్రీ వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్స్‌పై శ్రీనివాస్ మీసాల, సాయికృష్ణ పెండ్యాల సంయుక్తంగా తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా పాటలను ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఆడియో సీడీలను సుచర్ ఇండియా అధినేత లయన్ కిరణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా.. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ ''తెలుగులో ఓ హిట్ సినిమాకు సీక్వెల్ ఎప్పుడూ సక్సెస్ కాలేదు. కానీ దండు పాళ్యం విషయంలో అది తప్పని రుజువైంది. ఇప్పుడు దండుపాళ్యం రెండు భాగాలు విడుదలై సక్సెస్ అయ్యాయి. ఇప్పుడు విడుదల కాబోయే మూడో పార్ట్ ..రెండు పార్టులను మించి హిట్ అవుతుంది'' అన్నారు. లయన్ కిరణ్ మాట్లాడుతూ ''దండుపాళ్యం అనే పేరే ఓ బ్రాండ్ క్రియేట్ చేసుకుంది. ముఖ్యంగా ఈసినిమాకు చెందిన మూడో పార్టు విడుదల కానుందంటే.. ఆ సినిమా గురించి నేను ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పక్కా మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. మొదటి రెండు భాగాలను మూడో పార్ట్ బీట్ చేస్తుందని నమ్మకం ఉంది'' అన్నారు. చిత్ర దర్శకుడు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ''ఈ సినిమా తర్వాత మరో రెండు, మూడేళ్ల వరకు ఈ జోనర్‌లో సినిమాలు చేయను. మూడు పార్టులకు కొంత మంది నటీనటులే తప్ప మిగతా అందరూ వారే నటించారు. అందరూ బాగా కష్టపడ్డారు. ఈ సినిమాకు సంబంధించి నేను మళ్లీ మరో పార్ట్ చేయను'' అన్నారు. పూజా గాంధీ మాట్లాడుతూ '''దండుపాళ్యం' ఆరేడేళ్ల జర్నీ. యూనిట్ అంతా చాలా కష్టపడ్డాం. ఇందులో నెగిటివ్ రోల్ చేశాను. మమ్మల్ని ప్రేక్షకులు ఎంకరేజ్ చేశారు కాబట్టే మూడో పార్ట్ వరకు చేయగలిగాం'' అన్నారు. మకరంద్ దేశ్ పాండే మాట్లాడుతూ ''ఈ మూడో పార్ట్‌తో దండుపాళ్యం యూనిట్ ప్రయాణం ముగిసింది. ఐదారేళ్లు అందరం కలిసి ప్రయాణించడం గొప్పగా అనిపించింది. మంచి నటీనటులతో కలిసి పనిచేశాను. దర్శకుడు శ్రీనివాసరాజు గురించి మాట్లాడాలంటే మాటలు లేవు. తన కష్టమెంతో తెలుస్తుంది'' అన్నారు.



నందికొండ వాగుల్లో

సాయి వెంకట్ సమర్పణలో బీచుపల్లి ఆంజనేయ ప్రొడక్షన్స్‌పై రూపొందుతోన్న చిత్రం 'నంది కొండ వాగుల్లోన'. షఫీ, లక్కీ ఎకారి సాయి కిరణ్, పూజశ్రీ, మేఘన మరియు జ్యోతిక యాదవ్ తారాగణం. సత్యనారాయణ దర్శకుడు. రఘు.హెచ్ నిర్మాత. ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఆడియో సీడీలనుఎర్రల్లా శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సత్యనారాయణ మాట్లాడుతూ ''మంచి ఎంటర్‌టైనింగ్ మూవీ.తప్పకుండా ప్రేక్షకులను మెప్పించేలా ఉంటుంది'' అన్నారు. నిర్మాత రఘు మాట్లాడుతూ ''కష్టపడి పని చేశాం. నవీన్, బాషా ఈ సినిమా చేయడానికి ప్రోత్సహించారు. సాయి వెంకట్, ఆర్ కె గౌడ్ గారు ఈ సినిమాను రిలీజ్ చేయడానికి ముందుకొచ్చారు'' అన్నారు. సమర్పకుడు సాయి వెంకట్ మాట్లాడుతూ ''సిరాజ్ తో ఉన్న స్నేహం కొద్దీ ఈ సినిమా విడుదలకు నా వంతు సహకారాన్ని అందిస్తాను. ఎంటర్‌టైనింగ్ మవీ. 200 థియేటర్సలలో ఈ చిత్రాన్ని విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. సిరాజ్ మాట్లాడుతూ '' ముందు సినిమాను మార్చ్ 2న విడుదల చేయాలనుకున్నాం కానీ బంద్ కారణంగా మంచి డేట్ చూసుకొని విడుదల చేస్తాం'' అన్నారు.

3 రోజులు.. 734 ఒప్పందాలు

పెట్టుబడుల విలువ 4,39,765 కోట్లు

- **11,02,125 మందికి ఉపాధి అవకాశం**
- **2019లో మార్కెట్‌లోకి కియా కారు**
- **సీఐఐ సదస్సుతో లబ్ధి: చంద్రబాబు**
- **ముఖ్యమంత్రి 4 దశాబ్దాల రాజకీయ జీవితం విజయవంతం: నరసింహన్**
- **విశాఖలో ముగిసిన సీఐఐ సదస్సు**

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (మనం న్యూస్ బ్యూరో): విశాఖపట్నంలో 3 రోజులు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో 734 అవగాహన ఒప్పందాలు కుదిరినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. వీటి ద్వారా మొత్తం 4,39,765 కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయని, 11,02,125 మందికి ఉపాధి అవకాశం లభించనుందని తెలిపారు. సోమవారం సీఐఐ సదస్సు-2018 ముగింపు కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ.. వచ్చే ఏడాది కియా తొలి కారు బయటికి రానున్నదని, భారత్ నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లోకి వెళ్లబోతోందని చెప్పారు. ప్రపంచంలో ఉన్న అత్యుత్తమ విధానాలను పరస్పరం తెలుసుకోవడానికి, వాణిజ్య బంధాలను బలోపేతం చేసుకోవడానికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడిందని చంద్రబాబు పేర్కొన్నారు. 60 దేశాల నుంచి 280 మంది ప్రతినిధులు, 3673 మంది భారతీయ పారిశ్రామికవేత్తలు, 500 మంది బిజినెస్ స్కూల్ విద్యార్థులు కలిపి మొత్తం 4453 మంది ఈ సదస్సులో పాల్గొన్నారని చెప్పారు. అందరూ ఆశించినట్టే రాజధాని అమరావతి నిర్మాణానికి సింగపూర్ అత్యుత్తమ మాస్టర్ ప్లాన్ అందించిందని తెలిపారు. సింగపూర్ కన్సార్టియం అమరావతి అభివృద్ధిలో పాలు పంచుకుంటోందని పేర్కొన్నారు. రానున్న కాలంలో అమరావతి ప్రపంచంలోని 5 అత్యుత్తమ నగరాలలో ఒకటిగా రూపుదాలుస్తుందన్నారు. ఇక్కడికి వచ్చిన పారిశ్రామిక, వ్యాపారవేత్తలందరూ అమరావతి అభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. వచ్చే ఏడాది ఇక్కడ బ్రహ్మాండమైన కన్వెన్షన్ సెంటర్ సిద్ధం అవుతుందని చెప్పారు. భాగస్వామ్య సదస్సులో 55 ద్వైపాక్షిక సమావేశాలు జరిపామని, గూగుల్, అదాని, రిలయెన్స్ వంటి సంస్థలతో ఎంవోయూలు చేసుకున్నామని చంద్రబాబు వెల్లడించారు.

బాబుకు శ్రమకు ఫలితం దక్కాలి: గవర్నర్

చంద్రబాబు నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితాన్ని విజయవంతంగా పూర్తి చేశారని గవర్నర్ నరసింహన్ అన్నారు. ఆయన ఇన్నేళ్ల శ్రమకు రాబోయే కాలంలో ఫలితం ఇవ్వాలని కోరుతున్నానని పేర్కొన్నారు. దారిద్ర్యరేఖ అనేది లేకుండా పోయేలా ఏపీ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడులు రావాలని అన్నారు. ఈజ్ ఆఫ్ ద డూయింగ్ బిజినెస్ అంటే త్వరితగతిన అనుమతులు ఇవ్వటం కాదని, ప్రేమతో ఇవ్వటమని పేర్కొన్నారు. పెట్టుబడికి రక్షణ, పర్యావణానికి విఘాతం లేకుండా చూడటం, వనరులన్నీ అందించటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని నరసింహన్ సూచించారు. కృత్రిమ మేధస్సు కంటే మన దేశ యువత మేధస్సు శక్తిమంతమైనదని పేర్కొన్నారు. టెక్నాలజీ అనేది ఒక అదనపు వనరుగానే ఉండాలని గవర్నర్ నరసింహన్ అన్నారు. చంద్రబాబు రియల్ టైం గవర్నెన్స్‌తో వ్యక్తి గత స్వేచ్ఛను హరిస్తున్నారని ఛలోక్తి విసిరారు. మంత్రి లోకేశ్ నవ్వుతున్నాడా లేదా అని చంద్రబాబు యాప్‌లో చూసేస్తుంటారని గవర్నర్ అన్నారు.



సీఐఐ సదస్సులో పాల్గొన్న చంద్రబాబు, గవర్నర్ నరసింహన్

ఒప్పందాలు-పెట్టుబడులు

- 3 రోజుల్లో మొత్తం ఒప్పందాలు 734
- పెట్టుబడుల విలువ 4,39,765 కోట్లు
- 11,02,125 మందికి ఉపాధి అవకాశం
- పరిశ్రమల శాఖలో 129 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ. 58,337 కోట్లు
  1,31,682 మందికి ఉద్యోగాలు
- గనుల శాఖలో 31 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ. 12,227 కోట్లు
  16,225 మందికి ఉపాధి అవకాశం
- ఐటీ, ఈ అండ్ సీ శాఖలో 75 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ. 30,050 కోట్లు
- ఈడీబీలో 144 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ.1,51,400 కోట్లు
  1,52,496 మందికి ఉపాధి అవకాశం
- ఆహార శుద్ధి రంగంలో 165 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ.3,100 కోట్లు
  47 వేల మందికి ఉద్యోగాలు
- నెడ్ క్యాప్‌లో 38 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ.78,935 కోట్లు
  24,411 మందికి ఉద్యోగావకాశాలు
- సీఆర్‌డీఏలో 37 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ. 4964 కోట్లు
  78,680 మందికి ఉద్యోగాలు
- పర్యాటక రంగంలో 49 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ. 5.002 కోట్లు
  30,338 మందికి ఉద్యోగాలు
- ఏపీఎస్‌డీసీలో 19 ఒప్పందాలు
  లక్ష మందికి శిక్షణ
- ఏపీ టిడ్కోలో 18 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ. 40.013 కోట్లు
  3,80,750 మందికి ఉపాధి
- వైద్యారోగ్య శాఖలో 25 ఒప్పందాలు
  పెట్టుబడులు రూ. 5090 కోట్లు
  4750 మందికి ఉపాధి అవకాశాలు



సీఐఐ సదస్సులో పాల్గొన్న చంద్రబాబు, లోకేశ్

ప్రపంచం చూపు ఏపీ వైపు

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు.. మన కష్టానికి తగిన గుర్తింపు
సత్ఫలితాలిస్తున్న 'జల సంరక్షణ'.. పెరిగిన భూగర్భ జలాల మట్టం
నీరు-ప్రగతిపై టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందని, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు. మన కష్టంతో రాష్ట్రాన్ని నిర్మించుకుంటున్నామని, ఆ కష్టానికి తగిన గుర్తింపు దక్కుతోందని ఆయన అన్నారు. సోమవారం నీరు-ప్రగతి, వ్యవసాయంపై సీఎం చంద్రబాబు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విశాఖలో వరుసగా మూడో ఏడాది సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతమైందని, ఆయా సదస్సుల్లో 13జిల్లాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగానే ఒప్పందాలు జరిగాయని చెప్పారు. కాగా, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జల సంరక్షణ ఉద్యమం సత్ఫలితాలిస్తోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో భూగర్భ జలాల మట్టం 1.6 మీటర్ల మేర పెరిగాయని, రాయలసీమలో 1.4 మీటర్లు పెరిగాయని సీఎం తెలిపారు. రెండో దశ జల సంరక్షణ ఉద్యమం మరింత ఉత్సాహంగా నిర్వహించాలని, కాలువల్లో నీటి ప్రవాహానికి ఉన్న అవరోధాలు తొలగించాలని ఆదేశించారు.

కరువు మండలాల్లో అదనపు పనిదినాలు

ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేయాలని, 24 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. రోజుకు 15 లక్షల పని దినాల లక్ష్యం నిర్దేశించగా.. 11 లక్షలకు చేరుకున్నారని, ఇది మరింత మెరుగుపడాలని ఆదేశించారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.745కోట్లు విడుదల చేశామని, గతంలో ఉన్న నిధులు రూ.300కోట్లు కూడా పూర్తిగా ఖర్చు చేయాలని చెప్పారు. కరవు మండలాల్లో అదనంగా మరో 50 పనిదినాలు కల్పించాలని, రోజు కూలి రూ.187 చెల్లించాలని ఆదేశించారు. రబీలో వర్షపాతం లోటు ఎక్కువగా ఉన్నప్పటికీ సాగు విస్తీర్ణం 95 శాతం వరకు ఉందని, దిగుబడులు తగ్గకుండా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెయిన్ గన్లను సద్వినియోగం చేసుకోవాలని, సమర్థ నీటి నిర్వహణ ద్వారా సాగునీటి కొరతను అధిగమించాలని అన్నారు. వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పింఛన్ల పంపిణీకి నగదు కొరత లేకుండా చూడాలని, గతంలో రూ.500కోట్లు నగదు విడుదల చేయాలని ఆర్బీఐకి లేఖ రాశామంటూ మరో రూ.500 కోట్ల నగదును విడుదల చేయాలని కోరుతామన్నారు. కాగా, ఇంటర్ మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవా లని, పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారులకు రెవెన్యూ, పోలీసు తదితర శాఖలు పూర్తి సహకారాన్ని అందించాలని సూచించారు.

భాగస్వామ్య సదస్సులో మందు పార్టీ

- **ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు**
- **ప్రభుత్వ పార్క్‌లో ఏర్పాటుపై విమర్శలు**

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (మనం న్యూస్ బ్యూరో): విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా మందు పార్టీని ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. శనివారం రాత్రి నగరంలోని ఉడా పార్క్‌లో అతిథుల కోసమంటూ ఏర్పాటు చేసిన మందు పార్టీలో స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విదేశీ అతిథులను ఆకట్టుకొనేందుకు బాలీవుడ్ నుంచి డాన్సర్లు, సింగర్లను రప్పించి కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు విదేశీ మద్యాన్ని పంపిణీ చేశారు. గతంలో విశాఖలో కోట్ల రూపాయలతో పర్యాటక శాఖ తరపున పసలేని కార్యక్రమాలను నిర్వహించి విమర్శల పాలైన ఈ-ఫ్యాక్టర్ అనే ఈవెంట్ మేనేజిమెంట్ సంస్థకే ఈ కార్యక్రమాన్ని అప్పగించారు. మందుపార్టీలో సేవించిన మద్యం బాటిళ్లు ఆ ప్రాంగణమంతా చెల్లా చెదురుగా పడి ఉండడాన్ని ఉదయం పార్క్‌లో వాకింగ్‌కు వెళ్లిన వారు చూసి ముక్కున వేలేసుకొన్నారు. ప్రభుత్వ పార్క్‌లో మద్యాన్ని అనుమతించడమేమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సందర్శకులు, మహిళలు ఎక్కువగా వచ్చే పార్క్‌లో మందు పార్టీ ఏర్పాటు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. గతంలో కైలాసగిరి కొండపై ఈ తరహా పార్టీలు ఏర్పాటు చేసి మాంసాహారం సరఫరా చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో పార్టీని ఉడా పార్క్‌లోని ఎంజీఎం మైదానంలోకి మార్చారు. బహిరంగ ప్రాంగణాల్లో ప్రభుత్వమే మందు పార్టీలు నిర్వహించడం దారుణమని ఫోరం ఫర్ బెటర్ విశాఖ కన్వీనర్ డాక్టర్ ఈఏఎస్ శర్మ అన్నారు. పెట్టుబుడుల సదస్సుకు విరుగుడుగా నిరుద్యోగుల సదస్సును నిర్వహిస్తున్న వామపక్షనేతలు ఈ మందు విందులపై మండిపడ్డారు. కేవలం అట్టహాసాల కోసమే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, నిజమైన అభివృద్ధి కోసం ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదని విమర్శలు గుప్పించారు.

సదస్సు.. సిబ్బందికి ప్రాణసంకటం

గుండెపోటుతో కుప్పకూలిన హోంగార్డు
ఫిట్స్‌తో హెడ్ కానిస్టేబుల్ ఆస్పత్రిపాలు
అస్వస్థతకు గురైన మహిళా హోంగార్డులు
కనీస సౌకర్యాలు లేకపోవడంపై విమర్శలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (మనం న్యూస్ బ్యూరో): ప్రభుత్వం కోట్ల ఖర్చుతో అట్టహాసంగా నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య పెట్టుపడుల సదస్సు ఉద్యోగులు, సిబ్బంది ప్రాణాల మీదకు తీసుకువచ్చింది. సదస్సులో పని ఒత్తిడి భరించలేక, కనీస విశ్రాంతి, సకాలంలో ఆహారం లభించక పోలీసు సిబ్బంది, ప్రభుత్వ సిబ్బంది ప్రాణాలు వదిలే పరిస్థితి వచ్చింది. ఆదివారం సదస్సు ప్రాంగణంలో విధులు నిర్వహస్తున్న చేపల రాజు (39) అనే హోంగార్డు గుండెపోటుతో మరణించారు. హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించినా ఫలితం లేకపోయింది. నగరంలోని చిలకపేటకు చెందిన రాజుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ సన్యాసిరావు (పి.సి 531) ఒత్తిడి తట్టుకోలేక సదస్సు ప్రాంగణంలోనే నోటి వెంట రక్తం కక్కుకొని ఫిట్స్‌తో పడిపోయారు. ఆయనను కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. సోమవారం సదస్సు వద్ద విధులు నిర్వహించిన విజయనగరం జిల్లాకు చెందిన మహిళా హోం గార్డు లక్ష్మితో పాటు మరో హోంగార్డు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. విధుల్లో ఉన్న ఓ డిప్యూటీ తహశీల్దార్ మరో ముగ్గురు సిబ్బంది హై బీపీతో ఆస్పత్రి పాలయ్యారు. పలువురు పోలీసు, భద్రతా సిబ్బందికి సకాలంలో ఆహారం అందక ఇబ్బందులు పడ్డారు. సదస్సు ప్రాంగణంలోనే ఈ సంఘటలను జరిగినా అక్కడే ఉన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించకపోవడం, కనీసం పరామర్శించకపోవడం పట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. మృతి చెందిన హోంగార్డు రాజు కుటుంబానికి పది లక్షల రూపాయల పరిహారం అందజేయాలని హోంగార్డుల సంఘం రాష్ట్ర నేత ఎన్. రామకృష్ణ యాదవ్ డిమాండు చేశారు.

గతంలోనూ ఇదే పరిస్థితి..

విశాఖలో గతంలో పార్లమెంటరీ స్పీకర్ల సమావేశాలు జరిగినప్పుడు నోవాటెల్ హోటల్ వద్ద స్టీల్ ప్లాంట్ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గుండెపోటుతో అక్కడికక్కడే మరణించారు. పని ఒత్తిడి కారణంగానే ఆయన మృతి చెందారని చెప్పిన రెవిన్యూ సంఘాల నేతలు ఆ తరువాత దీనిపై స్పందించిన దాఖలాలు లేవు. సదస్సు నిర్వహణకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. అక్కడ పనిచేసే సిబ్బంది సంక్షేమం గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అతిథులను మందు, విందులతో ముంచెత్తుతున్న ప్రభుత్వం కనీస విశ్రాంతి లేకుండా విధులు నిర్వహించే సిబ్బందికి సకాలంలో భోజనం, మంచినీరు కూడా అందించలేకపోవడం దారుణమని విమర్శలు వస్తున్నాయి.

జపాన్ కంటే భేష్

- రియల్‌టైమ్ గవర్నెన్స్ అద్భుతం
- ఆంధ్రప్రదేశ్ అందరికీ ఆదర్శం
- జపాన్ మంత్రి కిరాకి ప్రశంసలు


అమరావతి, ఫిబ్రవరి 26 (మనం ప్రతినిధి): రియల్ టైమ్ గవర్నెన్స్‌లో కొన్ని అంశాలు జపాన్‌ను మించి నిర్వహిస్తున్నారని ఆ దేశ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖ ఉప మంత్రి సాయిసకు కిరాకి ప్రశంసించారు. సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవ ర్నెన్స్‌ను ఆయన నేతృత్వంలోని జపాన్ ప్రతినిధుల బృందం సంద ర్శించింది. వారికి రియల్ టైమ్ గవర్నెన్స్ డైరెక్టర్ బాలాజీ ఆదివిష్ణు స్వాగతం పలికారు. రియల్ టైమ్ గవర్నెన్స్ పనితీరు గురించి వారికి వివరించారు. ఏపీ ప్రభుత్వం వినూత్నంగా ఆరంభించిన రియల్ టైమ్ గవర్నెన్స్ ఇప్పటికే ప్రజాదరణ పొందుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు మెరుగైన, పారదర్శక పాలన అందించాలనే ఆశయంతో వినూత్నంగా ఈ వ్యవస్థకు రూపకల్పన చేశారని తెలిపారు. సమర్థ పాలన అందించ డానికి టెక్నాలజీని ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. 1100 కాల్ సెంటర్ ద్వారా ప్రజల నుంచి రోజూ కొన్ని వేల ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 1.40 కోట్ల ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. పాలనలో పెద్ద ఎత్తున టెక్నాల జీని విని యోగిస్తున్నామని, పది లక్షల ఐఓటీ డివైజ్‌లను వినియోగిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని గృహాలకు ఫైబర్ నెట్ ద్వారా డిజిటల్ అనుసంధానం చేస్తున్నామన్నారు. అనంతరం జపాన్ మంత్రి మాట్లాడుతూ.. రియల్ టైమ్ గవర్నెన్స్ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. కొన్ని అంశాలు చూస్తుంటే జపాన్ కంటే ఏపీలో చాలా మెరుగ్గా పనిచేస్తున్నారని, తనకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అభినంద నలు తెలుపుతున్నామన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌ను భూటాన్ ప్రతినిధుల బృందం ప్రశంసించింది. భూటాన్ ఐటీ శాఖ మంత్రి దీననాథ్ ధుంగ్యేల్ నేతృత్వంలో కూడిన బృందం రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని పరిశీలించింది.


శాంతి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

శంభో.. శివశంభో

- **శాస్త్రోక్తంగా శ్రీమల్లేశ్వరస్వామి ప్రతిష్ఠ**

విజయవాడ, ఫిబ్రవరి 26 (మనం న్యూస్ ప్రతినిధి): శంభో.. శివశంభో.. అంటూ భక్తిశ్రద్ధలతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీమల్లేశ్వరస్వామి ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. సోమవారం ఫాల్గుణ మాస శుద్ధ ఏకాదశిన శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సూచించిన శుభసమయాన ఈవో పద్మ నేతృత్వంలో కనుల పండుగలా ఈ కార్యక్రమం జరిగింది. ఆలయంలో స్వామి వార్ల ఉత్సవమూర్తులకు జరిగిన శాంతి కళ్యాణ వేడుకలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గౌరంగబాబు, సభ్యులు, వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



డిక్లరేషన్.. రియాక్షన్

'సీమ'పై పావులు కదుపుతున్న టీడీపీ
'రాజ్యసభ' వేదిక సద్వినియోగ వ్యూహం
నల్లారి... కోట్ల వర్గాలకు పార్టీ ఆహ్వానం
సూర్యప్రకాష్... కిరణ్‌లకు తగు మర్యాద
కర్ణాటకలో బీజేపీ ఓటు బ్యాంకుకూ గండి!


(అమరావతి- మనం)

బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ ఎత్తును చిత్తు చేసేందుకు టీడీపీ పైఎత్తుతో సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ మేరకు సీమపై ప్రత్యేక వ్యూహానికి పార్టీ అధినేత చంద్రబాబు పదును పెడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల భోగట్టా. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లోని ఆంధ్రులను ఆకట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. తదనుగుణంగా రాయచూర్, బళ్లారి, కోలార్‌వంటి జిల్లాల్లో స్థిరపడిన తెలుగువారిని.. ప్రత్యేకించి సీమవాసులను ప్రభావితం చేయడానికి 'డిక్లరేషన్' వ్యూహం పన్నింది. ఆంధ్రప్రదేశ్‌లో సంకీర్ణానికి సంకటం ఎదురైన నేపథ్యం కూడా ఇందుకు కారణమంటున్నారు. అయితే, కమలం వ్యూహానికి ప్రతివ్యూహంగా రాజ్యసభ ఎన్నికల వేదికను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ భావిస్తున్నట్లు తెలిసింది. బీజేపీ తరహాలోనే ఇదీ ద్విముఖ వ్యూహమని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఆ మేరకు కర్ణాటక ఎన్నికలలో బీజేపీకి ఓటు వేయొద్దని టీడీపీ సోషల్ మీడియా విభాగం ఇప్పటికే ఇంటర్నెట్‌లో ఉధృత ప్రచారం చేస్తోంది. దీనికితోడు తాజా రాజ్యసభ ఎన్నికలలో సీమ అభ్యర్థికి అవకాశమిచ్చి అక్కడి ఆంధ్రులను మరింత ప్రభావితం చేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. సీమ రాజకీయాల్లో ఆధిపత్యంగల రెడ్డి సామాజిక వర్గాన్ని దగ్గరకు తీసుకున్న చంద్రబాబు, రాజ్యసభ స్థానాల్లో ఒకదాన్ని వారికి ఇవ్వజూపుతున్నట్లు తెలిసింది. తద్వారా కర్ణాటకలోని రాయలసీమ వాసులను సంతృప్తిపరిచే వీలుంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతానికైతే కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డిని టీడీపీలో చేర్చుకునేందుకు పార్టీ దూతలు దౌత్యం నెరపుతున్నారు. మరోవైపు వైసీపీ కూడా 'కోట్ల'ను తమ కోటలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఆ మేరకు 2019 ఎన్నికలలో ఆయనను కర్నూలు నుంచి లోక్‌సభ బరిలో దించాలన్నది ఆ పార్టీ నాయకత్వ ఆలోచనగా కనిపిస్తోంది. ఇక సూర్యప్రకాష్‌రెడ్డి కుమారుడు రాఘవేంద్రరెడ్డికి, మంత్రి నారా లోకేశ్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య సమాలోచన కూడా సాగిందని తెలిసింది. అయితే, ఎటూ తేల్చని సూర్యప్రకాష్‌రెడ్డి కొద్ది రోజుల కిందట పీసీసీ నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో బలమైన నేత కావడం, సీమ రాజకీయాల్లో గట్టిపట్టున్న 'కోట్ల' వర్గానికి నేతృత్వం వహిస్తుండటం వల్ల ఆయనను అక్కున చేర్చుకోవడంపై అటు టీడీపీ, ఇటు వైసీపీ పోటీపడుతున్నాయి.

నల్లారివారికి స్వాగతం!


కడప, అనంతపూర్ జిల్లాల్లోని వైసీపీ అసంతృప్త నేతలను టీడీపీలో చేర్చుకునే ప్రయత్నాలు ఒకవైపు సాగుతున్నాయి. మరోవైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డికీ ఆహ్వానం పంపుతున్నట్లు సమాచారం. కిరణ్ సోదరుడు కిషోర్ కుమార్ రెడ్డి ఇప్పటికే చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో పీలేరు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా కిషోర్ పేరు ఖరారైందన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్థాయి పదవి నిర్వహించిన కిరణ్‌కు టీడీపీలో గౌరవప్రదమైన స్థానం కల్పించేందుకు చంద్రబాబు సిద్ధంగా ఉన్నట్లు పార్టీవర్గాల సమాచారం. ఆ మేరకు టీడీపీలో సెక్రెటరీ జనరల్ పదవిని ఆఫర్ చేసి, ఆయన నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లు చిత్తూరు జిల్లా పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. కిరణ్‌కుమార్ రెడ్డి సుముఖత వ్యక్తం చేస్తే ఆయనను రాజ్యసభకు పంపడం లేక రాజంపేట లోక్‌సభ బరిలో దింపడం సముచితమన్నది పార్టీ వ్యూహకర్తల అభిప్రాయంగా ఉంది. అంతేకాకుండా కేంద్రంలో ఈ దఫా తమ మద్దతు పొందే పార్టీ నుంచి కిరణ్‌కు మంత్రిపదవిని హామీగా పొందాలన్న ప్రతిపాదన కూడా ఉందంటున్నారు.

సెన్సెక్స్ ఫిబ్రవరి 26 2018



పెరిగినవి	%	తగ్గినవి	%
మారుతి సుజుకి	3.41	సన్ ఫార్మా	-2.46
టాటా మోటార్స్	3.22	టీసీఎస్	-1.35
ఇండస్ఇండ్	2.94	ఇన్ఫోసిస్	-1.26
లార్సెన్ టూబ్రో	2.83	ఐటీసీ	-0.93
యాక్సిస్ బ్యాంక్	2.41	భారతి ఎయిర్‌టెల్	-0.74

నిఫ్టీ ఫిబ్రవరి 26 2018



పెరిగినవి	%	తగ్గినవి	%
మారుతి సుజుకి	3.52	సన్ ఫార్మా	-2.40
టాటా మోటార్స్	3.29	ఇన్ఫోసిస్	-1.48
లార్సెన్	3.27	టెక్ మహీంద్రా	-1.45
యాక్సిస్ బ్యాంక్	2.92	టీసీఎస్	-1.43
ఇండస్ఇండ్	2.91	విప్రో	-1.15


టాప్ గైనర్స్ 26 ఫిబ్రవరి

34,445.75

బి.ఎస్.ఇ సెన్సెక్స్ ▲303.60

పాయింట్లు		%
9001.80	మారుతి సుజుకి	3.41%
372.05	టాటా మోటార్స్	3.22%
1691.25	ఇండస్ఇండ్ బ్యాంకు	2.94%
1339.20	లార్సెన్ టూబ్రో	2.83%
549.50	యాక్సిస్ బ్యాంకు	2.41%
735.65	ఎం అండ్ ఎం	2.27%
414.90	అదాని పోర్ట్స్	2.19%
1103.00	కోటక్ మహీంద్రా	2.14%
327.00	ఐసీఐసీఐ బ్యాంకు	1.77%
1909.95	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1.60%

బులియన్ | గత 7 రోజులు



ముడి చమురు దిగుమతులు

(మిలియన్లలో యూఎస్ డాలర్లలో)

జనవరి 2018	11659.07
డిసెంబరు	10345.88
నవంబరు	9551.0
అక్టోబరు	9286.7
సెప్టెంబరు	8188.1
ఆగస్టు	7754.8
జూలై	7844.9
జూన్	8125.5
మే	7692.7
ఏప్రిల్	7359.3
మార్చి	9714.0
ఫిబ్రవరి	7681.2
జనవరి 2017	8173.96


ఆధారం: వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ

మార్కెట్లలో మళ్ళీ జోష్

లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీలు







ముంబయి: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతోపాటు, భారతదేశపు వృద్ధి రికవరీపై ఆశావాదం 'సెన్సెక్స్' సోమవారం 300ల పాయింట్లకు పైగా లాభపడేందుకు దోహదపడింది. దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండవ సెషన్‌లోనూ పెరుగుదలను చూశాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) 'సెన్సెక్స్' మూడు వారాల గరిష్ఠ స్థాయి 34,445.75 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' 10,550 పాయింట్లను దాటింది. భారతదేశ ఆర్థిక రికవరీ వేగం పుంజుకున్నట్లుగా కనిపిస్తోందని, 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో జి.డి.పి వృద్ధి 7 శాతానికి చేరి ఉండవచ్చని మోర్గాన్ స్టాన్లీ నివేదిక వెల్లడించడంతో మదుపరులలో సెంటిమెంట్ బలపడింది. జి.డి.పి సంఖ్యా వివరాలు బుధవారం వెల్లడి కానున్నాయి. వాల్‌స్ట్రీట్ శుక్రవారం ఆరోహణను చూడడంతో, ఆసియా, యూరప్‌లలోని ఇతర మార్కెట్లు కూడా బలపడుతున్న ధోరణిని కనబరచాయి. కొనుగోళ్ళలో ఉధృతి కొనసాగేందుకు సహాయపడ్డాయని బ్రోకర్లు చెప్పారు.

బి.ఎస్.ఇ 'సెన్సెక్స్' సోమవారం 34,225.72 పాయింట్ల పటిష్ట స్థితి వద్ద మొదలైంది. ఆరోహణను కొనసాగిస్తూ 34,445.75 పాయింట్ల వద్ద ముగియడానికి ముందు ఒక దశలో 34,483.39 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ఈ రకమైన స్థితి ఇంతకుముందు ఫిబ్రవరి 5న కనిపించింది. ఫిబ్రవరి 5న 'సెన్సెక్స్' 34,757.16 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక 'నిఫ్టీ' 91.55 పాయింట్లు లాభపడి 10,582.60 పాయింట్ల వద్ద ముగిసింది. అది 10,520.20 పాయింట్ల నుంచి 10,592.95 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. షేర్ల ధరల పెరుగుదల ఏ ఒక్క రంగానికో పరిమితం కాక, వివిధ రంగాల్లో కనిపించింది.

కొనసాగిన ఎఫ్.పి.ఐల అమ్మకాలు

తాత్కాలిక డాటా ప్రకారం దేశీయ మదుపు సంస్థలు శుక్రవారం రూ. 1,514.03 కోట్ల విలువ చేసే ఈక్విటీలు కొనుగోలు చేయగా, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్.పి.ఐలు) రూ. 486.32 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు.

సింభావ్లీకి సి.బి.ఐ దెబ్బ

ఓరియంటల్ బ్యాంక్ కామర్స్ పట్ల పంజాబ్‌కు చెందిన సింభావ్లీ షుగర్స్ కంపెనీ రూ. 97.85 కోట్ల రుణ మోసానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఆ షుగర్స్ కంపెనీపైన, దాని చైర్మన్ గుర్మీత్ సింగ్ మాన్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గుర్పాల్ సింగ్ తదితరులపై కేంద్ర నేర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) కేసు నమోదు చేయడంతో సింభావ్లీ షుగర్స్ షేర్ ధర సోమవారం 15.73 శాతం క్షీణించింది. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ షేర్ ధర కూడా 10.02 శాతం పతనాన్ని చూసింది.



జి.డి.పి వృద్ధి 7 శాతం

మోర్గాన్ స్టాన్లీ అంచనా

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ రికవరీ వేగం పుంజుకుంటుందని అంచనా వేస్తున్నామని, డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి) వృద్ధి 7 శాతానికి పెరిగి ఉండవచ్చని భావిస్తున్నామని మోర్గాన్ స్టాన్లీ నివేదిక వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 5.7 శాతంగా ఉన్న జి.డి.పి వృద్ధి, జూలై–సెప్టెంబరు క్వార్టరులో 6.3 శాతానికి పెరిగింది. పరిశ్రమలు, సేవల రంగాల్లో వృద్ధి వేగం అందుకుని, వ్యవసాయ రంగంలో వృద్ధి క్షీణిస్తుందని భావిస్తున్నట్లు ఆ అంతర్జాతీయ ఫైనాన్షియల్ సర్వీసుల సంస్థ పేర్కొంది. ''గత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో 6.3 శాతంగా ఉన్న జి.డి.పి వృద్ధి 2017 డిసెంబరు త్రైమాసికంలో 7 శాతానికి అందుకోనుండడంతో, ఆర్థిక వ్యవస్థ రికవరీ కూడా మరింత వేగం పుంజుకుంటుందని మేం అంచనా వేస్తున్నాం'' అని మోర్గాన్ స్టాన్లీ ఒక పరిశోధన పత్రంలో తెలిపింది. జీవీఏల (జి.డి.పికి ఆర్థిక వ్యవస్థలోని నికర సబ్సిడీలు, పన్నులు కలపగా వచ్చిన మొత్తం) పరంగా చూసినప్పుడు, గత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో 6.1 శాతంగా ఉన్న జీవీఏ ఈ ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో 6.7 శాతానికి పెరిగింది. కంపెనీల రాబడుల సరళి కూడా డిసెంబరు త్రైమాసికంలో మెరుగుపడింది. పైగా, డిసెంబరు త్రైమాసికంలో, మోటారు వాహనాలు, ద్విచక్ర వాహనాల అమ్మకాలు బాగా పెరిగాయి. వస్తువుల ఎగుమతుల్లో వృద్ధి మరింత మెరుగుపడి రెండు సంఖ్యల స్థాయిలకు చేరుకుంది.

నోకియాతో కొనసాగుతున్న బీఎస్ఎన్ఎల్ పొత్తు

- తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లతో సహా పది టెలికాం సర్కిళ్ళలో ప్రారంభం కానున్న 4జి సర్వీసులు



బార్సిలోనా: భారతదేశంలోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లోని 10 టెలికాం సర్కిళ్ళలో 4 జి సర్వీసులు ప్రారంభించేందుకు ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బి.ఎస్.ఎన్.ఎల్) ఫిన్‌లాండ్ టెలికాం వస్తు తయారీ సంస్థ నోకియాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ మేరకు సోమవారం సంతకాలు చేసింది. ''నోకియాను టెక్నాలజీ భాగస్వామిగా చేసుకున్నందుకు మేం నిజంగా గర్విస్తున్నాం. తాజా సింగిల్ 'ర్యాన్' టెక్నాలజీని అమలులోకి తెచ్చేందుకు, 5జి దిశగా మరింతగా అడుగులు వేసేందుకు మేం దానితో కలసి దక్షిణ, పశ్చిమ మండలాల్లో పనిచేస్తాం'' అని బీఎస్ఎన్ఎల్ సీఎండీ అనుపమ్ శ్రీవాస్తవ ఒక ప్రకటనలో చెప్పారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లతో సహా పది (మహారాష్ట్ర, గుజరాత్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్, గోవా, తమిళ నాడు, కర్ణాటక, కేరళ) టెలికాం సర్కిళ్ళలో నోకియా టెక్నాలజీని నియోగించి, 3 కోట్ల 80 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ చందాదార్లకు సేవలందించనుంది. సింగిల్ రేడియో యూనిట్‌లో 2జి, 3జి, 4జి చందాదార్లకు సేవ లందిస్తూనే, నిర్వహణా పరమైన వ్యయాలు ఆదా చేసేందుకు నోకియా నియోగించే నెట్‌వర్క్ టెక్నాలజీ బీఎస్ఎన్ఎల్‌కి సహాయపడనుంది. ''కొత్త వోల్ట్ సర్వీసుల వల్ల బీఎస్ఎన్ఎల్‌కు చెందిన 4జి చందాదార్లు హెచ్.డి–క్వాలిటీ వాయిస్ అనుభవం పొందడానికి, వేగవంతమైన కాల్ కనెక్షన్లకి వీలు ఏర్పడుతుంది'' అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. గత వారం విడుదలైన, నోకియా ఎంబీఐటీ ఇండెక్స్ 2018 ప్రకారం, 2017 డాటా ట్రాఫిక్‌లో 4జి వాటా 82 శాతంగా ఉంది. వాడకందారు నెలసరి సగటు 4జి డాటా వినియోగం భారదేశంలో దాదాపు 11 జీబీగా ఉంది. భారతదేశ మార్కెట్‌కు 5జి అనువర్తిత ప్రయోజనాలను అభివృద్ధి చేసేందుకు నోకియా, బీఎస్ఎన్ఎల్ 2017లో ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. '' భారతదేశంలో ఈ ముఖ్యమైన ప్రాజెక్టుపై బీఎస్ఎన్ఎల్‌తో మా దీర్ఘకాలిక సంబంధం కొనసాగడం మాకు సంతృప్తిగా ఉంది. బీఎస్ఎన్ఎల్ కొత్త ఉత్తేజదాయక వాయిస్, డాటా సర్వీసులు ప్రారంభించేందుకు మా టెక్నాలజీల వినియోగం ఉపయోగపడుతుంది. భారతదేశంలో డిమాండ్ వృద్ధి చెందుతూండడం సంతృప్తినిస్తోంది'' అని నోకియాలో ఇండియా మార్కెట్ విభాగాధిపతి సంజయ్ మాలిక్ అన్నారు.

గోవా ప్రభుత్వానికి ట్రైబ్యునల్ మొట్టికాయ

న్యూఢిల్లీ: విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడానికి సంబంధించి గోవా ప్రభుత్వానికి ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్ ఒకటి మొట్టికాయ వేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఆర్ఇన్‌ఫ్రా)కు రూ. 292 కోట్లు చెల్లించాలని మధ్యవర్తిత్వ తీర్పును వెల్లడించింది. ఆర్ఇన్‌ఫ్రా సరఫరా చేసిన విద్యుచ్ఛక్తికి గోవా ప్రభుత్వం చాలా కాలం చెల్లింపులు జరపకపోవడంతో మధ్యవర్తిత్వ కేసు అవసరమైంది. శాన్‌కోల్‌లోని 48 మెగావాట్ల గోవా పవర్ ప్లాంట్ నుంచి ఆర్ఇన్‌ఫ్రా విద్యుత్ సరఫరా చేసింది. మొత్తం బకాయిని 2018 ఏప్రిల్ 15కల్లా చెల్లించాలని ట్రైబ్యునల్ ఆదేశించింది. అలా చెల్లించలేకపోయిన పక్షంలో మిగులు బకాయిపై 15 శాతం వార్షిక వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. 2015లో రూపొందించిన కొత్త నిబంధనల కింద జాయింట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఈ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఈ అంశంపై వాదనలు 2016 జనవరిలో మొదలై సుమారు రెండేళ్ళపాటు సాగాయి. పన్నెండు విడతల్లో రెండు పక్షాల వాదనలు ముగిసాయి. గోవా ప్రభుత్వం 2017 అక్టోబర్ 31 నాటికి మొత్తం రూ. 278 కోట్లు బకాయి ఉందని ఆర్ఇన్‌ఫ్రా పేర్కొంది. దానిపై రూ. 14 కోట్ల వడ్డీ చెల్లించాలని ట్రైబ్యునల్ 2018 ఫిబ్రవరి 16న ప్రకటించింది.

సాగర రవాణాకు మిథనాల్

ఇంధన, జలమార్గ రవాణా అభివృద్ధికి చెన్నైలో ఏర్పాటవుతున్న కేంద్రం



చెన్నై: సాగర రవాణాకు అంతటికీ మిథనాల్‌ను ఇంధనంగా వాడేట్లు చేయాలని కేంద్రం భావిస్తోంది. డీజిలుతో పోలిస్తే ఖర్చు, కాలుష్యం రెండూ తక్కువ అవుతాయని కేంద్రం భావన. మిథనాల్ లీటరు 22 రూపాయలకే లభ్యమవుతుంది. పైగా, దాన్ని దేశంలోనే తయారు చేసుకోవచ్చు. ఎటొచ్చీ దానికి శ్రీకారం చుట్టేందుకు కొత్త టెక్నాలజీ అవసరమవుతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ''చైనాలో మిథనాల్ లీటరు 17 రూపాయలకే లభిస్తోంది. భారతదేశంలో లీటరు 22 రూపాయలవుతోంది. అదే డీజిలు ధర లీటరుకు రూ. 60గా ఉంది. డీజిలుతో పోలిస్తే (మిథనాల్) కాలుష్యం చాలా తక్కువగా కూడా ఉంటుంది'' అని కేంద్ర రోడ్డు రవాణా, హైవేలు, నౌకాయాన శాఖ మంత్రి గడ్కరీ అన్నారు. నేషనల్ టెక్నాలజీ సెంటర్ ఫర్ పోర్ట్స్, వాటర్‌వేస్, అండ్ కోస్ట్స్‌కి శంకుస్థాపనలో భాగంగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం గడ్కరీ ప్రసంగించారు. ఐ.ఐ.టి మద్రాస్ సహకారంతో ఆ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ''గంగా నదిపై వారాణసి, హల్దియా, సాగర్‌గంజ్, సాహిబ్‌గంజ్‌లలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. అరవై నదుల రేవులలో మిథనాల్‌ను ఇంధనంగా ఉపయోగించేట్లు చేయాలని కూడా భావిస్తున్నాం'' అని గడ్కరీ చెప్పారు. ప్రభుత్వం 111 నదులను 20,000 కిలోమీటర్ల నిడివి కలిగిన జల మార్గాలుగా మార్చాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ''దానికి సాంకేతిక పరిజ్ఞాన సహాయం అవసరం. ఇక్కడ నౌకాశ్రయాల, జల మార్గాల, కోస్తాల టెక్నాలజీ సెంటరు ఏర్పాటు చేయడానికి కారణాలలో అది కూడా ఒకటి. ఇది చాలా చాలా ముఖ్యమైంది. ఇది అంతర్జాతీయ ప్రమాణాలతో సరితూగే ఉపయోగకరమైన టెక్నాలజీని అందిస్తుంది. వ్యయాలు ఆదా చేస్తుంది'' అని గడ్కరీ అన్నారు. తయ్యూర్ సమీపంలో అవతరించే ఈ కేంద్రం టెక్నాలజీ నవ కల్పనలకు, నూతన ఆలోచనల పరిణామక్రమానికి పురిటిగడ్డ అవుతుంది. నౌకాశ్రయాలు, సాగర రంగంలో పురోగతులకు ఊపిరినిస్తుందని ఆయన అన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు మొత్తం 70 కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. దానిలో రూ. 30 కోట్లను నౌకాయాన మంత్రిత్వ శాఖ, రూ. 15.87 కోట్లను, భారతీయ జల మార్గాల ప్రాధికార సంస్థ, రూ. 19.40 కోట్లను దేశంలో పనిచేస్తున్న పెద్ద నౌకాశ్రయాలు అందిస్తాయని ఐ.ఐ.టి మద్రాస్‌లో ఓషన్ ఇంజనీరింగ్ శాఖకు చెందిన ప్రొఫెసర్ కె. మురళి చెప్పారు. టెక్నాలజీ సెంటరు ''నిర్మాణం పనులు జూన్‌లో మొదలవుతాయి. సెంటరు 2019 అంతానికి పూర్తిగా పనిచేయడం ప్రారంభిస్తుందని భావిస్తున్నాం. తయ్యూరులో నాలుగెకరాల స్థలంలో ఈ సెంటరు అవతరిస్తోంది'' అని మురళి చెప్పారు. ఈ ప్రాజెక్టునకు సంబంధించిన వెబ్‌సైట్‌ను కూడా సోమవారం ప్రారంభించారు.

స్టెర్లైట్‌కి నౌకా దళ ప్రాజెక్టు



న్యూఢిల్లీ: భారత నౌకాదళ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ ను డిజైన్ చేసి, నిర్మించి, నిర్వహించేందుకు రూ. 3,500 కోట్ల ఆర్డరు లభించినట్లు స్టెర్లైట్ టెక్నాలజీస్ సోమవారం పేర్కొంది. ''రూ. 3,500 కోట్ల సిస్టమ్ ఇంటెగ్రేషన్ ప్రాజెక్టుతో భారత నౌకా దళం డిజిటల్ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్‌ను సంతరించుకున్నట్లు అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత అధునాతన నౌకా దళాల సరసన నిలిచినట్లు అవుతుంది'' అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయంగా ఉత్తమ నౌకా దళాలతో సమానంగా ఇది నౌకా దళానికి డిజిటల్ రక్షణ ఆధిపత్యాన్ని సమకూర్చిపెడుతుందని ఆ ప్రకటనలో తెలిపారు. భారతదేశంలో అంత పెద్ద స్థాయిలో నౌకా దళ ఇంటెగ్రేటెడ్ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్‌ను నిర్మించడం ఇదే మొదటిసారని కూడా కంపెనీ పేర్కొంది. నౌకా దళ కమ్యూనికేషన్స్ వ్యవస్థను స్మార్టర్ నెట్‌వర్క్ మౌలిక వసతిగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. నిర్గమాంశను పెంచి, ఉన్నత ప్రమాణాలతో కూడిన భద్రతా సేవలను కల్పించి, నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్‌ను కూడా సులభతరం చేసి దాన్ని రూపొందిస్తారని చెబుతున్నారు. స్టెర్లైట్ టెక్ ఆ రకమైన కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్‌కి డిజైన్ చేసి, నిర్మించి, తన సిస్టమ్ ఇంటెగ్రేషన్ సామర్థ్యాలతో దాన్ని పదేళ్ళకు పైగా నిర్వహించవలసి ఉంటుంది. ''జమ్మూ కశ్మీర్‌లో భారత సైన్యానికి మేం ఇటీవల చొరబాటు రహిత కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను సృష్టించిపెట్టాం. నౌకా దళ కమ్యూనికేషన్‌నెట్‌వర్క్‌ను సృష్టించడంలో ఆ అనుభవాన్ని ఉపయోగించుకుంటాం. మాకున్న అనన్యమైన సాఫ్ట్‌వేర్ –టు–సిలికాన్ సామర్థ్యాలతో భారత నౌకా దళానికి ఈ ఎండ్–టు–ఎండ్ వ్యూహాత్మక నెట్‌వర్క్‌ని అందించడం కోసం ఎదురు చూస్తున్నాం'' అని స్టెర్లైట్ టెక్ ప్రధాన కార్యనిర్వహణాధికారి ఆనంద్ అగర్వాల్ చెప్పారు. ''భారత రక్షణ వ్యవస్థకు పనిచేయడం, అంత పెద్ద స్థాయిలో ఇంటెగ్రేటెడ్ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్‌ను నిర్మించడాన్ని మాకు లభించిన అరుదైన అవకాశంగా భావిస్తున్నాం. ఇది పాలనాపరమైన, రక్షణ కార్యకలాపాలకు భారతీయ నౌకా దళానికి భద్రతకు డోఖా లేని విశ్వసనీయమైన డిజిటల్ హైవేని కల్పిస్తుంది'' అని స్టెర్లైట్ టెక్ (టెలికాం ఉత్పత్తులు, సర్వీసుల) విభాగ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. రావు చెప్పారు. పరిధి, పరిమాణం రెండింటిలోనూ ఇది సాటిలేనిది అవుతుంది. అధిక సామర్థ్యం కలిగిన ఐ.పి–ఎం.పి.ఎల్.ఎస్ (ఇంటర్‌నెట్ ప్రోటోకాల్–మల్టీ ప్రోటోకాల్ లేబుల్ స్విచింగ్) నెట్‌వర్క్‌ని సృష్టించడం కూడా ఈ ప్రాజెక్టులో భాగమే. ప్రాజెక్టు పూర్తయితే, అది బహుళ భారతీయ నౌకా దళ ప్రదేశాలను, భారతదేశ పాలనలో ఉన్న దీవులను అనుసంధానపరుస్తుందని కంపెనీ తెలిపింది.

అఫెర్‌పై కొనుగోలులో జేఎస్‌డబ్ల్యూ స్టీల్

ముంబయి: భూషణ్ గ్రూపునకు చెందిన రెండు కంపెనీల చితికిన ఆస్తులను స్వాధీనం చేసుకునే రేసులో వెనుకబడిపోయిన జె.ఎస్.డబ్ల్యు స్టీల్ రూ. 600 కోట్లు పెట్టి, ఇటలీలోని రెండవ పెద్ద ఉక్కు ఉత్పత్తి సంస్థ అఫెర్‌పైని సొంతం చేసుకునే దిశగా పావులు కదుపుతోంది. అఫెర్‌పైని ఇంతకుముందు లూసినిస్పా అని పిలిచేవారు. నిజానికి, అఫెర్‌పైని స్వాధీనం చేసుకునేందు కు అల్జీరియా ప్రధాన కేంద్రంగా ఉన్న సివిటల్ గ్రూప్‌తో గత ఆరు నెలలుగా జె.ఎస్.డబ్ల్యు స్టీల్ మంతనాలు సాగిస్తోంది. వచ్చే నెల మొదట్లో ఒప్పందాన్ని ఖరారు చేసుకున్న తర్వాత, దాని నుంచి ప్రకటన వెలువడవచ్చని భావిస్తున్నారు. సజ్జన్ జిందాల్ ప్రమోట్ చేస్తున్న జె.ఎస్.డబ్ల్యు స్టీల్ వెనక్కి నెట్టడంలో అంతకుముందు టాటా స్టీల్ సఫలమైంది. భూషణ్ స్టీల్, భూషణ్ పవర్ అండ్ స్టీల్ కంపెనీలకు చెందిన స్ట్రెస్సడ్ ఎసెట్ల కొనుగోలుకు సమరశీలతతో ప్రయత్నించడం ద్వారా టాటా స్టీల్ ముందంజలో నిలిచింది. అయితే, భూషణ్ ఆస్తులు హస్తగతం చేసుకునేందుకు టాటా స్టీల్ చేసిన బిడ్‌పై సందేహాలు కొనసాగుతోంది. తాను వేసిన బిడ్‌ను తెరవకూడదని రుణదా తల కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని అంతర్జాతీయ లోహ రంగ దిగ్గజ సంస్థ లిబర్టీ హౌస్ సవాల్ చేస్తూ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. లిబర్టీ హౌస్ గడువు ముగిసిన తర్వాత బిడ్ సమర్పించింది. కానీ, ఇతర బిడ్‌లను తెరవక ముందే తాను బిడ్‌ను సమర్పించాను కనుక తనదీ పరిశీలనలోకి తీసుకోవాలని లిబర్టీ హౌస్ వాదన.

ఇటలీపై ఆసక్తి

ఇటలీలోని రెండు పెద్ద ఉక్కు ఉత్పాదన సంస్థలు ఇల్వా, లూసినీలపై జె.ఎస్.డబ్ల్యు కన్నేసి ఉంచింది. ఐరోపాలో 2008 ఆర్థిక మాంద్యం తర్వాత, ఉక్కుకు డిమాండ్ హఠాత్తుగా పడిపోవడంతో, ఆ రెండు కంపెనీల నష్టాలు పెరిగిపోతూ వచ్చాయి. అవి దివాలా తీశాయని 2012లో ప్రకటించి, వాటిని అమ్మకానికి పెట్టారు. తగిన విలువ ఉంటేనే కొందామనుకున్న జె.ఎస్.డబ్ల్యు వాటి కొనుగోలుకు పెద్ద మొత్తాలను ఏమీ ఇవ్వజూపలేదు. ఫలితంగా, ఆర్సిలార్ మిత్తల్ చేతికి ఇల్వా వెళ్ళగా, లూసినిని సివిటల్ గ్రూప్ కైవసం చేసుకుంది. లూసిని కొనుగోలుకు జె.ఎస్.డబ్ల్యు గత ఆగస్టులో సివిటల్ గ్రూపుతో చర్చలు ప్రారంభించింది. లూసిని పేరును అసియరి ఇ ఫియరీ డి పియాంబినో (అఫెర్‌పై)గా మార్చారు. అఫెర్‌పై వాస్తవానికి రష్యాకు చెందిన సెవెర్‌స్టల్ యాజమాన్యంలో ఉండేది. పియాంబినోలో ఉన్న అఫెర్‌పై ఫ్యాక్టరీ ఏడాదికి సుమారు 2.5 మిలియన్ టన్నుల ఉత్పాదక సామర్థ్యం కలిగి ఉంది.

ఎలక్ట్రిక్ వాహనాల పథకాలు

ఐరోపా రైల్వేలకు అవసరమైన ప్రత్యేక వస్తువులను అది తయారు చేస్తోంది. మోటారు పరిశ్రమ, వైర్ రాడ్ మిల్లులు కోరే ఉత్పత్తులను అందిస్తోంది. జె.ఎస్.డబ్ల్యు గ్రూప్ కంపెనీ జె.ఎస్.డబ్ల్యు ఎనర్జీ భారతదేశంలో ఎలక్ట్రిక్ కార్ల తయారీకి సన్నద్ధమవుతున్న సమయంలో, అఫెర్‌పై స్వాధీనానికి జె.ఎస్.డబ్ల్యు ప్రయత్నిస్తోంది. విస్తారమైన ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్లలో యూరప్ ఒకటి. అక్కడ కనుక అడుగు పెట్టగలిగితే, జె.ఎస్.డబ్ల్యు గ్రూప్ ఎలక్ట్రిక్ కార్ల తయారీకి చెందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోగలుగుతుంది. భారతదేశంలో ఎలక్ట్రిక్ కార్ల విడి భాగాల తయారీలో వేగం తీసుకురాగలుగుతుంది. గుజరాత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి సుమారు 4,000 కోట్లు పెట్టుబడి పెట్టాలని జె.ఎస్.డబ్ల్యు ఎనర్జీ భావిస్తోంది. సంయుక్త రంగంలో మరో సంస్థను తోడు చేసుకునేందుకు అన్వేషిస్తోంది. మొదటి ఎలక్ట్రిక్ వాహనాన్ని 2020కల్లా తీసుకురావాలని అది ప్రణాళికలు వేస్తోంది.

హోలి అరమరికలు లేని స్నేహానికి నిలువెత్తు నిదర్శనం. దేశాన్నంతా రంగులమయంగా చేసే ఆనందోత్సవ హేల హోలి పండుగ. ఈ పర్వానికి చాలా పేర్లున్నాయి. హోలికా పూర్ణిమ, కాముని పున్నమి, మదనోత్సవం, డోలాపున్నమి, కల్యాణ పూర్ణిమ, వసంత పూర్ణిమ ఇలా ఒకే వేడుకను అనేక పేర్లతో పిలవడం ఒక్క హోలి విషయంలోనే జరుగుతుంది.




హోలి పున్నమి

హోలి అంతరార్థం అందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండడమే. చలికాలం ముగుస్తుండగా రాబోయే వేసవికి నాందిగా హోలి పండుగ జరుపుకోవడం ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాల్లోనూ సంప్రదాయమే. అప్పటివరకు చలిబాధ తట్టుకోలేక ముడుచుకుపోయిన చర్మానికి హోలి వసంతం చల్లని పలకరింపు. హోలి రంగులు వదిలించుకోవడం కష్టం. చలికాలం అంతా హడావుడిగా, మొక్కుబడిగా స్నానం ముగించే వారికి రంగులు పని కల్పిస్తాయి. దేహ శుభ్రతకు, మానసిక ఉల్లాసానికి అందరూ కలిసి సరదాగా వసంతాలాడుకోవడం పురాణకాలం నుంచి ఆచారమే.

కామదహనం

హోలి పండుగలో ఆడ మగ భేదాలు పాటించరు. ప్రేయసీ ప్రియులకు అనురాగాన్ని పంచే వసంతకాలానికి హోలి పూర్ణిమ ప్రారంభదినం. కామదేవుడైన మన్మథుడు పునరుజ్జీవం పొందిన రోజే హోలి. మనకు అమావాస్య తరువాత ఉగాదితో వసంత రుతువు ప్రవేశిస్తుంటే ఉత్తరాదిన హోలి మరుసటి రోజే వసంతకాలం వస్తుంది. ఈ వసంతకాలానికి ముందే కృత్రిమ వసంతాన్ని సృష్టించి శివుని తపస్సు చెడగొట్టడానికి పూనుకున్నాడు మన్మథుడు. శివుడు కోపించి నిప్పుకన్ను తెరిచి అతణ్ణి భస్మం చేశాడు. మన్మథుని వెంట వచ్చిన రతీదేవి భర్త దుస్థితికి విలపించసాగింది. మన్మథుని స్నేహితుడైన వసంతుడు శివుణ్ణే ప్రార్థించి మళ్లీ నీ భర్తను బతికించమని కోరమన్నాడు.



రతీదేవి ఒక సాలగ్రామ శిలామూర్తి ముందు శివుణ్ణి ప్రార్థించింది. అది పరమశివుడు కోపించి నరికివేసినప్పుడు గణపతి తల తెగిపడిన ప్రాంతం. (ఒరిస్సాలో జాజ్ పూర్ జిల్లా చండీఖోల్ గ్రామంలో ఈ ఆలయాన్ని దర్శించవచ్చు.) గడిచిన కల్పంలో జరిగిన కథలో వినాయకుని శిరస్సు అక్కడ పడి సాలగ్రామశిలగా అవతరించింది. రతీదేవి ప్రార్థన చేసి పుష్పాంజలి సమర్పించబోయేంతలో ఆ పువ్వును అందుకోవడానికి ఆ సాలగ్రామం నుంచి అయిదు చేతులు బయటికి వచ్చాయి. బ్రహ్మ, విష్ణు, సూర్య, పార్వతీ, వినాయకుల చేతులే అవి. అందరూ ఏకమై రతీదేవికి పతిభిక్ష పెట్టమని శివుణ్ణి వేడుకున్నారు. అందరి కోరికలనూ మన్నించి మహేశ్వరుడు తిరిగి మన్మథుణ్ణి బతికించిన రోజే హోలి పూర్ణిమ. కామదహనం తరువాత అనంగుడు రతీదేవికి మాత్రమే సశరీరుడై కనిపిస్తాడని శివుడు వరమిచ్చాడు. శివుడు ఆత్మకు, పార్వతి ప్రకృతికి, మన్మథుడు మనసుకు సంకేతాలు. మనసు అదుపులో ఉండాలంటే ప్రకృతిహితంగా మనసును ఆత్మానుసంధాన స్థితికి తీసుకురావాలనే ఆధ్యాత్మిక సందేశం ఈ పండుగలో దాగుంది.

ప్రకృతి సహజమైన రంగులతోనే హోలిని జరుపుకోవాలి. హానికరమైన కృత్రిమ రంగులతో హోలి జరుపుకోవడం సంప్రదాయ విరుద్ధం. పసుపు కలిపిన చందనం, అష్టగంధం, వృక్షమూలాల రసం, మోదుగ పుష్పాల గుజ్జు, మందార పువ్వులు, గులాబీ పువ్వుల నుంచి తీసిన రసం కలిపిన జలాన్ని హోళీ రంగులుగా మనపూర్వులు వినియోగించేవారు. పర్యావరణ హితంగా పండుగ జరుపుకుని సంప్రదాయాన్ని పరిరక్షించుకుందాం. హోలి ఆత్మీయతలను పెంపొందించి, అనుబంధాలను దృఢపరుస్తుంది.

పురాణగాథల్లో...

హోలి వేడుకను ఉత్తర భారతదేశంలో డోలాజాతరగా నిర్వహిస్తారు. గోకులంలో యశోదాదేవి ఫాల్గుణ పౌర్ణమినాడే చిన్ని కృష్ణుణ్ణి ఊయలలో వేసిందట. అందుకు గుర్తుగా ఉత్తరాదివారు రాధాకృష్ణుల మూర్తుల్ని ఊయలలో ఉంచి లాలిపాటలను ఆలపిస్తారు. హోలి పండగతో ముడిపడిన గాథలు భవిష్య, లింగ పురాణాల్లో ఉన్నాయి. ధర్మరాజుకు నారద మహర్షి హోలీ పండగ నియమాలను, విశిష్టతను వివరించాడు. శిశు హంతకి అయిన రాక్షసి హోలిక వినాశనానికి సూచికగా హోలి పర్వదినం ఏర్పడిందని చెబుతారు. అగ్ని కూడా దహించలేని మహాశక్తిమంతురాలైన హోలిక హిరణ్య కశిపుడి సోదరి. ప్రహ్లాదుణ్ణి ఒడిలో కూర్చోబెట్టుకుని అగ్ని ప్రవేశం చేయమని హిరణ్య కశిపుడు ఆదేశిస్తాడు. హరి భక్తుడైన ప్రహ్లాదుడి స్పర్శ వల్ల హోళిక శక్తి సన్నగిల్లింది. ఆమె అగ్నికి ఆహుతైపోయింది. ప్రహ్లాదుడు రక్షణ పొందుతాడు. అదే హోలికా పూర్ణిమ అయిందని చెబుతారు పెద్దలు.మధుర మీనాక్షి దేవి తపోదీక్షను చేపట్టి సుందరేశ్వర స్వామిని తన తపోదీక్షతో మెప్పించి ఈ ఫాల్గుణ పౌర్ణమినాడే వివాహం చేసుకుంది. దక్షిణ భారతదేశంలో అమ్మవారి ఆలయాల్లో ఫాల్గుణ పౌర్ణమినాడు కల్యాణీ వ్రతాన్ని నిర్వహిస్తారు. అందుకే దీన్ని కల్యాణ పౌర్ణమిగా వ్యవహరిస్తారని విష్ణు పురాణం చెబుతోంది.

– డాక్టర్ కె. పూర్ణప్రజ్ఞాభారతి

మారేడుదళం

చింతనామృతం

బుద్ధిగుహలో దాగివున్న బ్రహ్మమును దర్శించిననాడు మనిషి అజ్ఞానమనే పీటముడిని విప్పగలుగుతాడు. అప్పుడు సందేహాలన్నీ విచ్ఛిన్నమవుతాయి. 'త్వం బ్రహ్మాసి, అహం బ్రహ్మాస్మి, ఆదయోరంతరం న విద్యతే త్వమేవాహ మహమేవ త్వమ్' – నువ్వు బ్రహ్మానివి, నేను బ్రహ్మాన్ని, మనిద్దరికీ తేడాయే లేదు. నువ్వే నేను, నేనే నువ్వు అనే సమత్వ భావన, జీవబ్రహ్మైక్య స్థితి అనుభవంలోకి వస్తాయి. అందుకోసం పెద్దలు చెప్పే వేదాంతసారాన్ని వింటూ, చదువుతూ మనస్సులో భావనచేస్తూ యోగసాధన చేయాలి. జగత్తు అంతా మిధ్య – జీవుడు బ్రహ్మము ఒక్కటే అనే నిజాన్ని తెలుసుకున్న సాధకునికి జీవన్ముక్తి అంటే బ్రతికి ఉండగానే ముక్తిని అనుభవించే స్థితి సాధ్యపడుతుంది. అందుకు ఉపనిషత్తుల అధ్యయనం ఉత్తమ మార్గం. వేదాలపై మహర్షులు జరిపిన అధ్యయనాలు, విశ్లేషణలు, చర్చల సారాంశం ఉపనిషత్తులు. నేటివరకూ ఒకవెయ్యి ఎనిమిది ప్రామాణిక ఉపనిషత్తులు లభిస్తున్నాయి. అన్నింటిలోనూ అహంబ్రహ్మాస్మి, ఏకమేవా ద్వితీయం బ్రహ్మ వంటి మహావాక్యాలు అనేకం ఉంటాయి. అటువంటి వాక్యాలన్నింటినీ అంశాల వారీగా విభజించి ఒకచోట కూర్చారు 'మహావాక్య రత్నావళి' గ్రంథ వివరణకర్త డాక్టర్ ముంజులూరి నరసింహారావు. రెండుసంపుటాల ఈ గ్రంథంలో మొత్తం 20 అంశాలను ప్రకరణాలుగా పేర్కొన్నారు. 'విధివాక్య ప్రకరణం'తో గ్రంథం ప్రారంభమవుతున్నది. బ్రహ్మచింతన, యోగసాధన చేయదలుచుకున్నవారు తప్పనిసరిగా పాటించవలసిన పద్ధతులను గురించి ఉపనిషత్తులేం చెబుతున్నాయన్నది ఈ ప్రకరణం చెబుతుంది. అలాగే అన్ని ఉపనిషత్తుల్లోని ఆత్మస్వరూపాన్ని నిరూపించే వాక్యాలన్నింటినీ ఆత్మస్వరూప వాక్య ప్రకరణంలో పొందుపరిచారు. స్వతంత్ర సుందర అభివ్యక్తితో ఉపనిషత్ మహావాక్యాలకు రచయిత అందించిన వ్యాఖ్యానం చదువరులలో చింతనాపరత్వాన్ని పెంచుతుంది.


మహావాక్య రత్నావళి
(రెండు సంపుటాలు)
వివరణ కర్త : డాక్టర్ ముంజులూరి నరసింహారావు, పేజీలు : 771, వెల : రూ. 600, ప్రతులకు : రచయిత, 1-5-881, మారుతీనగర్, కొత్తపేట, హైదరాబాద్ ఫోన్ నెం. 9000765972



ధర్మసందేహం

హారతి ఎన్నిరకాలుగా ఇస్తారు?


ఇంటింటా పూజగదిలో ఏకహారతి ఉంటుంది. కర్పూరాన్ని ఉంచడానికి అందులో కర్పూరాన్ని వెలిగించి 'వేదాహమేతం పురుషం మహాన్తమ్' అనే పురుషసూక్త మంత్రాన్ని పఠిస్తూ దైవానికి నీరాజనం ఇస్తారు. 'అఘోరే భ్యో థ ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః' అనే నీరాజన మంత్రాన్ని శైవులు పఠిస్తారు. కర్పూర హారతి కాకుండా దీపహారతి ఇచ్చే సంప్రదాయం కూడా మనకు ఉంది. ఆవునేతిలో తడిపిన వత్తిని వెలిగించి హారతిస్తారు. ఇందుకోసం రెండు, మూడు, ఐదు, ఏడు ఇలా బేసి సంఖ్యలలో దీపాలు వెలిగిస్తారు. అత్యధికంగా నక్షత్ర హారతి అంటే ఇరవై ఏడు ఒత్తులతో హారతినిస్తారు. అయిదు కంటే ఎక్కువ దీపహారతులను సాధారణంగా ఆలయాల్లోనూ, నదీహారతుల్లోనూ మాత్రమే ఇస్తారు. హారతి పళ్లేలను రూపొందించిన విధానాన్ని బట్టి ఆయా పేర్లతో పిలుస్తారు.



నాగదీపం, రథదీపం, పురుషదీపం, మేరు దీపం, పంచబ్రహ్మదీపం, గజ దీపం, వృషభ దీపం, కుంభ హారతి, నేత్ర హారతి, బిల్వహారతి, రుద్ర, చక్ర, నారాయణ నవగ్రహ హారతుల వంటివి ఎన్నో ఉన్నాయి. ఉత్సవాలలో, ఆలయాలలో ఒత్తులతో దీపహారతి ఇచ్చినప్పటికీ చిట్టచివరిగా అఖండ కర్పూర హారతి కూడా తప్పనిసరిగా ఇస్తారు.

– డా. కాకునూరి సూర్యనారాయణమూర్తి

క్రీస్తు సందేశం



పరలోక రాజ్యం


ఏసు పరలోక రాజ్యాన్ని గూర్చి చక్కని ఉపమానాలతో కన్నులకు కట్టినట్లు తేలిక పలుకులతో బోధించాడు. విత్తువాడు విత్తనాలు చల్లగా రాజమార్గాన కొన్ని, రాతి నేలను కొన్ని, ముండ్ల పొదల్లో కొన్ని, సారవంతమైన నేలను కొన్ని పడ్డాయి. దారి ప్రక్కన పడ్డ వాటిని చిన్న పక్షులు వచ్చి తినివేశాయి. రాతి నేలను పడ్డవి మొలకెత్తి వాడిపోయాయి. ముండ్ల పొదల్లో పడ్డవి నాలుగు రోజులు పెరిగి ముండ్ల పొదల మధ్య అణిగిపోయాయి. మంచి నేలను పడ్డవి కన్నుల పండుగ కలిగించేట్లు, రైతు హృదయం హర్షించేట్లు మంచిగా పండాయి. సత్య సువార్త మనుష్య హృదయాన ఒకచోట మొలకెత్తుతుంది. ఒక్కచోట పెరిగి నశిస్తుంది. ఒక్కచోట పండి ఫలిస్తుంది.

మత్తయి సువార్త ఇలా చెబుతోంది. ఏసు ... పరలోక రాజ్యము సమీపంలోనే ఉంది. కనుక మారుమనస్సు పొందండి. పరలోక రాజ్యం చేరాలంటే మారుమనస్సు మనకు అవసరం. పరలోక రాజ్యమంటే ఆధ్యాత్మిక పరిపాలన, దాని మూలాధారం పరలోకంలో వుంది. మారు మనస్సు పొందడం అంటే మనం పశ్చాత్తాపపడి మన జీవితాల్లో మన హృదయాల్లో దేవుని పరిపాలనను అంగీకరించాలి. కాబట్టి మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెతకండి.

పరలోక రాజ్యానికి వెళ్లాలంటే చిన్న పిల్లలవలె తగ్గించుకొనే మనసుండాలి. పేరు ప్రఖ్యాతుల కోసం ప్రయాసపడేవారు పరలోకరాజ్యంలో ప్రవేశించరు. స్వార్థత్యాగం నేర్చుకోవాలి. నేను అనే స్వభావాన్ని పరిత్యజించుకోవాలి. మంచి పనులవల్ల పాప విముక్తి రక్షణ కలుగదు. మనుష్యులు పశ్చాత్తాపపడి ప్రభువుపై నమ్మకముంచి ఆయనకు లోబడి ఆయన చెప్పినట్లు చేయాలని దేవుని సంకల్పం.

దివ్యవాణి

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు. అల్లాను, అంతిమదినాన్ని విశ్వసించే వ్యక్తి అతిథి మర్యాద చేయాలి. మూడురోజుల కంటే ఎక్కువ రోజులు అతిథికి ఆతిధ్యమిస్తే అది దానంతో సమానమవుతుంది. అయితే ఆతిధ్యమిచ్చేవారి ఇంట అతనికి కష్టం కలిగేంత వరకు తిష్ట వేసి కూర్చోవడం అతిథికి సమ్మతం కాదు. ఒక వ్యక్తి దైవప్రవక్త సన్నిధికి వచ్చి ఇస్లాంకు సంబంధించిన ఆచరణలలో అన్నింటికంటే శ్రేష్ఠమైనది ఏది? అని అడిగాడు. అప్పుడు ప్రవక్త, 'నీవు అతిథికి, ఆకలిగొన్నవానికి అన్నం పెట్టు. అలాగే పరిచయం ఉన్నా లేకపోయినా ప్రతి మనిషికీ సలామ్ చెయ్యి. ఇవే అన్నింటికంటే శ్రేష్ఠమైన ఆచరణలు' అని బోధించారు.



సంపాదించుకున్న కొద్దిపాటి ఆహారాన్ని స్వయంగా భుజించకుండా అతిథికి వడ్డించారు నిరుపేదలైన భార్యాభర్తలు. తాము సైతం తింటున్నట్లుగా నటించారు. వారిని ఉద్దేశించి, 'ఈరోజు మీరు చేసిన పనికి అల్లా చాలా సంతోషించారు. సంతోషంతో ఈ వాక్యాన్ని అవతరింపచేశారు' అంటూ ఖురాన్ 59వ సూరహ్ లోని 9వ వాక్యాన్ని పఠించారు.

వారు నిరుపేదలైనప్పటికీ ఇతరుల అవసరాలకే ప్రాధాన్యమిస్తారు. పేరాశ, పిసినారితనాల నుంచి రక్షించబడినవారే ధన్యులు.''

– ముహమ్మద్ లియాఖత్ ఉద్దీన్

గీతరామాయణం

వానమామలై వరదాచార్యులు రచించిన గీతరామాయణం తేనెలసోన. లవకుశుల రామాయణ గానాన్ని శ్రీరాముడు వింటుండగా కావ్యాన్ని ఆరంభించారు కవి.

''ధన్యశరథా! ఇదిగో పాయసం. నీ భార్యలు ముగ్గురూ త్వరలోనే ప్రసూతలవుతారు. నారాయణాంశతో నరులను కంటారు. నీకు దేవజనకుడవయ్యే భాగ్యాన్ని ప్రసాదిస్తారు'' అని యజ్ఞపురుషుడు ఆనాడే చెప్పాడు. పుత్రోదయాలతో దశరథునికి సూర్యోదయాలు, చంద్రోదయాలు గుర్తురాలేదు. రామ అని వశిష్ఠుడేనాడు పలికాడో నాటినుంచి రామనామమే తండ్రికి ఉచ్ఛ్వాస శ్వాసలయ్యాయి. తాను దేవజనకుడనే సంగతిని రుషిశ్రేష్ఠులు కూడా ధృవపరిచారు. కానీ వేల ఏళ్ల నిరీక్షణ తరువాత వార్థక్యంలో కొత్తగా వచ్చిన తండ్రి హోదా ఆ విషయాన్ని పదేపదే మరిచిపోయేలా చేసింది. అనుదినమూ రాముని ముద్దుమాటలతో, అతని ఆటపాటలతో, విద్యాప్రసంగాలతో రామసారంగా రోజులు గడిచిపోతున్నాయి.

బాలవీర రామనేత
వారిని శిక్షించుగాత

ఈ కొమరుడు బాలుడయ్యు నెంతో యోగ్యుడీ వసుధ అని విశ్వామిత్రుడు చెబితే నమ్మలేకపోయాడు. చివరకు పంపాడు.

అహల్యాశాపవిమోచనం

స్వామి రామా! ఈ ఆశ్రమ ప్రాంతంలో నీ చరణం సోకింది. నీ కృపాశిల్ప సత్కృతి వల్ల నేను తిరిగి నరాకృతిని దాల్చాను. శ్వాస విడివడింది.



పతితపావనా ప్రభు రఘుకులజా
ఏ తీరున నేజేతును పూజ
పునర్జన్మ బొందిన జీవనమును
అభిషేకించితి నంఘ్రియుగలిని

నా శ్వాస విడివడింది. కనులకు పూర్వము మాదిరి దృష్టి కలిగింది. కన్నులారా నిన్ను చూశాను. నీలో సమస్త సృష్టినీ దర్శించాను. ఉన్నట్లుండి కన్నులవెంబడి ఆనందధారలు కాల్వగట్టడం మొదలుపెట్టాయి. ఒక్కక్షణం నా చెంత కూర్చో రామా! నా చెవులకు మరలా వినేశక్తి వచ్చింది. మౌనవదనంలో మాట స్ఫురించింది. నీ దయవల్ల నేను పునర్జన్మ పొందాను. శాపవిముక్తనయ్యాను అంటూ అహల్య కృతజ్ఞత చెల్లించింది విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో కొంతసేపు గౌతమాశ్రమంలో గడిపి, మిథిలకు తిరిగి ప్రయాణమయ్యాడు.

సీతాకల్యాణం

ఆకాశంతో అవనీమాత వియ్యమందింది. రాముడు సహజాతి సహజంగా శంకరధనువును ఎత్తి పట్టుకున్నాడు. రారాజైన జనకుడు పూర్ణమనోరథుడయ్యాడు. ముగ్ధజానకి ధనుర్ధారి అయిన రాముణ్ణి దవ్వునుంచి ఆత్మశక్తిని ఏకోన్ముఖం చేసి చూస్తోంది. చూస్తుండగానే ఆమె కపోల సీమల నుంచి లజ్జాసుమాలు క్రమంగా వికసించాయి.

అల్లన రెప్పలు విప్పి సీత తానతని గాంచుచుండె
తాడిత ఘూత నినాదము వలె పెనుధ్వనులు మిన్నునుండె
ఇరుఖండములగ శ్రీరాముడు తాహరధనువును విరిచె

అవనిజాత సీతాసతి. శ్రీవిష్ణ్వంశ రాఘవుడు. గంధర్వుల సుస్వరాలలో జయగానగీతి నిండుతుంటే దివి కరతాళ ధ్వనులు చేసింది. వంచె తలను శ్రీరాముడు. జానకి వైచెను సుమమాల. ఆకాశానికి బాంధవ్యం నేలతో ఏర్పడింది.

– ముకుందప్రియ

మీరూ రాయండి!

మందిరం పేజీపై మీ అభిప్రాయాలను, రచనలను, ధర్మసందేహాలను manammandiram@gmail.comకు పంపండి. మారేడుదళం శీర్షికలో సమీక్ష కోసం మీ ఆధ్యాత్మిక ప్రచురణలను పంపవలసిన మా చిరునామా : మందిరం పేజీ, మనం దినపత్రిక, 5-3-864/4/బి, ఎస్.బి.ఎన్. ఆర్కేడ్, ఫోర్త్ అండ్ ఫిఫ్త్ ఫ్లోర్, గ్రీన్ ల్యాండ్స్, గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016



రైనా ..వారెవా !

కేప్‌టౌన్ : దక్షిణాణాఫ్రికాతో చివరి టి20 విజయం తర్వాత ఇప్పుడు ఎవరి నోట విన్నా టాపార్డర్ ప్లేయర్ రైనా మాటే వినిపిస్తోంది. ఏడాది విరామం అనంతరం జట్టులో స్థానం సంపాదించిన రైనా శనివారం జరిగిన సిరీస్ డిసైడర్ మ్యాచ్‌లో చెలరేగిపోయాడు. పడిలేచిన కెరటంలా ఆడి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్నాడు. దీంతో రైనాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. రైనా రీ ఎంట్రీ అందిరిపోయిందని, సౌతాఫ్రికా లాంటి క్లిష్టమైన జట్టుపై సిరీస్ విజయాన్నందించడంలో రైనా అద్భుతంగా ఆడాడని మాజీ ప్లేయర్ మహ్మద్ కైఫ్ ట్వీట్ చేశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్న రైనాకు నా అభినందనలు అంటూ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ పేర్కొన్నాడు. అద్భుతంగా ఆడావంటూ పాకిస్తాన్ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ కూడా రైనాను అభినందించాడు. ఇక రైనా భార్య ప్రియాంక కూడా కేప్‌టౌన్ ఇన్నింగ్స్‌పై సంతోషం వ్యక్తం చేసింది. సఫారీలతో టి20 సిరీస్‌తో రీ ఎంట్రీ ఇచ్చిన రైనా చివరి మ్యాచ్‌లో తడాఖా చూపెట్టాడు. 27 బాల్స్‌లో 5 ఫోర్లు ఓ సిక్సర్ సాయంతో 43 రన్స్ చేశాడు. దీంతో టీమిండియా 172 పరుగుల భారీ స్కోరు చేసింది. బ్యాటింగ్‌లో రాణించిన రైనా బౌలింగ్‌లోనూ పొదుపుగా పరుగులు ఇచ్చాడు. ప్రధాన బౌలర్లు భారీగా పరుగులు ఇస్తున్న తరుణంలో పార్ట్ టైమ్ స్పిన్నరగా బరిలోకి దిగిన రైనా 3 ఓవర్లలో 27 పరుగులు ఇచ్చాడు. డేంజర్ బ్యాట్స్‌మెన్ మిల్లర్ వికెట్ పడగొట్టి భారత విజయానికి బాటలు వేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చేజిక్కించుకున్నాడు. తొలి టీ20లో 7 బంతుల్లో 15 పరుగులు చేసిన రైనా రెండో టి20లో 30 రన్స్ చేసి ఫర్వాలేదనిపించాడు. మూడు మ్యాచ్‌ల్లోనూ ఫస్ట్‌డౌన్‌లోనే ఆడిన రైనా వచ్చీ రావడంతోనే సఫారీ బౌలర్లను బెంబేలెత్తించి వారిపై వత్తిడి పెంచాడు. తనపై కోహ్లీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని శ్రీలంకతో సిరీస్‌కు ఎంపికయ్యాడు. సౌతాఫ్రికా టూర్‌లో అందుకున్న ఆత్మవిశ్వాసంతో మునుముందు ఆడబోయే మిగతా సిరీస్‌లలోనూ రాణిస్తానని రైనా చెప్పాడు. 'ఈ మ్యాచ్‌తో పాటు ఈ సిరీస్ నాకెంతో ముఖ్యమైంది, భారత్ తరపున ఆడాలన్న ఆకాంక్ష బలపడింది 2019 ప్రపంచ కప్ ఆడాలనుకుంటున్నా అని రైనా చెప్పాడు. రెండేళ్లుగా బాగా కష్టపడుతున్నానని, జట్టులో స్థానం కోసం చాలా కష్టపడ్డానని రైనా చెప్పాడు. కచ్చితంగా భారత్ తరపున ఆడతానని ఆశించానని, అందుకోసం ప్రతి క్షణం కష్టపడేవాడ్నని రైనా అన్నాడు. 2015లో ముంబాయిలో దక్షిణాఫ్రికాతో చివరిసారిగా వన్డేలు ఆడిన నిరుడు ఫిబ్రవరిలో టి20 సిరీస్ ఆడాడు. ఆ తర్వాత జట్టుకు దూరమయ్యాడు.

కోహ్లీకి ప్రత్యేక కృతజ్ఞతలు

తనలో సత్తా గుర్తించినందుకు కెప్టెన్ కోహ్లీకి రైనా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. జట్టులో ప్రతి ఆటగాడికీ కోహ్లీ ప్రత్యేకంగా ప్రాధాన్యత ఇస్తున్నాడని రైనా అన్నాడు. టి20లో విరాట్ కోహ్లీ మూడో స్థానంలో బరిలోకి దిగి ఎన్నో ఇన్నింగ్స్ ఆడాడని, ఈ సిరీస్‌లో మాత్రం తన కోసం ప్రత్యేకంగా తన స్థానాన్ని త్యాగం చేశాడని రైనా చెప్పాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపి స్వేచ్ఛగా ఆడమని కోహ్లీ ప్రోత్సహించాడని చెప్పాడు. వీలైన న్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడటం ద్వారా 2019 ప్రపంచ కప్‌లో ఆడే జట్టులో స్థానం సంపాదించటమే ఇప్పుడు లక్ష్యమని అన్నాడు. త్వరలో వన్డే టీమ్‌లోనూ ఆడటం ఖాయమని చెబుతున్నాడు.

వరల్డ్ కప్‌కు... ప్లాన్-ఎ రెడీ

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ




న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ అసమానమైన బ్యాటింగ్‌తో అన్ని విశేషణాలు మసకబారాయి. మరోవైపు తనను తాను ఆల్ రౌండర్‌గా నిరూపించుకునేందుకు జస్‌ప్రీత్ బుమ్రా అభ్యాసంతో ఒక సమస్యకు పరిష్కారం దొరికింది. దీంతో ఇంగ్లండ్‌లో వచ్చే ఏడాది జరగనున్న వరల్డ్ కప్‌కు టీమిండియా ప్లాన్-ఎను సిద్ధం చేసుకుంది. సౌతాఫ్రికా పర్యటనలో టీమిండియా అనేక పాజిటీవ్ అంశాలను తెలుసుకుంది. చాలా సంవత్సరాల తర్వాత ఉప ఖండం బయట టీమిండియా అంచనాలకు తగ్గట్టు రాణించింది. మూడు సిరీస్‌లకు గాను రెండింటిని కైవసం చేసుకుంది. సౌతాఫ్రికాలో ఏడు వారాల పాటు జరిగిన సుదీర్ఘ పర్యటనలో వెన్ను చూపని కోహ్లీ నిజంగా ప్రశంసనీయుడు. కోహ్లీ సేన అద్భుత ప్రతిభతో వన్డేల్లో 5-1తో టీ20ల్లో 2-1తో గెలిచినప్పటికీ టెస్టు సిరీస్‌లో ఓటమి సంపూర్ణతను ఇవ్వడం లేదు. వేదిక ఏదైనా టెస్టుల్లోనూ టీమిండియా గట్టి పోటీ ఇవ్వగలదనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. మహ్మద్ షమీ (3 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు), జస్‌ప్రీత్ బుమ్రా (3 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు), భువనేశ్వర్ కుమార్ (2 మ్యాచ్‌ల్లో 10 వికెట్లు), ఇషాంత్ శర్మ (2 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు) 60 వికెట్లకు గాను 47 వికెట్లు పడగొట్టారు. బ్యాటింగ్‌కు సహకరించే సెంచూరియన్ టెస్టు మ్యాచ్‌లో ఓడిపోవడం కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రిలను బాధించింది. కానీ బుమ్రా టెస్టు బౌలర్ సామర్థ్యాన్ని నిరూపించుకోవడం ఒక విధంగా ఆనందించదగ్గ విషయం.

'ఆదర్శవంతమైన తుది జట్టులో బుమ్రా పూర్తిగా ఇమిడిపోయాడు. సిరీస్‌లో అవసరమైనప్పుడు వికెట్లు తీసి మాకు ఉపశమనం కలిగించాడు. అంతేకాకుండా అతను వికెట్లను తీవ్రంగా కృషి చేశాడు. టెస్టు క్రికెట్‌లో హై క్లాస్ బౌలర్‌గా నిరూపించుకున్నాడు. 40, 50 మ్యాచ్‌లు ఆడిను అనుభవజ్ఞుడిలా బౌలింగ్ చేశాడు' అని కోహ్లీ ప్రశంసించాడు. పోటీతత్వ రెడ్ బాల్ క్రికెట్‌లో తన స్థానాన్ని స్థిరపరచుకునేందుకు ఈ గుజరాత్ బౌలర్ తీవ్రంగా కృషి చేశాయని చెప్పక తప్పదు. అయితే టెస్టుల్లో కోహ్లీ బ్యాటింగ్ సంతృప్తికరంగా లేదనే చెప్పాలి. మూడు టెస్టుల్లో 286 పరుగులు చేశారు. ఏబీ డివిలియర్స్ (211) కంటే 75 పరుగులు మాత్రమే ఎక్కువ చేయగలిగాడు. అయితే ప్రతి మ్యాచ్‌లో కోహ్లీ తన సహజసిద్ధమైన దూకుడు స్వభావాన్ని, ప్రవృత్తిని గానీ మార్చుకోలేదు. ఇది టెస్టుల్లో తగిన ఫలితమివ్వలేదు. అంతేకాదు తొలి టెస్టుల్లో అజింక్య రహానేను కాదని రోహిత్ శర్మపై నమ్మకముంచడంపై కోహ్లీపై తీవ్ర విమర్శలొచ్చాయి. రోహిత్ పేలవ ప్రదర్శన వన్డేల్లోనూ కొనసాగింది. కానీ కింగ్ కోహ్లీ ఆరు వన్డేల్లో మూడు సెంచరీలు చేశాడు. దీంతో కోచ్ రవిశాస్త్రి విభిన్నమైన ప్రశంసలు చేశారు. 'మీరు కోహ్లీ ప్రశంసించాలంటే కొత్త పదాలు వెతుక్కోవాలి. అందుకు దయచేసి ఆక్స్‌ఫోర్డ్ డిక్షనరీని కొనుక్కోండి' అని శాస్త్రి చెప్పారు. వన్డే సిరీస్‌లో కోహ్లీ మొత్తం 558 పరుగులు చేయడంతో పాటు 5-1తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంతో టెస్టుల్లో ఓటమిని అందరూ మర్చిపోయారు. ఫాఫ్ డు ప్లెసిస్, ఏబీ డివిలియర్స్ లేకపోవడంతో మరింత ఉత్తమమైన పాత్రను పోషించేందుకు కోహ్లీకి అవకాశం లభించింది. అలాగని ప్రతి మ్యాచ్‌లో టీమిండియా కనబరిచిన తీక్షణతను కాదనలేము. కానీ ఈ పర్యటనలో టీమిండియాకు లాభించిన అంశమేంటంటే.. కొద్దో గొప్పో వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో జరగనున్న వరల్డ్ కప్‌కు 'ప్లాన్-ఎ' సిద్ధమైంది. ఇద్దరు యువ మణికట్టు స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్ 33 వికెట్లు తీసి తమకు సహకరించని పిచ్‌పై మ్యాచ్ విన్నింగ్స్ సామర్థ్యాన్ని కనబరిచారు. ఆల్ రౌండర్లు భువనేశ్వర్, బుమ్రా, హార్దిక్ పాండ్యాలతో ఐదుగురు బౌలర్ల బౌలింగ్ అటాక్ సిద్ధమైంది. అయితే వచ్చే ఏడాది వరల్డ్ కప్ వరకు మహేంద్ర సింగ్ ధోనీ జట్టులో కొనసాగుతాడో లేదో ఖచ్చితంగా చెప్పలేకపోయినప్పటికీ బ్యాటింగ్ లైనప్‌లో శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మాత్రం 1, 2, 3 స్థానాల్లో కొనసాగనున్నారు. అయితే 4, 5 స్థానాల్లో ఎవరిని ఆడించాలన్నదానిపై మెన్ ఇన్ బ్లూ ఒక నిర్ణయానికి రావాల్సి వుంది. ఈ రెండు స్థానాలకు ఐదుగురు క్రికెటర్లు పోటీ పడుతున్నారు. మిడిల్ ఓవర్లలో అజింక్యా రహానే స్ట్రైక్ రేట్ తీవ్ర పరిశీలనలో ఉన్నప్పటికీ 2015లో ఆస్ట్రేలియాలో జరిగిన వరల్డ్ కప్‌లో 4వ నంబర్ బ్యాట్స్‌మన్‌గా రాణించాడంతో అతడిని పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. మరోవైపు మనీష్ పాండే వన్డేల్లో తనకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. కాగా కేదార్ జాదవ్ ప్రత్యర్థి కన్నుగప్పి పరుగులు సాధించగల సమర్థుడు. అంతేకాకుండా అతని ఆఫ్ బ్రేక్ బౌలింగ్ ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు చిరాకు తెప్పించే అంశం. తర్వాత శ్రేయాస్ అయ్యర్ సహజసిద్ధమైన స్ట్రోక్ ప్లేయర్. దేశవాళీ స్థాయిలో ఇతను అద్భుత ప్రతిభ కనబరిచాడు. ఇక చివరిగా వెటరన్ ప్లేయర్ సురేష్ రైనా గతంలో ఎన్నడూ లేనంతగా ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పరుగుల కోసం తాపత్రయపడ్డాడు. చివరి టీ20లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకోవడం రైనాలోని ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. వన్డే జట్టులోకి రావడానికి తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నానని గతంలో రైనా అన్నాడు.

ఎప్పటిలాగే కోచ్ శాస్త్రి జట్టు ప్రతిభపై సంతృప్తి వ్యక్తం చేశాడు. 'వరల్డ్ కప్ సిద్ధపాటు దృష్టితో చూస్తే జట్టు ప్రతిభ బాగుంది. ఎందుకంటే ఒక్కో అడుగు ముందుకు వేయాలనుకుంటున్నాం. సౌతాఫ్రికా పర్యటనలో కొన్ని మంచి అంశాలను నేర్చుకున్నాం. ఇది యువకులతో కూడిన జట్టు. మున్ముందు ఈ జట్టు మరింత కఠినమైన పర్యటనలను ఎదుర్కొనుంది. ఈ టూర్‌లో తమను తాము అద్భుతంగా మలచుకున్నారు. 1992 నుంచి ఇక్కడికి వస్తున్నాను. సౌతాఫ్రికా జట్టు సొంత గడ్డపై బలమైనదని చరిత్ర చెబుతోంది' అని శాస్త్రి చెప్పారు.






ఫిట్‌నెస్‌పైనే దృష్టి : సమీర్‌వర్మ



న్యూఢిల్లీ: ఫిట్‌నెస్‌ను మెరుగుపరచుకునే ందుకు కష్టపడుతున్నానని యంగ్‌బ్యాడ్మింటన్ స్టార్ సమీర్ వర్మ తెలిపాడు. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించే వరకూ తానెలాంటి లక్ష్యాలను పెట్టుకోలేదన్నాడు. బసెల్‌లో ఆదివారం జరిగిన స్విస్ ఓపెన్ సూపర్ సిరీస్ టోర్నీలో డెన్మార్క్ ప్లేయర్, మాజీ వరల్డ్ నంబర్ టూ ఆటగాడు జార్జెన్‌సెన్‌ను ఓడించి సమీర వర్మ తొలిసారి టైటిల్‌ను గెలిచాడు. సమీర్ పలు మార్లు గాయాలతో అంతర్జాతీయ టోర్నీలకు దూరమయ్యాడు. వచ్చే అంతర్జాతీయ టోర్నీలపై తనకెలాంటి అంచనాలు లేవని సమీర్ తెలిపాడు. 'ఫిట్‌గా ఉండటం ముఖ్యం, అదే నా ఫస్ట్ టార్గెట్, మిగతా వాటి గురించి ఆలోచించటం లేదు' అని సమీర్ అన్నాడు. కోచ్, ఫిజియోల సూచనలు, సలహాలతో ఫిట్‌నెస్‌ను మెరుగుపరచుకుంటున్నానన్నాడు . పోయినేడాది లక్నోలో జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రి టోర్నీలో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చిన సమీర్ ఆ తర్వాత ఇండియా సూపర్ సిరీస్‌లో క్వార్టర్ ఫైనల్ దాకా చేరుకున్నాడు. అయితే ఆ తర్వాత ఇండోనేసియా, ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలకు గాయంతో దూరమయ్యాడు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఆడినప్పటికీ భుజం గాయంతో క్వార్టర్ ఫైనల్స్‌కే పరిమితమైన సమీర్ ఆ తర్వాత జరిగిన టోర్నీలకు దూరమయ్యాడు. ఇండోనేసియాలో జరిగిన ప్రీమియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఆడినప్పటికీ క్వార్టర్ ఫైనల్లోనే ఓడిపోయాడు. కామన్‌వెల్త్ క్రీడల్లోనూ, ఆ తర్వాత ఆలింగ్లండ్ టోర్నీలోనూ ఆడే భారత జట్టుకు దూరమైనప్పటికీ ఆసియా క్రీడల్లో ఆడతానని చెబుతున్నాడు.

కింగ్స్ లెవెన్ పంజాబ్ కెప్టెన్‌గా అశ్విన్



న్యూఢిల్లీ : వచ్చే ఐపీఎల్ సీజన్‌లో ఆడే కింగ్స్ లెవెన్ పంజాబ్ జట్టుకు స్పిన్నర్ అశ్విన్ పగ్గాలు చేపట్టనున్నాడు. అశ్విన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు పంజాబ్ టీమ్ మెంటర్ సెహ్వాగ్ ప్రకటించాడు. జట్టులో యువరాజ్ లాంటి సీనియర్లున్నప్పటికీ అశ్విన్‌కే పంజాబ్ జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించింది. ఐపీఎల్‌లో తొలిసారి కెప్టెన్సీ చేపడుతున్న అశ్విన్‌ను పంజాబ్ జట్టు 7.6 కోట్లకు కొనుగోలు చేసింది. తమిళనాడుతో పాటు పలు జాతీయ టోర్నీల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన అశ్విన్ 2009 నుంచి 2015 వరకు చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడాడు. 2006లో పూణె జట్టు అశ్విన్‌ను సొంతం చేసుకుంది. 2017 ఐపీఎల్ సీజన్‌లో గాయం కారణంగా అశ్విన్ టోర్నమెంట్‌కు దూరంగా ఉన్నాడు.



మిగతా క్రీడలకు

ప్రభుత్వ సాయం అవసరం

న్యూఢిల్లీ: కీడాకారులకు ప్రభుత్వ సాయం మరింత అవసరమని, సొంత ఖర్చులతో కామన్‌వెల్త్ క్రీడలకు భారత ఆటగాళ్లను పంపే స్తోమత లేదని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బాత్రా స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులు ఇవ్వకపోతే కేవలం క్రికెట్ మాత్రమే ఉంటుందని అన్నాడు. 'ఆర్థికంగా స్వతంత్రంగా ఉండటం మంచిదే. ప్రభుత్వం నిధులివ్వకపోతే క్రికెట్ మినహా దేశంలో మరే క్రీడా ఉండదు' అని అన్నారు. ఏప్రిల్ 4 నుంచి 15 వరకు ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లోజరిగే కామల్‌వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత జట్లకు స్పాన్సర్లను బాత్రా ప్రకటించారు. ఇక ఒలింపిక్ సంఘంలో మరింత పారదర్శకత అవసరమని కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ అన్నారు. దేశంలో క్రీడా సంఘాల పనితీరును మెరుగుపరిచేందుకు ఒలింపిక్ సంఘం మరింత శ్రద్ధపెట్టాలన్నారు. సొంతంగా నిధులు సమకూర్చుకునే స్థాయికి ఒలింపిక్ సంఘం, నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఎదగాలని ఆకాంక్షించారు. 2020 ఒలింపిక్స్‌కోసం కామన్‌వెల్త్ క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని ఈ క్రీడల్లోభారత ఆటగాళ్లు రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

ఎడిల్‌వీజ్‌తో ఐఓఏ ఒప్పందం


ప్రముఖ ఫైనాన్స్ సంస్థ ఎడిల్‌వీజ్‌తో భారత ఒలింపిక్ సంఘం భారీ ఒప్పందం కుదుర్చుకుంది. 2020 ఒలింపిక్స్‌తో పాటు, ఈ ఏడాది కామన్‌వెల్త్, ఆసియా క్రీడల్లో ఆడే భారత జట్లకు స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. ఈ అంతర్జాతీయ క్రీడలతో పాటు 2018, 2019 జాతీయ క్రీడలకు కూడా ఎడిల్‌వీజ్ స్పాన్సరర్‌గా ఉంటుంది. గోల్డ్ కోస్ట్‌లో ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీ వరకు జరిగే కామన్‌వెల్త్ క్రీడల్లో ఆడే భారత జట్టకు అధికారిక డ్రెస్ పార్ట్‌నర్‌గా రేమండ్స్ సంస్థను ఎంపిక చేసింది. కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ సమక్షంలో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బాత్రా, సెక్రటరీ జనరల్ రాజీవ్ మెహతా భారత జట్ల కామన్వెల్త్ గేమ్స్ దుస్తులను అధికారికంగా విడుదల చేశారు. 227 మంది అథ్లెట్లతో ఈ కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ బరిలోకి దిగుతుంది. కామన్‌వెల్త్ క్రీడల్లో ఆడే ఆటగాళ్లకు 50 లక్షల రూపాయల ఇన్స్యూరెన్స్‌ను ఇస్తున్నట్టు ఎడిల్‌వీజ్ సంస్థ ఈ సందర్భంగా ప్రకటించింది. ఎడిల్‌వీజ్ సంస్థతో ఒప్పందం భారత క్రీడారంగంలో ఒక గొప్ప అధ్యాయమని, ఈ ఒప్పందం ద్వారా ఆటగాళ్లకు ఎంతో ప్రోత్సాహ ముంటుందని ఐఓఏ అధ్యక్షుడు బత్రా అన్నారు. 2020 ఒలింపిక్స్‌లో ఆడే భారత ఆటగాళ్లకు ఇలాంటి ప్రవేటు సంస్థల ప్రోత్సాహం ఎంతో ఉపయోగపడుతుందని బాత్రా తెలిపారు. గతంలో కొన్ని క్రీడలకు మాత్రమే స్పాన్సర్‌షిప్ ఉండేదని, ఇప్పుడు అన్ని క్రీడలకు స్పాన్సర్లు లభించడం మంచి పరిణామనని అన్నారు.

బెస్ట్ బాక్సర్ వికాస్ కృష్ణన్

స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీ

న్యూఢిల్లీ: భారత బాక్సర్ వికాస్ కృష్ణన్ బల్గేరియా రాజధాని సోఫియాలో ముగిసిన స్ట్రాంజా మోమోరియల్ బాక్సింగ్ టోర్నీలో డబుల్ ధమాకా సాధించాడు. ఈ టోర్నీలో స్వర్ణం గెలుచుకున్న వికాస్ తొలి సారిగా బెస్ట్ బాక్సర్ అవార్డును అందుకున్నాడు. 75 కిలోల మిడిల్‌వెయిట్ ఈవెంట్‌లో వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అమెరికాకు చెందిన ఇస్లీని చిత్తు చేసి స్వర్ణం గెలచుకున్న వికాస్ ఏడాది క్రితం జరిగిన ఆసియా చాంపియన్‌షిప్ తర్వాత తొలిసారి అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు పతకాన్ని అందించాడు. చేతి గాయంతో ఆసియా చాంపియన్‌షిప్ నుంచి తప్పుకున్న వికాస్ ఈ పతకంతో గ్రాండ్ రీ ఎంట్రీ ఇచ్చాడు. ఈ విజయం తనకెంతో సంతోషాన్నిచ్చిందని వికాస్ అన్నాడు. స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో రెండు స్వర్ణాలు, మూడు రజత, నాలుగు కాంస్యాలతో భారత్ మొత్తం 11 పతకాలు గెలుచుకుంది. ఇందులో మహిళా బాక్సర్లు 6 పతకాలు గెలుచుకోగా, పురుషుల విభాగంలో 5 పతకాలు భారత్‌కు దక్కాయి. చాలా బలమైన ప్రత్యర్థులను ఓడించానని ఈ టోర్నీ ద్వారా ఆత్మవిశ్వాసం పెరిగిందని వికాస్ చెప్పాడు.





గవాస్కర్, ఇయాన్ చాపెల్ చెప్పినా వినలేదు

గ్రెగ్ చాపెల్ నియామకంపై ఆత్మకథలో గంగూలీ

న్యూఢిల్లీ: తన క్రికెట్ కెరీర్‌లో పీడగలగా మిగిలిన కోచ్ గ్రెగ్ చాపెల్ గురించి ఆత్మకథ 'సెంచరీ ఈజ్ నాట్ ఇనఫ్'లో మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మరికొన్ని ఆసక్తికర అంశాలను వెల్లడదించాడు. ఎవరి మాటా వినిపించుకోకుండా గ్రెగ్ చాపెల్‌ను కోచ్‌గా అంగీకరించడంతో ఎదురైన కష్టాలను గంగూలీ ఆత్మకథలో ప్రత్యేకంగా రాసుకున్నాడు. 2005లో భారత జట్టకు కోచ్‌గా గ్రెగ్ చాపెల్ బాధ్యతలు చేపట్టటానికి ముందు అనేక అనుభవాలు ఎదురయ్యాయని గంగూలీ వివరించాడు. చాపెల్ నియామకంపై అతని సోదరుడు ఇయాన్ చాపెల్, మాజీ కెప్టెన్ గవాస్కర్‌లు వద్దన్నా వినలేదని ఫలితంగా చాలా కష్టాలు ఎదుర్కొన్నానని వివరించాడు. 2003 ఆస్ట్రేలియా పర్యటన సమయంలో అత్యుత్తమ పరిజ్ఞానంతో గ్రెగ్ తనను ఆకట్టుకుందుకే కోచ్‌గా నియమించాలని పట్టుబట్టానని గంగూలీ అన్నాడు. కొత్త కోచ్ కోసం వెతుకుతున్న సమయంలో గ్రెగ్ చాపెల్ పేరును అప్పటి బీసీసీఐ అధ్యక్షుడు దాల్మియాకు సూచించానని ఆత్మకథలో వివరించాడు. ఈ విషయంపై చర్చిద్దామని దాల్మియా కూడా చెప్పారని, తన నిర్ణయాన్ని వ్యతిరేకించిన వారిలో గవాస్కర్ కూడా ఉన్నాడని గంగూలీ చెప్పాడు. అయితే ఆ హెచ్చరికలన్నీ విస్మరించానన్నాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.